వారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-7-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 166 పేజీలు: 10+4 వెల: 6.50


21 నుంచి వర్షాకాల పార్లమెంటు సమావేశాలు
వారానికి 100 గంటలు పనిచేసే ప్రధాని మోడీ 5

గోదావరి బోర్డు తెలంగాణ, కృష్ణాబోర్డు ఎపి

శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు అంగీకరించిన ఎపి

సుహృద్భావ వాతావరణంలో చంద్రబాబు, రేవంత్ చర్చలు, అవసరమైతే మరోసారి భేటీ

బనకచర్ల కడతామని ఎపి చెప్పలేదు, ఆపమని మేమూ అడగలేదు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్‌పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం


బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ సమక్షంలో భేటీ అయిన తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్, చంద్రబాబు

## కృష్ణా, గోదావరి జలాల
# వివాదాలపై కమిటీ
### తెలంగాణ, ఎపి సిఎంల నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై16:** తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలపై చర్చించేందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సారథ్యంలో జరిగిన ఈ భేటీ గంటన్నర పాటు జరిగింది. భేటీ ప్రారంభంలో సీఆర్ పాటిల్‌తో పాటు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు పరస్పరం గౌరవంగా షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు. ఈ భేటీకి ఏపీ, తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటి పారుదల శాఖ కార్యదర్శులు, పలువురు ఇంజినీర్లు హాజరయ్యారు. ఢిల్లీలోని జలశక్తి కార్యాలయంలో జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఇద్దరు సిఎంల మధ్య సమావేశంలో అంగీకరించిన అంశాలు..1. ప్రాజెక్టుల నుంచి నీటి >>2

### రిజర్వాయర్ల వద్ద టెలిమెట్రీల ఏర్పాటుకు
## ఎపి అంగీకారం
### -మంత్రి ఉత్తమ్ కుమార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై16:** అన్ని రిజర్వాయర్లు, కాలువల వద్ద టెలీమెట్రీలను ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం >>2

## 'స్థానిక' పోరుకు
# సిద్ధంకండి
### ఆదేశాలు జారీ చేసిన సర్కార్
### ఏర్పాట్లు చేస్తున్న ఇసి
### 566 ఎంపిపి, 566 జడ్‌పిటిసి, 31 జడ్‌పిపి, 5773 ఎంపిటిసిలకు ఎన్నికలు

**హైదరాబాద్,జులై 16,ప్రభాతవార్త:** తెలంగాణ మరో ఎన్నికల పోరుకు సిద్ధం కానుంది. తెలంగాణాలో స్థానిక సంస్థల ఎన్నికలకలు ఏ క్షణాన అయినా రావొచ్చు అని తెలుస్తోంది. ఎన్నికలకు అంతా. సిద్ధంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రిని రెడీ చేసుకోవాలని పేర్కొంది. ఇప్పటికే రాష్ట్రంలో జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలు ఖరారైనట్టు సమాచారం.సెప్టెంబర్ 30 లోగా తెలంగాణాలో స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తయారు చేసి ఇప్పటికే గవర్నర్ వద్దకు పంపింది. గవర్నర్ సంతకం అనంతరం రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు తెరలేవనుంది తెలుస్తోంది.అన్ని ఏర్పాట్లు అనుకుననవి అనుకున్నట్లు జరిగితే 566 ఎంపిపిలు, జడ్‌పిటిసిలు 566, జెడ్పీపిలు 31, ఎంపిటిసీలు 5773లకు ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ఉన్న జడ్‌పిపి, జడ్‌పిటిసి, ఎంపిపిఎస్, ఎంపిటిసి స్థానాలు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్‌లో జడ్‌పిపిలు స్థానాలు 1, జడ్‌పిటిసిలు 20, ఎంపిపిలు, 20 ఎంపిటిసిలు 166 ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జడ్‌పిపిలు1, జడ్‌పిటిసిలు 22, ఎంపిపిలు 22, ఎంపిటిసిలు 233, హన్మకొండలో 1 జడ్‌పిపి, 12 జడ్‌పిటిసి, ఎంపిపిలు 12. ఎంపిటిసిలు 129, జగిత్యాల జిల్లాలో 1 జడ్‌పిపి, ఎంపిపలు 20. ఎంటిసిలు 20, ఎంపిటిసిలు 216, జనగాంలో జడ్‌పిపిలు 1, జడ్‌పిటిసిలు, 12, ఎంపిపిలు 12, ఎంపిటసిలు 134, జయశంకర్ భూపాలపల్లిలో జడ్‌పిపిలు 1, జడ్‌పిటిసిలు 12, ఎంపిపిలు 12 ఎంపిటిసిలు 109, జోగులాంబ గద్వాల్‌లో జడ్‌పిపిలు1 జడ్‌పిటీసీలు 13, ఎంపిపిలు13, ఎంపిటిసిలు 142లు ఉండగా కామారెడ్డిలో జడ్‌పిటిసిలు 1, జడ్‌పిటిసిలు 25, ఎంపిపిలు 25, ఎంపిటిసిలు 233, కరీంనగర్‌లో జడ్‌పిపిలు1, ఎంపిపిలు15, జెడ్‌పిటిసిలు 15, ఎంపిటిసిలు 283, ఖమ్మంలో >>2

## ముసుగు వీడింది.. కోవర్టులెవరో తేలింది
### చంద్రబాబు, రేవంత్ భేటీపై కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై16:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. "ముసుగు వీడింది, నిజం తేటతెల్లమయింది.. 48వ ఢిల్లీ పర్యటన గుట్టు రట్టయింది" అంటూ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "తెలంగాణ వ్యతిరేకిని ముఖ్యమంత్రిగా గెలిపించినందుకు నిధులు రాహుల్ గాంధీకి, నీళ్ల చంద్రబాబుకి... బూడిద తెలంగాణ ప్రజలకి!" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇరు రాష్ట్రాల సమావేశంలో బనకచర్ల గురించి చర్చకు రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుకాయించారని ఆరోపించారు. గురుదక్షిణగా గోదావరి జలాలను అప్పజెప్పటం కోసమే రేవంత్ రెడ్డి గద్దెనెక్కారా? అని నిలదీశారు. జై తెలంగాణ అనడానికి ఉన్న సిగ్గు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల హక్కులను చంద్రబాబుకి ధారపోయడానికి మాత్రం లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కోవర్టులు ఎవరో, తెలంగాణ కోసం కొట్లాడిన వారు ఎవరో ఈరోజుతో తేలిపోయింది. నీ గురువుపై విశ్వాసం చూపించడానికి తెలంగాణ విధ్వంసం కావలసిందేనా? ఇంకెందుకు రెండు రాష్ట్రాలు, ఇద్దరు ముఖ్యమంత్రులు? నిన్ను ఎన్నుకున్న పాపానికి సరిహద్దులు చెరిపేయి. అప్పుడు తెలంగాణా మీద >>2

## కూరగాయల ధరలకు రెక్కలు
### గత నెల కంటే 10 శాతం పెరుగుదల



**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. గత సంవత్సరంతో పోలిస్తే అవసరమైన కూరగాయల ధరలు 10 శాతం వరకు పెరగడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గత నెలలో బీన్స్ కిలో రూ.55 ఉండగా, ప్రస్తుతం అది రూ.90 కు పెరిగింది. అలాగే రూ.55 ఉండే క్యాప్సికమ్ రూ.80, రూ.50 ఉండే చిక్కుడు (బ్రాడ్ బీన్స్) రూ.75, పచ్చి మిరపకాయలు రూ.45 నుండి రూ.60 కు, బజ్జీ మిర్చి రూ.35 నుండి రూ.55, లేడీ ఫింగర్ (ఒకే) రూ.35 నుండి 45 కు ఇలా అన్ని కూరగాయల ధరలు పెరిగాయి. కాగా తెలంగాణలో సాధారణంగా ఏటా12.94 లక్షల ఎకరాల్లో కూరగాయలు మరియు ఆకు కూరల సాగు జరుగుతుంది. ఇందులో దాదాపు 60 శాతం ఏప్రిల్‌లో రుతుపవనాలకు ముందు విత్తుతారు. జూన్ వరకు పంటలు కొనసాగుతాయి, జూలై ప్రారంభం వరకు ధరలు అందుబాటులో ఉంటాయి. అయితే, ఈ సంవత్సరం, సాగు ఆశాజనకంగా ప్రారంభమైనప్పటికీ, జూన్‌లో తీవ్ర వర్షాభావం వల్ల పంట దిగుబడి తగ్గింది. ప్రధానంగా టమోటాలు, బెండకాయ, కాకరకాయ, క్లస్టర్ బీన్స్, రిడ్జ్ గుమ్మడికాయ మరియు ఐవీ గుమ్మడికాయ వంటి పంటలన్నీ ప్రభావితమయ్యాయి, ఫలితంగా సరఫరా పరిమితంగా ఉంది. ఈ వర్షాకాలంలో, >>2



# 100 జిల్లాల్లో
## పిఎం ధన్, ధాన్య కృషియోజన
### రైతులకు మరింత ప్రయోజనం
### ఎన్‌టిపిసిలో రూ. 20 వేలకోట్ల పెట్టుబడులకు అనుమతి
### శుభాంశు శుక్లాకు అభినందనలు
### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ, జూలై 16:** దేశంలోని100 జిల్లాలను కవర్‌చేస్తూ ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషియోజనను మరో ఆరేళ్లపాటు అమలుచేయాలని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. నీతి ఆయోగ్ స్ఫూర్తిదాయక జిల్లాల పథకం కింద ఈ వంద జిల్లాలను ధన్ ధాన్యకృషియోజన అమలుచేసేందుకు నిర్ణయించింది. ఈ స్కీంలో వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, భిన్నరకాల పంటలు వేయడం, సుస్థిరసాగు విధానాలు, పంటదిగుబడి అయ్యాక నిల్వసౌకర్యాలను పెంచుకోవడం, వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఈపథకం కింద ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. పంచాయతీ, బ్లాక్‌స్థాయిల్లోనే సాగు సౌకర్యాలను మెరుగుపరిచి దీర్ఘకాలి, స్వల్పకాలిక రుణపరపతులను కూడా అందుబాటులోకి తెస్తుంది. మొత్తం 100 జిల్లాలను ఈ పథకం కింద అభివృద్ధిచేస్తారు. ప్రస్తుతం అమలులో ఉన్న 11 శాఖల్లోని 36 పథకాలను ఈస్కీంకింద రైతులకు చేరువచేస్తారు. ఇతర రాష్ట్రప్రభుత్వ పథకాలు కూడా అమలుకు >>2

## అక్టోబర్‌లో హైదరాబాద్ వేదికగా
# ఒబిసి సలహామండలి భేటీ
### బెంగళూరు సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్
### బిసి రిజర్వేషన్లలో తెలంగాణ రోల్‌మోడల్


బెంగళూరులో బుధవారం నిర్వహించిన ఒబిసి సమావేశంలో పాల్గొన్న కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, మంత్రి పొన్నం, పిసిసి చీఫ్ మహేష్ తదితరులు

**హైదరాబాద్, జూలై 16,ప్రభాతవార్త:** అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఒబిసి సలహామండలి సమావేశం అక్టోబర్‌లో హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్నామని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమారగౌడ్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో బుధవారం ముఖ్యమంత్రి, ఒబిసిసలహామండలి చైర్మన్ సిద్ధిరామయ్య అధ్యక్షతన జరుగుతున్న ఎఐసిసి ఒబిసి సలహా మండలి సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రసంగించారు. ఒబిసి సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లలో తెలంగాణ రోల్ మోడల్ అని చెప్పుకొన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో నేను భాగస్వామ్యం కావడం అదృష్టమని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బిసి డిక్లరేషన్ ను కామారెడ్డి లో ప్రవేశపెట్టినా, బిల్లు చేసిన సమయంలో టిపిసిసి అధ్యక్షులుగా పాత్ర పోషించినాని మహేష్ కుమార్‌గౌడ్‌చెప్పారు. బిసి రిజర్వేషన్ల కార్యక్రమంలో రాహుల్, సీఎం రేవంత్ రెడ్డి నేను సైనికులుగా పని చేసామని అన్నారు. మనమెంతో మనకాంత అన్న నినాదాన్ని సమగ్రంగా అమలు చేసేందుకు వెనుకబడిన తరగతుల ప్రజలు సంఘటితం కావాలని కోరారు. ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ కలలు కన్న బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నదని, దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని టిపిసిఇ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.ఎన్నికల ముందు కామారెడ్డి బిసి డిక్లరేషన్ సమయంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధిరామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొనగా తాను అప్పట్లో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ గా బిసి డిక్లరేషన్ ను ప్రతిపాదించడం జరిగిందని అన్నారు.ఇప్పుడు ప్రభుత్వం వచ్చాక నాకు టిపిసిసి అధ్యక్షులుగా అవకాశం వచ్చిందని అటు ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి అగ్రవర్ణ నాయకులు అయినా బిసి రిజర్వేషన్లకు సంపూర్ణ సహకారాన్ని అందించి రిజర్వేషన్లు అన్ని రకాలుగా న్యాయ, చట్ట, రాజకీయ పరంగా ఎక్కడ ఇబ్బందులు కాకుండా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారని అన్నారు. తెలంగాణ లో అగ్రవర్ణ నాయకులు అయినా కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి రిజర్వేషన్లు అంశంలో తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ పై సభికుల చేత హర్షధ్వానాలు చేయించారు.ఎఐసిసి అగ్రనేత భారత్ జోడో యాత్రలో బిసి రోజా6 అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారని >>2

## రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆర్పీసింగ్ దంపతులపై కేసు 3



## సిఐడి కస్టడీకి జగన్మోహాన్, మరో నలుగురు
### హెచ్‌సిఎ గోల్‌మాల్ కేసు

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** సంచలనం రేపిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) నిధుల గోల్‌మాల్ కేసులో అరెస్టయిన అధ్య క్షుడు జగన్‌మోహన్ రావుతో పాటు కోశాధికారి శ్రీనివాసరావు, సీఈఓ సునీల్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ కార్యదర్శి రాజేందర్ యాదవ్, అధ్యక్షురాలు కవిత లను ఆరు రోజుల సిఐడి కస్టడీకి ఇస్తూ మల్కాజిగిరి కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌సిఎ అక్రమాలను వెలికి తీసేందుకు వీరిని పది రోజుల పాటు కస్టడీలోకి ఇవ్వాలని సిఐడి కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. అయితే సిఐడి కస్టడీ పిటిషన్‌ను కొట్టి వేయాలని నిందితుల తరపున మరో పిటిషన్ దాఖలయ్యింది. దీంతో పాటు ఈ కేసులో నిందితులకు బెయిల్ మంజూరు చేయాలని కూడా అందులో కోరారు. అయి తే నిందితుల తరపున దాఖలైన పిటిషన్‌పై పిపి అభ్యంతరం తెలిపారు. హెచ్‌సిఎలో పదుల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని, దీనికి సంబ ంధించిన అన్ని విషయాలు వెలుగు చూడాలంటే నిందితులను కచ్చితంగా కస్టడీలోకి >>2

### సిఎం ఆదేశాలతో త్వరలో 90 రోజుల కార్యాచరణ
### 300 గజాలపైన ఉన్న ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి: జలమండలి ఎండి అశోక్ రెడ్డి

# ఇంటికో ఇంకుడు గుంత



**హైదరాబాద్, జూలై 16 ప్రభాతవార్త:** జలమండలి పరిధిలో 200 గజాల ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు అవసరం... 300 గజాల పైన ఉన్న ప్రతి ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరి నిర్మాణం చేసుకోవాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో రానున్న 3 నెలలు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ యేడాది వర్షాభావ పరిస్థితులలో వర్షాలు సకాలములో పడక పోవడంతో చాలా ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని తెలిపారు. దీంతో ట్యాంకర్ డిమాండ్ ప్రతి సంవత్సరం కొంత మేరకు క్రమంగా పెరుగుతుందని వివరించారు. గత యేడాది ట్యాంకర్ అధికంగా బుక్ చేసిన ప్రాంతాలలో ట్యాంకర్ బుకింగ్ పెరిగిన కారణాలకోసం సర్వే నిర్వహిస్తే, బోరుబావుల మీద ఆధారపడి, భూగర్భ జలాలు అంటడిగి, బోరులు ఎండిపోయి జలమండలి ట్యాంకర్ల మీద ఆధారపడినట్లు గుర్తించారు. అందులో 42 వేల నివాసాలను గుర్తించి సగానికి పైగా ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు లేవని, మిగతావారు తమ ఇంకుడు గుంతలను ప్రతియేటా వర్షాకాలంలో సరైన స్థితిలో నిర్వహించడం లేదని సర్వేలో తేల్చారు. ఓఆర్ఆర్ పరిధిలోని 200 గజాల ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. అలాగే, 300 గజాల పైన ప్రతి నివాసంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించుకునేలా అవగాహన కల్పించడానికి త్వరలో 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎండి తెలిపారు. ఇందుకోసం ఎన్‌జిఓల సహాయంతో ఇప్పటికే 12 వేల ఇంకుడు గుంతల నిర్మాణం, పునర్నిర్మాణం(మెంటనేన్స్) చేశామన్నారు. మరో 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మాణం కోసం నోటీసులు జారీ చేయడానికి కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోడానికి ఈ వర్షాకాలమే సరైన సమయమని, ఇప్పుడు నిర్మిస్తే వర్షం కురిసిన ప్రతి చుక్క భూగర్భంలో ఇంకిం చేలాగా ప్రతిఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అందువలన భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తవని అన్నారు. బుక్ చేసిన 24 >>2



బుధవారం గంగా నది ఉధృతి కారణంగా పాక్షికంగా మునిగిపోయిన దశాశ్వమేధ ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

# 100 జిల్లాల్లో

## పిఎం ధన్, ధాన్య కృషియోజన

>> వస్తాయి. ఉత్పత్తి, విభిన్న పంటలసాగు, తక్కువ సాగుతో ఎక్కువ దిగుబడులు, రుణపరపతి తక్కువ ఉన్న జిల్లాలను ఎంపికచేస్తారు. ప్రతి రాష్ట్రంనుంచి కనీసం ఒక్క జిల్లా అయినా ఎంపికచేస్తారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పథకం అమలుకోసం కమిటీలు ఏర్పాటుచేస్తారు. జిల్లా ధన్‌ధాన్య సమితి ఈ ప్రనణాళిక అమలుచేస్తుంది. కేంద్ర ప్రభుత్వపరిధిలోని ఎనల్‌సిఐఎల్ కంపెనీ ఏడువేల కోట్లు తన అనుబంధ విభాగాల్లో పెట్టుబడులు పెట్టుకునేందుకు ఆమోదం తెలిపింది. ఎన్‌ఎల్‌సి రెన్యువబుల్స్ ఇండియాలో పెట్టుబడులుపెడితే ఆ తర్వాత ఎన్‌ఐఆర్‌ఎల్ వివిధ ప్రాజెక్టుల్లో జాయింట్‌వెంచర్లలోను పెట్టుబడులు పెడుతుంది. అయితే ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థ విధించిన 30శాతం సీలింగ్‌పరిధిలోకి ఈ వ్యవస్థరాదు. పునరుత్పత్తి వ్యవస్థలో ఎన్‌ఎల్‌సిఐఎల్ రెండు గిగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తోంది. రానున్నకాలంలో వాణిజ్యకార్యకలాపాలకు కూడా వస్తోంది. అలాగే మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఎన్‌టిపిసి తన అనుబంధంగా ఉన్న ఎన్‌టిపిసి రెన్యువబుల్ ఎనర్జీలోను, ఇతర జాయింట్ వెంచర్లు, అనుబంధ సంస్థల్లో పెట్టుబడులు పెంచుకునే సౌకర్యం ఉఇంది. కేబినెట్‌ఇందుకు అనుగుణంగా 20 వేలకోట్లకు మించకుండా పెట్టుబడులకు అనుమతులిచ్చింది. 2032నాటికి 60 గిగావాట్ల పునరుత్పత్తి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తుంది. శిలాజ ఇంధన సామర్థ్యం 2030 నాటికి 500 గిగావాట్లవరకూ ఉండాలని నిర్ణయించారు. 2070 నాటికి కర్బన ఉద్గారాలే లేని ఇంధన ఉత్పత్తిసాధన లక్ష్యంగా ఎన్టీపీసి ముందుకువెళుతోంది. కేబినెట్ సమావేశంలోముందు గ్రూప్‌కెప్టెన్ శుభాంశు శుక్లా రోదసి యాత్రనుంచి విజయవంతంగా తిరిగిరావడంపై అభినందనలు తెలుపుతూ తీర్మానించింది. 18రోజుల రోదసీ యాత్రతో శుభాంశు భారత ప్రతిష్టను అంతర్జాతీయంగా ఇనుమడింపచేసారని కేబినెట్ అభినందనలు తెలిపింది. యాక్సి యమ్-4 క్రూ సిబ్బందితో శుభాంశు యాత్ర అంతర్జాతీయ రోదసి సహకారంలో భారత్ నాయకత్వ స్థాయిని మరింత పెంపొందింపచేసిందని ప్రధానిమోడీ, కేబినెట్‌మంత్రులు శుభాంశును అభినందించారు. సమావేశంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా, ఆర్థిమంత్రి నిర్మలా సీతారామన్ ఇతర కీలక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ముసుగు వీడింది..

## కోవర్టులెవరో తేలింది

>> నీ అక్కసు చల్లారుతుందేమో! జై తెలంగాణా అనాల్సిన బాధ నీకు తప్పుతుందేమో!" అని రాసుకొచ్చారు. ఒక్క మాట గుర్తు పెట్టుకో... ఒక్క బొట్టు నీరు అక్రమంగా అప్పజెప్పినా, మరో పోరాటం చూస్తావని హెచ్చరించారు. "ప్రాంతేతరుడు మోసం చేస్తే తరిమి, తరిమి కొడతాం! ప్రాంతం వాడు మోసం చేస్తే ఇక్కడే పాతి పెడతాం! తెలంగాణను పీక్కుతింటున్న రాబందుల పని తప్పక పడతాం!" అని హెచ్చరించారు.

# కూరగాయల ధరలకు రెక్కలు

>> రాష్ట్రంలో కూరగాయల సాగు 6 లక్షల ఎకరాల్లో జరుగుతుందని అంచనా వేయగా, 4.2 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. సంగారెడ్డి, వికారాబాద్, సిద్దిపేట, యాదాద్రి వంటి జిల్లాల్లో విత్తనాల సాగు 30 వరకు తగ్గింది. స్థానిక సరఫరాలో కొరత కారణంగా, వ్యాపారులు ఇప్పుడు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుండి దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్లలో పరిమిత రాకపోకలు మరియు పండుగ సీజన్‌లో అధిక డిమాండ్‌తో, రాబోయే వారాల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. వినియోగదారులు ఇప్పటికే ఈ ఒత్తిడిని అనుభవిస్తున్నారు మరియు వర్షపాతం మెరుగుపడి స్థానిక ఉత్పత్తి స్థిరీకరించబడకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని మార్కెట్‌వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# సిఐడి కస్టడీకి జగన్మోహాన్, మరో నలుగురు

>> ఇవ్వాలని ఆయన తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి ఐదుగురు నిందితులకు ఆరు రోజుల కస్టడీ ఇస్తూ ఆదేశించారు. ఇదే సమయంలో నిందితుల బెయిల్ పిటిషన్‌ను కూడా డిస్మిస్ చేశారు. ఈ కేసులో అరెస్టయిన ఐదుగురిలో జగన్‌మోహన్ రావు సహా నలుగురు చర్లపల్లి జైల్లో వుండగా కవిత చంచల్‌గూడ మహిళా జైల్లో వుంది. వీరిని గురువారం నుంచి ఆరు రోజుల పాటు సిఐడి విచారించనుంది. అనంతరం వీరిని వచ్చే మంగళవారం నాడు తిరిగి జైలుకు రిమాండుకు తరలిస్తా రు. హెచ్‌సిఎలో అక్రమాలపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ చాలా కాలంగా పోరాడుతుండడం తెలిసిందే. దీనిపై ఈడీ కూడా రంగంలో దిగడం విదితమే. బిసిసిఐ నుంచి అందిన కోట్లాది రూపాయల నిధులను హెచ్‌సిఎ పక్కదారి పట్టించి, సొంత అవసరాలకు వాడుకుందని సిఐడి విచారణలో తేలగా దీంతో పాటు గత ఐపిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ జట్టును టికెట్ల కోసం బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చిం ది. దీనికి సంబంధించిన నివేదికను కూడా సిఐడి తెప్పించుకుంది. ఉప్పల్ స్టేడియంలో జరిగిన కోట్లాది రూపాయల పనులలో భారీగా అక్రమాలు జరిగాయని, హెచ్‌సిఎ అధ్యక్షుడుగా జగన్‌మోహన్ రావు ఎన్నికే అక్రమమని సిఐడి తేల్చింది. మాజీ మంత్రి కృష్ణా యాదవ్ నెలకొల్పిన గౌలిగుడ క్రికెట్ క్లబ్‌ను ఆయనకు తెలియకుండా సంతకం ఫోర్జరీ చేసి శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరిట ఓ క్లబ్‌ను తన వారిచేత తప్పుడు పత్రాలతో జగన్‌మోహన్‌రా వు ఏర్పాటు చేసినట్లు సిఐడి తేల్చింది. దీని తరువాత ఇందులో తన వారినే నియమించి, తాను సభ్యుడుగా చేరి, ఆరు నెలలకే హెచ్‌సిఎ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందడం అంతా డ్రామాగా వుందని సిఐడి తేల్చింది. ఈ నేపథ్యంలో హెచ్‌సిఎ గోల్‌మాల్ వ్యవహా రాలపై లోతుగా విచారించేందుకు నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించనుంది. ఈ కేసులో పరారీలో వున్న మరో నిందితుడు దేవరాజ్ కోసం గాలిస్తున్నారు.

# రిటైర్డ్ ఇఎన్‌సి మురళీధర్‌రావు చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మంగళవారం నాడు అరెస్టయిన నీటి పారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) మురళీధర్ రావుకు నాంపల్లి ఎసిబి కోర్టు న్యాయమూర్తి రిమాండు విధించింది. మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత మురళీధర్ రావును ఎసిబి అధికారులు న్యాయమూర్తి ఇంట్లో హాజరు పరిచారు. అనంతరం ఈ కేసును విచారించిన ఎసిబి కోర్టుల న్యాయమూర్తి మురళీధర్ రావుకు రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం ఆయనను ఎసిబి అధికారులు మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా మురళీధర్ రావు కాళేశ్వరం ప్రాజెక్టులో ఇఎన్‌సిగా పనిచేయడం తెలిసిందే. పదవీ విరమణ చేశాక ఆయన 13 ఏళ్ల పాటు పనిచేయడంతో పాటు నీటి పారుదల శాఖలోని ఇతర ఇఎన్‌సిలకు చీఫ్‌గా కూడా వ్యవహరించారు. ఆయన వద్ద 400 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులను ఎసిబి గుర్తించింది.

# ఇంటికో ఇంకుడు గుంత

>> గంటల్లో ట్యాంకర్‌ను డెలివరీ జరుగుతుందని తెలిపారు. గతంలో వేసవిలో రోజుకు 11000 ట్యాంకర్లు 24 గంటలలో సరఫరా చేసామని ప్రస్తుతం రోజుకు 8500 ట్యాంకర్ల డిమాండ్ ఉందని వివరించారు. ఇంకుడు గుంతలు లేని నివాసాలు, భూగర్భ జలాలు పడిపోయిన ప్రాంతాలలో ట్యాంకర్ డిమాండ్ పెరిగిన 24 గంటల వ్యవధిలో డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవిలో రోజుకు సగటున 11 వేల ట్యాంకర్లను విజయవంతంగా డెలివరీ చేయగలిగామని అన్నారు. ప్రస్తుతం రోజువారీ డిమాండ్ సుమారు 8600 ట్యాంకర్లు మాత్రమే ఉందని, వీటిని కూడా 24 గంటల లోపల పూర్తిగా డెలివరీ చేస్తున్నామని, మరింత డిమాండ్ పెరిగినా.. అదనంగా 3 వేల ట్యాంకర్లను కూడా సరఫరా చేసే సామర్థ్యం జలమండలికి ఉందని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే సరఫరాలో ఆలస్యం అవుతుందని దీనిని దృష్టిలో ఉంచుకుని సామాన్య ప్రజలు మంచినీరు సరఫరా, ట్యాంకర్లతో అందే నీటిపై ఆందోళన పడవద్దని ఈ సందర్భంగా ఎండి విజ్ఞప్తి చేశారు.

## వారం - వర్జ్యం

17-07-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
సప్తమి రా.7.07
రేవతి రా.3.38
వర్జ్యం : రా.10.27-11.57
దు.ఉ.10.04-10.56, 2) మ.3.16-4.08
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహ కరంగా వుంటాయి. చర్చ గోష్టులలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. షేర్లు భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**మిథునం:** సంఘంలో గౌరవం పొందుతారు. కళలు, రాజకీయ, సాంకేతిక రంగాలలోని వారు సన్మాన యోగాలు పొందుతారు.

**కర్కాటకం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. సోదరుల నుండి ఆస్తిలాభాలు పొందుతారు.

**సింహం:** వాహనాలు, ఆరోగ్య విషయాలలో కాస్త మెలకువ అవసరం. మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకొంటారు.

**కన్య :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**తుల :** కోర్టుకేసుల నుండి బయట పడతారు. పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో అభుకూల ఫలితాలు పొందుతారు.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. కొత్త పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** పనులు అప్రయత్నంగా పూర్తి కాగలవు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** అందరిని ఆకట్టుకుని, ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**కుంభం:** కొత్త ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానం నుండి ధనలాభం పొందుతారు.

**మీనం :** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం న్యూఢిల్లీలో సిఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎపి సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్, మంత్రి ఉత్తమ్ కుమార్ తదితరులు

# వివాదాలపై కమిటీ

>> విడుదలకు సంబంధించి అన్ని రిజర్వాయర్ల వద్ద టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనకు ఆంధ్రప్రదేశ్ అంగీకారం 2. గోదావరి నది యాజమాన్య బోర్డు తెలంగాణలో.. కృష్ణ నది యాజమాన్య బోర్డు ఆంధ్రప్రదేశ్‌కు అంగీకారం 3. శ్రీశైలం ప్రాజెక్ట్ మరమ్మతులకు ఆంధ్రప్రదేశ్ అంగీకారం 4. ఇరు రాష్ట్రాల్లో గోదావరి, కృష్ణా నదులపై ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులు, సాంకేతిక నిపుణులతో కమిటీ నియామకానికి నిర్ణయం, వారం రోజుల్లో కమిటీ ఖరారు 5.ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయి.అన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.అవసరమైతే మరోసారి సమావేశం కావాలని ఇరువురు సిఎంలు నిర్ణయించారు. శ్రీశైలంమరమ్మతులు,రక్షణ చర్యలపై ఇరువురు సీఎంలు చర్చించి జలాశయాన్ని కాపాడుకోవాలని నిర్ణయించారు.అలాగే కృష్ణా బోర్డును అమరావతిలో,గోదావరి బోర్డును హైదరాబాద్‌లో కొనసాగించాలన్న ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. సమావేశానికి ముందు ఆయా రాష్ట్రాల అధికారులతో ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. సమావేశంలో లేవనెత్తాల్సిన అంశాలు, సాంకేతికంగా ఇవ్వాల్సిన సమాధా నాలపై చర్చలు జరిపారు. సీఎంలు దిల్లీలోని తమ తమ అధికారిక నివాసాల్లో సుమారు గంటన్నరపాటు సీఎస్‌లు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం 13 అంశాలను ప్రతిపాదించింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వాలి. ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఏఐబీపీ కింద నిధులు ఇవ్వాలి. మహారాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వమే చర్చలు జరిపి తుమ్మిడి హట్టి వద్ద ఆనకట్ట(డ్యాం) నిర్మాణానికి సహకరించాలి. కృష్ణానది జలాలను వేరే బేసిన్‌కు తరలించకుండా కృష్ణారివర్ మేనేజ్‌మెంట్‌బోర్డు చర్యలు తీసుకునేలా ఆదేశించాలి.కృష్ణా జలాలను అక్రమ తరలింపును అడ్డుకునేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు ఏపీ అంగీకరించాలి. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రారంభించిన ప్రాజెక్టులకు సహకరించేలా కృష్ణా ట్రైబ్యునల్‌లో మద్దతుగా వాదించేలా ఏపీని ఒప్పించాలి. శ్రీశైలం నుంచి నీటి తరలింపు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతోంది దీనిని అడ్డుకోవాలి. శ్రీశైలం నుంచి వేరే బేసిన్‌కి ఆంధ్రప్రదేశ్ నీటి తరలింపు పనులను వెంటనే ఆపేయాలి. తుంగభద్ర బోర్డు నీటి తరలింపుపై చర్చించాలి. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్జీటీ ఉత్తర్వులను అమలు చేసే విధంగా కేంద్ర జలశక్తి శాఖ చర్యలు తీసుకోవాలి. ఈ పథకంపై చట్టపరంగానే ముందుకు వెళ్లాలి. శ్రీశైలం కుడి కాలువ ద్వారా ఎక్కువ నీటి తరలింపును నియంత్రించాలి. శ్రీశైలం ప్రాజెక్టులో కొత్త ప్రాజెక్టులు వెలిగొండ, గురు రాఘవేంద్ర, హంద్రీనీవా నిర్మాణాలను నియంత్రించాలి. శ్రీశైలం డ్యాం సేఫ్టీకి తగిన చర్యలు తీసుకోవాలి. పోలవరం ప్రాజెక్టు తరహాలోనే కేంద్రం ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఇవ్వాలి. ఇచ్చంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాల తరలింపుకు మేము సిద్ధం. అందులో 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతులు ఇవ్వాలి.సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలి అని తెలంగాన సర్కార్ కేంద్ర జలశక్తి సమావేశం ముందు ప్రతిపాదించింది.కాగా,కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యలో జరిగిన ఇరు రాష్ట్రాల సిఎంల సమావేశంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ రిజర్వాయర్ల వద్ద టెలిమెట్రీల ఏర్పాటు, శ్రీశైలం మరమత్తులకు ఎపి ప్రభుత్వం అంగీకరించిందని పేర్కొన్నారు. టెలిమెట్రీల ఏర్పాటు శ్రీశైలం వద్ద మరత్తులకు ఎపి అంగీకరించడం తమ విజయమేనని సిఎం రేవంత్ తెలిపారు. భేటీలో బనకచర్ల గురించి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. బనకచర్ల కడతామనే చర్చ రానప్పుడు, ఆపమనే చర్చనే రాదన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వ సంస్థలే బనకచర్లకు అభ్యంతరం తెలిపాయని గుర్తు చేశారు. ఇది అపెక్స్ కమిటీ భేటీ కాదని,సాదారణ సమావేశం అని పేర్కొన్నారు. ఈ భేటీలో కేంద్రం ఎజెండా ఏం లేదని,,, ఒక ప్లాట్‌ఫార్మ్‌లా కేంద్రం సమావేశాన్ని ఏర్పాటు చేసిందని క్లారిటీ ఇచ్చారు. కెసిఆర్ తెలంగాణ నీటి హక్కులను ఏపీకి గంప గుత్తగా ఇచ్చారని, వాటి వల్ల ఏర్పడిన వివాదాలనే ఇప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షాలు కావాలని రాద్ధాంతం చేస్తాయని, కానీ వాటిని మేము పట్టించుకోమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన సమావేశాల్లో ఎలాంటి పరిష్కారం లభించలేదని, కానీ ఇప్పటి సమావేశంలో నాలుగు అంశాలకు పరిష్కారం దొరికిందని తెలిపారు. కృష్ణా,గోదావరి వివాదాల పరిష్కారం కోసం కమిటీ వేయాలని నిర్ణయించామని, కేంద్ర,రాష్ట్ర,సాంకేతిక నిపుణులు, అధికారులు ఈ కమిటీలో ఉంటారని, త్వరలో కమిటీ ఏర్పాటవుతుందని తెలిపారు. ఆఫీసర్లతో పరిష్కారం కానీ అంశాలపై సిఎంల స్థాయి భేటీలో చర్చిస్తామన్నారు. కొత్త,పాత ప్రాజెక్టులు తదితర అంశాలు ఈ కమిటీ ముందుకు చర్చకు వస్తాయని, కమిటీ సూచనల మేరకు తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోమవారంలోగా కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. భేటీలో పాటిల్ జడ్జి తరహా పాత్ర పోషించారని అన్నారు. ఒకరినొకరు అనుమానించుకుంటూ పోతే ముందుకు సాగలేమని తెలిపారు. టెలిమెట్రీలు ఏర్పాటు చేస్తే ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుతుందో తెలిసిపోతుందని, ఈ మేరకు అన్ని పాయింట్ల వద్ద టెలిమెట్రీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలపారు. కేంద్ర వ్యవహారశైలిపై ప్రస్తుతానికి మాకు ఎలాంటి అనుమానం లేదని, తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి వివాదాలు లేకుండా సమస్యల పరిష్కారం కోసం మేం ప్రయత్నిస్తున్నామన్నారు.

## ఏర్పాటుకు ఎపి అంగీకారం

>> అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, యుద్ధ ప్రాతిపదికన టెలీమెట్రీలను ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపిందని ఆయన అన్నారు. కృష్ణా నదీ జలాల వినియోగం లెక్కలపై అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు. టెలీమెట్రీలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామని, కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయిస్తుందని ఆయన తెలిపారు. టెలీమెట్రీల ఏర్పాటుపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో టెలీమెట్రీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.



గౌహతి విమానాశ్రయంలో బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

# 'స్థానిక' పోరుకు సిద్ధంకండి

>> జడ్‌పిపిలు 1, జడ్‌పిటిసిలు 20, ఎంపిపిలు 20, ఎంపిటిసిలు 283లు ఉండగా కుమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లాలలో జడ్‌పిపిలు 1, ఎంపిపిలు 15, ఎంపిపిలు 15, ఎంపిటిసిలు 127, మహబూబాద్‌లో జడ్‌పిపిలు 1 ఎంపిపిలు 18, ఎంపిటిసిలు 18, ఎంపిపిలు 18, ఎంపిటిసీలు 193, మహబూబ్‌నగర్‌లో జడ్‌పిపిలు1, జడ్‌పిటిసిలు16, ఎంపిటిసిలు 16, ఎంటిసిలు 193, మంచిర్యాల జడ్‌పిపిలు1, జడ్‌పిటిసీలు16, ఎంపిపిలు 16, ఎంపిటిసీలు 129, మెదక్‌లో జడ్‌పిపిలు 1, జడ్‌పిటిసిలు 21, ఎంపిపిలు 21, ఎంపిటిసిలు 190, ములుగులో జడ్‌పిపి 1, జడ్‌పిటిసిలు 10, ఎంపిపిలు 10, ఎంపిటిసిలు 83, నాగర్‌కర్నూల్ జడ్‌పిపి 1, జడ్‌పిపిలు 20 జడ్‌పిటిఎస్‌లు 20, ఎంపిటిసిలు 214, నల్గొండ జిల్లాలో జడ్‌పిపిఎస్ 1, జడ్‌పిటిసి 33, ఎంపిపి 33, ఎంపిటిసి 353, నారాయణపేట జిల్లాలో జడ్‌పిపిఎస్ 1, జడ్‌పిటిసి 13, ఎంపిపిలు 13, ఎంపిటిసి 136, నిర్మల్ జిల్లాలో జడ్‌పిపిఎస్ 1జడ్‌పిటిసిఎస్ 18, ఎంపిపి 18, ఎంపిటిసి 157, నిజామాబాద్ జిల్లాలో జడ్‌పిపిఎస్ 1, జడ్‌పిటిసి 31, ఎంపిపిలు 31, ఎంపిటిసిలు 307, పెద్దపల్లి జిల్లాలో జడ్‌పిపిఎస్ 1, జడ్‌పిటిసి 13, ఎంపిపిలు 13, ఎంపిటిసిలు 137, రాజన్నసిరిసిల్ల జిల్లాలో జడ్‌పిపి 1. జడ్‌పిటిసి 12, ఎంపిపిలు 12, ఎంపిటిసిలు 123, రంగారెడ్డి జిల్లాలో జడ్‌పిపిలు1, జడ్‌పిటిసిలు 21, ఎంపిపిలు 21, ఎంపిటిసిలు 230, సంగారెడ్డిలో జడ్‌పిపిలు1, జడ్‌పిటిసిలు 26, ఎంపిపిలు26, ఎంపిటిసిలు 271, సిద్దిపేటలో జడ్‌పిపిలు 1, జడ్‌పిటిసిలు 26, ఎంపిపిలు 26, ఎంపిటిసిలు 230, సూర్యాపేట జిల్లాలో జడ్‌పిపి 1, జడ్‌పిటిసి 23, ఎంపిపిలు 23, ఎంపిటిసిలు 235, వికారాబాద్‌లో జడ్‌పిపిలు1, జడ్‌పిటిసిలు 20, ఎంపిపిలు, ఎంపిపిలు 20, ఎంపిటిసిలు 227, వనపర్తి జిల్లాలో జడ్‌పిపిలు 1, జడ్‌పిటిసి 15. ఎంపిపిలు 15, ఎంపిటిసీలు 133, వరంగల్ జిల్లాలో జడ్‌పిపిలు 1, జడ్‌పిటిఎస్‌లు11, ఎంపిపిలు11, జడ్‌పిటిసిలు 130 యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జడ్‌పిపిలు 1, జడ్‌పిటీసీలు 17, ఎంపిపిలు 17, ఎంపిటిసీలు 178 స్థానాలు ఉన్నాయి. ఈ 31 జిల్లాల్లో అత్యధికంగా జడ్‌పిటిసిలు నల్గొండలో 33 ఉండగా, అత్యల్పంగా ములుగు జిల్లాల్లో 10 మంది ఎంపిపిలు ఉన్నారు.అత్యధికంగా ఎంపిపిలు సంగారెడ్డి, సిద్దిపేటలో 26 ఉండగా అత్యల్పంగా వరంగల్లో 11 ఎంపిపిలు ఉన్నారు. ఎంపిటిసిలు అత్యధికంగా నల్గొండలో 353 ఉండగా, అత్యల్పంగా ములుగు జిల్లాల్లో 83 ఎంపిటిసిలు ఉన్నారు.గ్రామ పంచాయితీల సంఖ్య 12, 778 ఉండగా, వార్డుల సంఖ్య ఒక లక్షా 12 వేల 694 ఉన్నాయి. వీటన్నింటిని ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలను ఐదు విడుతల్లో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆలోచిస్తున్నది. వర్షాకాలం, శాంతిభద్రతలు, గిరిజన ప్రాంతాలకు పోలింగ్ సిబ్బంది వెళ్లడం, పోలింగ్ మెటీరియల్ తరలించడం తదితరాలను దృష్టిలో ఉంచుకుని సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది.2019లో ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించారు. అప్పుడు వేసవి కారణంగా మూడు విడతల్లో నిర్వహించగలిగారని, కానీ ఇప్పుడు వర్షకాలం అయినందున, ఎదురయ్యే ఇబ్బందులు, అవాంతరాలను ముందుగానే అంచనా వేసి ఒక అవగాహనకు వచ్చినట్టు సమాచారం ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారం ఇవ్వగానే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబితాను ఇప్పటికే ఎన్నికల కమిషన్ అధికారులు సిద్ధం చేశారు. ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం ద్వారా పోలింగ్ సిబ్బంది, పోలీసులను తరలించడం సులువు అవుతుందని, పర్యవేక్షణలోనూ ఎలాంటి ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారం ఇచ్చిన తర్వాత. పోలీసు అధికారులతో సమావేశమై తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు.ఇదిలా ఉండగా రాష్ట్రంలో మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రెండు ఎన్నికలకు ఒకే రోజు పోలింగ్ జరగనుంది. అనంతరం సర్పంచ్ఎన్నికలు నిర్వహించనున్నారు.

# ప్రభాకర్ రావు విచారణ ఏడోసారి

## ఫోన్ ట్యాపింగ్ కేసు

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఎస్‌ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు ఏడవసారి సిట్ అ ధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఇప్పటి వరకు ఆరుసార్లు ప్రభాకర్ రావును విచారించిన సిట్ అధికా రులు బుధవారం నాడు ఏడవ దఫాగా మూడు గంటలకు పైగా ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు జరిగిన సమయంలో ఆయన వాడిన ఫోన్లలో ఒక ఫోన్‌ను ఈ సందర్భంగా జప్తు చేశారు. అప్పట్లో వాడిన వ్యక్తిగత ఫోన్లను తమకు అప్పగించాలని సిట్ అధికారులు ఇప్పటికే ప్రభాకర్ రావును కోరారు. అప్పట్లో ఆయన మూడు సెల్ ఫోన్లను వాడినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇందులో ఒకదానిని ఇప్పటికే అప్పగించగా అందులో ఎలాంటి సమాచారం లేక పోవడం వి చారణాధికారులకు ఇబ్బందిగా మారింది. సెల్‌ఫోన్‌తో పాటు లాప్‌టాప్‌ను కూడా ప్రభాకర్ రావు సిట్ అధికారులకు ఇదివరకే అప్పగించడం తెలిసిం దే. వీటిని ఎఫ్‌ఎస్‌ఎల్‌కు విశ్లేషణకు పంపారు. బుధవారం నాటి విచారణలో 2023 నవంబర్ నెలలో జరిగిన 618 మంది రాజకీయ నేతలతో పాటు ప్రముఖుల ఫోన్ నంబర్ల ట్యాపింగ్ గురించే సిట్ అధికారులు ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు సమాచారం. ఈ ట్యాపింగ్ వెనుకగల కారణా లను ప్రభాకర్ రావు నుంచి అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. మంగళవారం నాటి విచారణలోనూ ఇదే అంశంపైనే సిట్ అధికారులు ఎక్కువగా దృష్టిసారించారని తెలిసింది. బుధవారం నాటి విచారణలోనూ దీనిపైనే పదే పదే ప్రశ్నలు అడగడంతో ప్రభాకర్ రావు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చివరగా ఏదో మొక్కుబడిగా ఆయన కొన్నింటికి సమాధానాలు ఇచ్చారని సమాచారం. వచ్చే వారం ఇంకోసారి విచారణకు రావాల్సి వుంటు ందని ప్రభాకర్ రావును సిట్ అధికారులు చెప్పాక పంపించి వేశారు.

# ఒబిసి సలహామండలి భేటీ

>> అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి కమిషన్, బిసి డెడికేషన్ కమిషన్, కులఘనన, అసెంబ్లీలో బిల్లు, గవర్నర్ కు ఆర్డినెన్సు ను ఇలా అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నారని వివరించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, తాను బిసిల రిజర్వేషన్ల గురించి సైనికులాగా పని చేస్తున్నామని అన్నారు.ఇంతటి విప్లవాత్మక చారిత్రక ఘట్టంలో తనను అగ్రభాగ స్వామ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా బిసి రిజర్వేషన్ల కార్యక్రమంలో తెలంగాణ రోల్ మోడల్ గా నిలవడం గర్వంగా ఉందని అన్నారు.

అక్టోబరు నెలలో ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించనున్నామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ యాదవ్, మాజీ ఎంపీ లు వి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో అత్యల్ప ద్రవ్యోల్బణం

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** దేశంలోనే ప్రతికూల ద్రవ్యోల్బణ రేటును నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేంద్ర గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం, జూన్ 2024తో పోలిస్తే ఈ ఏడాది అదే నెలకు 0.93 శాతం ప్రతికూల ద్రవ్యోల్బణ రేటును నమోదు చేసిన దేశంలో తెలంగాణ ఏకైక రాష్ట్రం కావడం విశేషం. గత ఆరు నెలలుగా దేశంలోనే అత్యల్ప ద్రవ్యోల్బణాన్ని స్థిరంగా నమోదు చేస్తున్న రాష్ట్రంగా ఉంది. దేశంలో మొత్తం ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉంది. జాతీయ గ్రామీణ సగటు 1.72 శాతంతో పోలిస్తే తెలంగాణ గ్రామీణ ద్రవ్యోల్బణం ()1.54 శాతానికి బాగా తగ్గింది, అయితే పట్టణ ద్రవ్యోల్బణం జాతీయ పట్టణ రేటు 2.56 శాతంతో పోలిస్తే ()0.45 శాతంగా ఉంది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, జూన్ 2024 తో పోలిస్తే ఈ ఏడాది అదే నెలలో ద్రవ్యోల్బణ వృద్ధి రేటును సున్నాగా నమోదు చేసింది. గ్రామీణ ద్రవ్యోల్బణం 0.55 శాతం మరియు పట్టణ ద్రవ్యోల్బణం 1.06 శాతంగా ఉంది. ప్రతి ద్రవ్యోల్బణంలో లేనప్పటికీ, ఆంధ్రప్రదేశ్ కూడా జాతీయ సగటు కంటే గణనీయంగా తక్కువగా ఉంది. 2020- 2023 మధ్య రెండంకెల ద్రవ్యోల్బణంతో సతమతమైన తెలంగాణకు ఈ మైలురాయి ఒక మలుపును సూచిస్తుంది.

## ఉత్తమ్ పిటిషన్లపై విచారణ 18కి వాయిదా

**హైదరాబాద్, జూలై16,ప్రభాతవార్త:**సాధారణ ఎన్నికల సందర్భంగా తనపై నమోదైన కేసులు కొట్టివేయాలని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ కె.లక్ష్మణ్ తదుపరి విచారణను జూలై 18కి వాయిదా వేశారు. సాధారణ ఎన్నికల సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై నేరెడు చెర్లతో పాటు మఠంపల్లి పోలీస్ స్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ కేసులను వెంటనే కొట్టివేయాలని కోరుతూ ఇటీవలే నీటిపారుదలశాఖ మంత్రి తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఇరు పక్షాల వాదనలు విన్న ఆయన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావుకు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా కేసు తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేస్తున్నట్లుగా జస్టిస్ కె.లక్ష్మణ్ తీర్పును వెలువరించారు.

## ఒయాసిస్ డాక్యుమెంటరీ ఫిల్మ్ విడుదల

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:** గల్ఫ్ కార్మికుల సంక్షేమం లక్ష్యంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన గల్ఫ్ భరోసా పథకాన్ని వివరించే 'గల్ఫ్ బాటలో ఒయాసి' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా. బిఎం. వినోద్ కుమార్ బుధవారం గాంధీ భవన్‌లో విడుదల చేశారు. ఉత్తర తెలంగాణలోని పలు గ్రామాలలో పర్యటించిన ప్రవాసీ మిత్ర ప్రొడక్షన్స్ చిత్ర బృందం, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా పొందిన గల్ఫ్‌మృతుల కుటుంబాల అభిప్రాయాలను చిత్రీకరించారు.ఈ కార్యక్రమంలో డాక్యుమెంటరీ నిర్మాత, గల్ఫ్ వలస వ్యవహారాల నిపుణుడు మంద భీంరెడ్డి, డాక్యుమెంటరీకి దర్శకత్వం వహించిన ప్రముఖ చలనచిత్ర దర్శకులు పి.సునీల్ కుమార్ రెడ్డి, నిర్మాణ సహకారం అందించిన గల్ఫ్ జెఏసి నాయకులు చెన్నమనేని శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## ఇఎన్‌సి అడ్మిన్‌గా రమేష్‌బాబు

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్‌చీఫ్ (అడ్మిన్)గా ఓ.వి.రమేశ్ బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం చీఫ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ గ్రౌటింగ్ విషయంలో ఎన్‌డిఎస్‌ఏ నివేదికలో ఇఎన్‌సిగా అనీల్ కుమార్‌ను తప్పపట్టింది. కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ ఎదుట విచారణకు అనిల్‌కుమార్‌ను పిలిచారు. దీంతో ఆయనను ఈఎన్సీ పదవి నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీర్‌ఇన్‌చీఫ్ (జనరల్), జి.అనిల్ కుమార్‌ను బదిలీ చేసి ప్రభుత్వానికి రిపోర్టుచేయమని జూన్20న ప్రిన్సిపల్‌సెక్రటరీ రాహుల్‌బొజ్జ ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ (ఎంక్వైరీస్) మొహద్ అమ్జద్ హుస్సేన్ ఎన్ ఇఎన్‌సి (జనరల్) పోస్ట్ యొక్క అదనపు బాధ్యతలో ఉంచినట్లు తెలంగాణ అదే రోజు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయనకు ఎలాంటి పోస్టింగ్ కేటాయించకుండా ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఆర్డర్‌లో పేర్కొన్నారు. అయితే, ఇఎన్‌సి అడ్మిన్ పోస్ట్ ఖాళీగా ఉండటంతో సర్థుబాటులో భాగంగా ఆ స్థానంలో సూర్యాపేట, ఖమ్మం చీఫ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ.వి రమేశ్ బాబుకు అదనపు బాధ్యతలను కట్టబెట్టారు.

## వృద్ధురాలికి రూ.57.43 లక్షల టోకరా

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట వృద్ధురాలికి సైబర్ నేరగాళ్లు 57.43 లక్షల రూపాయల టోకరా వేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగు చూసింది. జూబ్లీహిల్స్‌కు చెందిన 60యేళ్ల వృద్ధురాలు ఇన్‌స్టాగ్రామ్‌లో ఎఫ్ఎక్స్ రోడ్ పేరుతో ప్రకటన కనిపించగా దీనిని క్లిక్ చేసి సమాచారం ఇచ్చిపుచ్చుకుంది. ఇదే సమయంలో సైబర్ నేరగాళ్లు రంగంలోకి దిగి తమ వెబ్‌సైట్ ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించినదిగా చెప్పుకుని చిన్న మొత్తంలో పెట్టుబడులు పెట్టాలని, మంచి లాభాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నేరగాళ్ల మాటలను నమ్మిన సదరు వృద్ధురాలు మొదట్లో చిన్న మొత్తంలో పెట్టుబడులు పెట్టగా కొంతమేర లాభాలు వచ్చాయి. ఆ తరువాత బాధితురాలు నేరగాళ్ల మాటలు నమ్మి ఏకంగా 57.43 లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టింది. దీని తరువాత లాభాల కోసం ఆమె పలుమార్లు వెబ్‌సైట్ నిర్వాహకులను సంప్రదించినా ప్రయోజనం లేకుండాపోయింది.దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైంపోలీసులకు ఫిర్యాదుచేయగా కేసు దర్యాప్తు చేబట్టారు.

## ఎసిబి వలలో పంచాయతీరాజ్ ఇఎన్‌సి కనకరత్నం

### డిఇ బదిలీ కోసం రూ.50వేలు తీసుకుంటుండగా పట్టివేత



**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరో అవినీతి ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) ఎసిబికి పట్టుబడ్డాడు. ఇప్పటికే నీటి పారుదల శాఖలో పలువురు ఇఎన్‌సిలను ఎసిబి అరెస్టు చేయగా బుధవారం పంచాయతీరాజ్ శాఖలో ఇఎన్‌సిగా వున్నకనకరత్నం డీఈ బదిలీ కోసం 50 వేల రూపాయలు లంచంగా తీసుకుంటుండగా ఎసిబి అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. పంచాయతీరాజ్ శాఖలో ఇఎన్‌సి వున్న కనకరత్నం ఈ ఏడాది మార్చి 31వ తేదీన పదవీ విరమణ పొందారు. అయితే సర్కారు ఆయన పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగించింది. కాగా పంచాయతీ రాజ్ విభాగంలో డీఈగా పని చేస్తున్న ఓ అధికారి తాండూరు నుంచి వికారాబాద్‌కు బదిలీ కావాలని కోరగా కనరత్నం లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేయగా బాధితుడు 50 వేల రూపాయలు ఇచ్చేందుకు అంగీకరించి దీనిపై ఎసిబికి ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు బుధవారం ఉదయం పంచాయతీ శాఖ కార్యాలయం వద్ద ఎసిబి అధికారులు కాపుకాశారు. బాధిత డీఈ రూ.50వేలను ఇఎన్‌సి కనకరత్నంకు అందజేయగానే ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ నేతృత్వంలోని అధికారుల బృందం దాడిసింది. అనంతరం ఇఎన్‌సి కనక రత్నంను అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి 50వేల రూపాయలనుజప్తుచేశారు. అనంతరం కనకరత్నం కార్యాలయంతోపాటు కెపి హెచ్‌బి కాలనీలోని నివాసంలో సోదాలు చేసి పలుపత్రాలను జప్తు చేశారు.

## కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి: సింగరేణి సిఎండి బలరామ్

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సింగరేణి సిఎండి బలరామ్ సూచించారు. హైదరాబాద్‌లో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ విధులకు గైర్హాజరు అయ్యే కార్మికులు సక్రమంగా విధులకు హాజరయ్యేలా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. అదే సమయంలో కార్మికుల సంక్షేమనికి సంబంధించి ఎటువంటి ఫైల్స్ పెండింగ్ లో ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్మిక సంక్షేమం విషయంలో ఎటువంటి నిర్లక్షం వహిం చకూడదు అని చెప్పారు. ఈ సమావేశం లో డైరక్టర్ పొట్రు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## 23న విద్యాసంస్థల బంద్

### వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

**హైదరాబాద్, జూలై 16,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో వున్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఈ నెల 23న విద్యార్థి సంఘాలు బంద్ కు పిలుపునిచ్చాయి. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఏఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నరేష్,ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు దామెర కిరణ్, కె.అశోక్‌లతోపాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకుండా కాలం వెల్లదీస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో బడ్జెట్ లేమితో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. విద్యాకమీషన్ సైతం పేరుకే ఉందని వారి సూచనలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రాక ముందు విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని డిక్లరేషన్లో ప్రకటించినప్పటికి, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే 7 శాతం మించి బడ్జెట్ కేటాయింపులు జరపలేదని విమర్శించారు. కావున ప్రభుత్వం అనుసరిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై జూలై 23న విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచినట్లు తెలిపారు. ఈ బంద్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేట్, కార్పోరేట్ విద్యా సంస్థల యజమాన్యాలు సహకరించాలని కోరారు.

# బిజెపిపాలిత రాష్ట్రాల్లో బెంగాలీలకు వేధింపులు

## భారీ నిరసన ర్యాలీ నిర్వహించిన సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కతా, జూలై 16:** బెంగాలీల పట్ల బీజేపీ వైఖరికి తాను సిగ్గుపడుతున్నానని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలపై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా బుధవారం కోల్‌కతాలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలో జరిగిన నిరసన ర్యాలీలో టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆ పార్టీ సీనియర్ నేతలతోపాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రసంగించారు. బెంగాలీ మాట్లాడే వారందరినీ బంగ్లాదేశీ రోహింగ్యాలు అని బిజెపి పిలుస్తున్నదని విమర్శించారు. రోహింగ్యాలు మయన్మార్‌లో నివసిస్తారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ పౌరులందరికీ సరైన గుర్తింపు కార్డులు, గుర్తింపు ఉన్నాయని అన్నారు. 'బెంగాల్ బయటకు వెళ్లిన కార్మికులు స్వయంగా వెళ్లలేదు. వారికి నైపుణ్యాలు ఉన్నందున వారిని నియమించారు. బెంగాలీ మాట్లాడే వారిని అరెస్టు చేసి జైలులో పెడుతున్నారు. ఎందుకు? పశ్చిమ బెంగాల్ భారతదేశంలో భాగం కాదా?' అని ప్రశ్నించారు. బెంగాలీల పట్ల బిజెపి వైఖరికి తాను సిగ్గుపడుతున్నానని అన్నారు. మరోవైపు ఆ రాష్ట్రంలోని జిల్లాల్లో కూడా టిఎంసి ఆధ్వర్యంలో ఇలాంటి నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రధాని మోదీ పశ్చిమ బెంగాల్ పర్యటనకు ఒక రోజు ముందు ఈ నిరసనలు జరుగడం ప్రాధాన్యత సంతరించుకున్నది. బెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

### రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై

# 100 శాతం సుంకం: నాటో హెచ్చరిక!



**న్యూఢిల్లీ, జులై 16:** ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేలా అమెరికా ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగా ఆ దేశంతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై సుంకాలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడింది. ఈ క్రమంలో మాస్కోతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తే 100 శాతం సుంకం విధిస్తామని భారత్‌తో సహా చైనా, బ్రెజిల్ దేశాలను నాటో హెచ్చరించింది. నాటో జనరల్ మార్క్ రుట్టె అమెరికా సెనెటర్లతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చైనా అధ్యక్షుడు, భారత ప్రధాని, బ్రెజిల్ అధ్యక్షుడు ఎవరైనా రష్యాతో వ్యాపారం చేస్తూ వారి నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తాం. ఆయా దేశాలపై 100 శాతం సుంకం విధిస్తా. మాస్కోలోని ఆ వ్యక్తి శాంతి చర్చలకు రాకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. మా పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. మా పరిణామాలు ఈ దేశాలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. కాబట్టి వ్లాదిమిర్ పుతిన్‌కు వెంటనే ఫోన్ చేసి శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోవాలని ఒత్తిడి తీసుకురండి. లేకుంటే మూడు దేశాలకు భారీ ఎదురుదెబ్బలు తగులుతాయి. అని హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌కు ఎయిర్‌డిఫెన్స్‌లు మాత్రమేకాకుండా క్షిపణులు భారీగా సరఫరా చేయనున్నారని వెల్లడించారు. ఇక రష్యాపై ట్రంప్ తీసుకుంటున్న చర్యలను యూఎస్ రిపబ్లికన్ సెనెటర్ థామ్ టిల్లిస్ ప్రశంసించారు. 50 రోజుల వరకు సమయం ఇవ్వడం తనకు ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఈ సమయంలో పుతిన్ యుద్ధంలో గెలవడానికి ప్రయత్నిస్తారన్నారు. హత్యలు చేసి, మరింత భూభాగాన్ని కాజేసి ఆ తర్వాత శాంతి చర్చలకు వచ్చేందుకు ముందుకొస్తారన్నారు.

# కోట్లల్లో మరణాలున్నా డీయాక్టివేషన్ తక్కువే..

## ఆధార్‌లో బయటపడిన ఉడాయ్ నిర్లక్ష్యం



**న్యూఢిల్లీ,జూలై 16:** దేశంలో ప్రధాన గుర్తింపు పత్రమైన ఆధార్ కార్డుల గురించి వెలుగుచూడని పలు అంశాలు బయటపడ్డాయి. ఆధార్ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి కేవలం 1.15 కోట్ల కార్డు నంబర్లను మాత్రమే ఉడాయ్ డీయాక్టివేట్ చేసినట్లు తేలింది. ఇప్పటివరకు 16 ఏళ్లలో కోట్ల మంది చనిపోయినా నిలిపివేసిన కార్డు నంబర్ల సంఖ్య మాత్రం తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తు ద్వారా ఈ విషయం వెల్లడైందని కథనాలు వెలుగులోకి వచ్చాయి. 2025 జూన్ నాటికి భారతదేశంలో 142.39 కోట్ల ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఐక్యరాజ్య సమితి జనాభా నిధి ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నాటికి దేశ జనాభా 146.39 కోట్లుగా ఉంది. కాగా, సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఎస్ఆర్) డేటా ప్రకారం 2007-2019 వరకు సగటున ప్రతి ఏటా 83.5 లక్షల మంది మరణించారు. ఇలా ఇన్నేళ్లలో కోట్లమంది మరణించినా ఉడాయ్ డీయాక్టివేట్ చేసిన కార్డు నంబర్ల సంఖ్య తక్కువగానే ఉంది. దాదాపు మరణించినవారి 10 శాతం ఆధార్ కార్డులనే మాత్రమే డీయాక్టివేట్ చేసింది. కాగా, ఇదే విషయంపై ఆర్టీఐ దరఖాస్తుదారుడికి ఉడాయ్ సమాధానమిచ్చింది. మరణించిన వారి ఆధార్ డీయాక్టివేట్ ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉంటుందని ఉడాయ్ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే మరణ ధ్రువీకరణ పత్రాలు, మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేస్తామని వెల్లడించింది. మరణాల ఆధారంగా ప్రతి ఏటా జరిగిన ఆధార్ నంబర్ల డీయాక్టివేట్ గురించి సరైన సమాచారం తమ వద్ద లేదని స్పష్టం చేసింది.

మరణించివారి ఆధార్ కార్డుల సంఖ్య గురించి తమ వద్ద ఎటువంటి ప్రత్యేక డేటా లేదని వెల్లడించింది. మరణించినవారి ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేయడకపోవడం, అలాగే మృతుల ఆధార్ యాక్టివేట్‌లో ఉండడం పట్ల ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. యాక్టివ్‌గా ఉన్న ఆధార్‌లను దుర్వినియోగం చేసే అవకాశాలుంటాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఈ ఐడీ లింక్ ఉన్న ఇతర సర్వీసులపైనా ప్రభావం ఉంటుందని సూచిస్తున్నారు. నకిలీలను నివారించేందుకు సివిల్ డెత్ రిజిస్ట్రీలు, ఆధార్ డేటాబేస్ నిర్వహణలో సమన్వయం ఉండాలని, ఇది తక్షణ అవసరమని హెచ్చరించారు.16 ఏళ్ల క్రితం అంటే 2009లో ఆధార్ ప్రోగ్రామ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి ఈ ఏడాది జూన్ వరకు దేశంలో 142.39 కోట్ల మంది ఆధార్ కార్డులు పొందారు. దేశంలో ఇదొక ప్రధాన గుర్తింపు పత్రంగా ఉంది. అయితే మృతుల ఆధార్ నంబర్లు డీయాక్టివేట్ సంఖ్య తక్కువ ఉండడంతో దేశ ప్రజల్లో ఒకింత ఆందోళన చెలరేగుతోంది. పదేళ్ల క్రితం ఆధార్ కార్డులను పొందిన వారు వాటిని అప్డేట్ చేసుకోవాలని ఉడాయ్ నుంచి వినియోగదారుల ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయి.

అప్పుడు ఊరూరా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆధార్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పదేళ్ల వరకు మాత్రమే చెల్లుబాటయ్యే విధంగా నిబంధనలు తీసుకువచ్చారు. అందుకే ప్రతీ పదేళ్లకు ఒకసారి ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం అన్నింటికీ ఆధార్ కార్డు కీలకమైపో యింది. బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయడం, విద్యార్థుల అడ్మిషన్లు, పింఛన్లు, ఉద్యోగ నియామకాలు, రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రైతు భరోసా లాంటి వాటికి ఆధార్ తప్పనిసరి.

## విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆర్‌పి సింగ్ దంపతులపై సిసిఎస్‌లో కేసు

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆర్‌పి సింగ్‌తో పాటు ఆయన భార్యపై హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సిసిఎ స్)లో కేసు నమోదయ్యింది. భూ వివాదంపై ఓ బిల్డర్ ఆయనపై ఫిర్యాదు చేయగా సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి ఆయనతో పాటు ఆయ న భార్యను పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. వివరాలు ఇలావున్నాయి. విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆర్‌పి సింగ్‌తో పాటు ఆయన భార్య హార్వీందర్ సింగ్‌కు శివార్లలోని ఖాజాగూడలోని సర్వే నంబర్ 19లో 10.32 ఎకరాల భూమి వుంది. అయితే ఇందులో 3.24 ఎకరాలను అమెరి కాలో గల తన కూతురుకు ఆయన గిఫ్ట్‌గా ఇచ్చారు. మిగతా భూమికి మాత్రమే వారు హక్కుదారులు. అయితే కూతురు పేరిట వున్న భూమి కూడా వీరి స్వాధీనంలోనే వుంది. కాగా ఆర్‌పి సింగ్ దంపతులు మొత్తం భూమి తమదే అని చెప్పుకుని ఐ టవర్ అనే నిర్మాణ సంస్థతో ఒప్పందం కుదురు ్చకుని డబ్బులు తీసుకున్నారు. అయితే ఆర్‌పి సింగ్ దంపతుల నుంచి భూమి కొనుగోలు చేసిన నిర్మాణ సంస్థ అందులో 3.24 ఎకరాలు వారికి చె ందినది కాదన్న విషయాన్ని గమనించకుండా వాణిజ్యపరంగా నిర్మాణాలు ప్రారంభించి విక్రయాలు చేబట్టింది. ఇదే సమయంలో నిర్మాణ సంస్థ నుం చి కొందరు వ్యక్తులు ప్లాట్లు కొనుగోలు చేసి బ్యాంకుల వద్ద రుణాలకు వెళ్లిన పుడు భూమిలో 3.24 ఎకరాలు గిఫ్ట్‌గా ఆర్‌పి సింగ్ కూతురు పేరిట వున్న విషయం తెలిసింది. 3.24 భూమి వివాదం పరిష్కారం అయ్యే వరకు రుణాలు ఇవ్వలేమని బ్యాంకులు స్పష్టం చేయడంతో నిర్మాణ సంస్థ ఆర్‌పి సింగ్ వద్దకు రాగా తన కూతురుకు ఇచ్చిన గిఫ్ట్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఈ వివాదం పరిష్కారం కాకపోవడంతో నిర్మాణ సంస్థ ఆర్‌పి సింగ్ దంపతులపై మొదట రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో ఆ తరువాత సిటీ సిసిఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా వి శ్రాంత ఐఎఎస్ అధికారి ఆర్‌పి సింగ్‌తో పాటు ఆయన భార్య హార్వీందర్ సింగ్‌పై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. ఆర్‌పి సింగ్ దంపతులను సిసిఎస్‌కు పిలిపించి విచారించారు. మరోవైపు ఆర్‌పి సింగ్‌కు చెందిన భూమిని కొనుగోలు చేసిన నిర్మాణ సంస్థ నుంచి ప్లాట్లు కొ న్న 700 మంది ఇందులో బాధితులగా మారడంతో ఈవివాదం వెంటనే పరిష్కరించాలని సిసిఎస్ పోలీసులు విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆర్‌పి సి ంగ్‌ను కోరారు. లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వుంటుందని ఆయనను సిసిఎస్ అధికారులు హెచ్చరించారని సమాచారం. ఈ ఉదంతం పై నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) విశ్వప్రసాద్ మాట్లాడుతూ విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆర్‌పి సింగ్‌తో పాటు ఆయన బార్యపై కేసు నమోదైన మాట వాస్తవమేనని తెలిపారు. దీనిని వెంటనే పరిష్కరించుకోవాలని కోరినట్లు వెల్లడించారు.

## సైబర్ క్రైమ్‌పై అవగాహన నిర్వహించిన ఎస్‌బిఐ




**హైదరాబాద్,జులై16,ప్రభాతవార్త:**స్టేట్ బ్యాంక్ ఆఫ్ఇండియా తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న భారీసైబర్ మోసాలపై అవగాహన డ్రైవ్‌ను నిర్వహించినట్లు ఎస్‌బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.ముఖ్యంగాపార్కులు, మెట్రో స్టేషన్లు, ఇండోర్ స్టేడియంలు,సూపర్ మార్కెట్లు, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, పెన్షనర్ల సంఘాలు వంటి 40కి పైగా ప్రాంతాల్లో ఈ ప్రచారం నిర్వహించామని దీనికి అన్ని వర్గాల నుంచి మంచి స్పందన వచ్చినట్లు తెలిపారు.ముఖ్యంగా సైబర్ మోసాల పెరుగుతున్న ముప్పు , వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని రక్షించడం, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు 1,000 మందికి పైగా ఎస్‌బిఐ సిబ్బంది ఈ డ్రైవ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు పెద్ద స్క్రీన్‌లపై విద్యా ఆడియో, వీడియో కంటెంట్‌ను ప్రచారం చేసినట్లు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ బిపిన్ కె సింగ్, ప్రాంతీయ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లతో పాటు ఈ డ్రైవ్ లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు. వాటిని ఏ విధంగా అడ్డుకోవాలనే అంశాలపై వారికి వివరింగా తెలిపినట్లు చెప్పారు.



దివ్యాంగుల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

### ఆగస్టు 13లోగా వికలాంగులకు

# పింఛన్లు పెంచాలి

### లేదంటే సిఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి: మంద కృష్ణ మాదిగ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఆగస్టు 13లోగా వికలాంగులకు ఫించన్లు పెంచ్చుడో...లేదంటే రాజీనామా చేసుడో తెల్చుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వికలాంగులకు,వృద్దులకు పెన్షన్ పెంచుతామని చెప్పి అధికారంలోకి రాగానే అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మెట్రో గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచిపోతున్న పెంచుతామని చెప్పిన పెన్షన్ పెంచలేదని దీంతో ప్రతి నెల వేయి కోట్ల నష్టపోతున్నారని వాపోయారు. పెన్షన్ తీసుకునే వారిలో నూటికి 99 శాతం పేదలే ఉంటారని తెలిపారు. ఎపిలో సిఎం చంద్రబాబు హామీ మేరకు పెన్షన్ పెంచి ఇస్తే తెలంగాణలో రేవంత్‌రెడ్డి పెన్షన్ పెంచి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రుణమాఫీపై ప్రశ్నించే ప్రతిపక్షా పార్టీలు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ పెంపుపై ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.రైతులకు రైతు భరోసా పేరిట పెట్టుబడి సహాయం అందిస్తున్న ప్రభుత్వం కౌలు రైతులకు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ పోరాటం మూలంగానే ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షల పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, బిఆర్ఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు మంద కుమార్, రాజనర్సు, సాయిరాం, యాదగిరి, సంపత్, నారాయణ, పర్శరాములు, రాజు,రమేష్, లక్ష్మణన తదితరులు పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

## కేంద్రీయ అసుపత్రిని తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక) జులై 16 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం సికింద్రాబాద్ లాలాగూడ లోని కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ. శివనాగ ప్రసాద్, సీనియర్ వైద్యులు, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఓల్డ్ ఔట్‌పేషెంట్ బ్లాక్ (ఓ.పి.డి)లోనున్న ఆప్తోమాలజీ, డెంటల్, ఈ.ఎన్.టి, చెస్ట్ క్లినిక్ లను తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ కొత్త ఓ.పి. డి బ్లాక్‌లో, రేడియాలజీ యూనిట్, డాక్టర్ల కన్సల్టేషన్ గదులు, రిటైర్డ్ ఉద్యోగుల వెయిటింగ్ లాంజ్‌లను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న చికిత్సకు సంబంధించిన సౌకర్యాల గురించి ఆయన పెన్షనర్లు, కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించడానికి అదనంగా కావాల్సిన సౌకర్యాల గురించి అభిప్రాయాన్ని వారినుండి తీసుకున్నారు. జనరల్ మేనేజర్ అత్యవసర వార్డు (క్యాజువల్టీ), స్పెషల్ వార్డు, ఇంటెన్సివ్ కరోనరీ కేర్ యూనిట్ (ఐ.సి.సి.యూ), డయాలసిస్ యూనిట్, నూతనంగా ప్రారంభించబడిన కార్డియాక్ క్యాత్ ల్యాబ్ రికవరీ రూమ్‌ను తనిఖీ చేశారు.జనరల్ మేనేజర్ శుభ్రత, పని వాతావరణాన్ని పరిశీలించారు. కొంతమంది రోగులతో సంభాషించారు.వారికి అందుతున్న సౌకర్యాలు మరియు చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. వీటితోపాటు పురుషుల మెడికల్ వార్డులు, ప్రసూతివార్డు శిశువులకు సంబంధించిన నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్.ఐ.సి.యూ) మొదలైన వాటిని తనిఖీ చేశారు.

### సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల్లో గోల్‌మాల్

# నలుగురు అరెస్ట్

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:** తెలంగాణ సీఎంఆర్‌ఎఫ్(సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కుల గోల్‌మాల్ వ్యవహారంలోజూబ్లీహిల్స్ పోలీసులు తాజాగా నలుగురిని అరెస్టు చేశారు. జోగుల నరేష్ (మెట్టుగూడ), వెంకటేశ్(వనస్థలిపురం), వంశీ(ఖమ్మం), ఓంకార్(పెద్దపల్లి)ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎవరూ సంప్రదించని 19 చెక్కుల సొమ్మును వీరు కాజేశారు. ఫోర్జరీ పత్రాలతో వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారు. నిందితుల్లో ఒకరైన జోగుల నరేశ్ మాజీ మంత్రి పేషీలో పనిచేసినట్లు తెలుస్తోంది.

## కేన్సర్ కణితిలాంటిది 'ఇజ్రాయెల్'

### ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమైనీ



**టెహ్రాన్,జూలై 16:** అమెరికా ఇజ్రాయెల్‌లపై ఇరాన్‌సుప్రీం లీడర్ అయతుల్లా ఖమైనీ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇజ్రాయెల్‌నేరాల్లో అమెరికా భాగస్వామి అని మండిపడ్డ ఆయన ఇజ్రాయెల్ ఒక క్యాన్సర్ కణితి వంటిదన్నారు. వాషింగ్టన్ చెప్పుచేతల్లో నడుచుకుంటుందని ధ్వజమెత్తారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందంజరిగి అటు అమెరికాతో అణుచర్చలుజరపనున్నవేళ సుప్రీం లీడర్ ఆగ్రహం వ్యక్తంచేసారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో గొప్పపోరాటంచేసామన్న ఖమైనీ మళ్లీ ఎలాంటి దాడులుజరిగినా ధీటుగా ప్రతిస్పందించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందన్నారు. 12రోజులపాటు జరిగిన యుద్ధంలో జోక్యంచేసుకున్న అమెరికా ఇరాన్‌లో అణుకేంద్రాలే లక్ష్యంగా దాడులుజరిపిన సంగతి తెలిసిందే. అదే సమయంలో ఇరాన్‌కు చెందిన అనేకమంది అణుశాస్త్రవేత్తలు, వందలాదిమంది పౌరులను నెతన్యాహు సైన్యం అంతంచేసింది. మొత్తంగా 1060 మందిచనిపోయారని అంచనా. ఇందుకు ప్రతిస్పందించిన ఇరాన్‌కూడా ఇజ్రాయెల్‌పై డ్రోన్లు, క్షిపణులతో దాడులుజరిపింది. ఆ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా దాడులుచేయడం అనంతరం ఇజ్రాయెల్ ఇరాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించడం జరిగిన సంగతి తెలిసిందే.

వార్త

మౌనం ఎల్లప్పుడూ బంగారం కాజాలదు.
అప్పుడప్పుడూ అది అపరాధం అవుతుంది.
-అసన్

# శుభస్య శీఘ్రం !

రోదసి యాత్రలో మరో వ్యోమగాముల బృందం విజయకేతనాన్ని ఎగురవేసి విజయవంతంగా నేలకు దిగివచ్చింది. యాక్సియమ్-4 వ్యోమగాములు కాలిఫోర్నియా తీరంలో పసిఫిక్ మహాసముద్రంలో శాండియాగో తీరంలో ల్యాండయ్యారంటే ఆ విజయం భారతీయుల ఖాతాలో వేసుకోదగినదే. దాని పైలట్ శుభాన్షుశుక్లా. భారతీయ అంతరిక్షయానంలో భూతల వాసులది సుదీర్ఘ ప్రయాణం. అంచెలంచెలుగా అన్నీ విజయాలే. భారత్‌తోపాటు అమెరికా, చైనా, రష్యా అంతరిక్ష పరిశోధనలన్నీ మెచ్చుతునకలే. ఆరున్నర దశాబ్దాల నాడు అంతరిక్షంలోకి తొలి అడుగుపెట్టింది సోవియట్ వ్యోమగామి యూరీగగారిన్ అయినా, నాలుగు దశాబ్దాల క్రితం అంతరిక్షంలోకి భారతీయుడు రాకేష్‌శర్మ తొలి పరిశోధక వ్యోమగామిగా చేరాడు. ఆ తర్వాత శుభాన్షు శుక్లా అనే భారతీయ వ్యోమగామి వినువీధులు తిరిగొచ్చి భారతీయ కాలమాన ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01గంటల సమయంలో భువికి చేరుకున్నాడు. స్పేస్ మాడ్యూల్ నుంచి బయటికి వస్తూ చిరునవ్వులు చిందించాడు. అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రంలో అడుగుపెట్టినది మొదలు రోదసి నుంచి భూతలాన్ని వీక్షించాడు. విశేషాలను ఎప్పటికప్పుడు చేరవేయడం ఆధునిక సాంకేతికత పుణ్యమే. ఎంతో ఉత్సాహవంతంగా రోదసి యాత్రకు బయలుదేరిన శుభాన్షు 'ఇస్రో' తరపున వెళ్లాడన్న మాటే గాని ఎన్నో దేశాల ఆకాంక్షలను నెరవేర్చుకొచ్చాడు. ఈసారి వెళ్లిన వ్యోమగాముల బృందం భారత్, అమెరికా, హంగరీ, పోలెండ్, సౌదీ అరేబియా, నైజీరియా, బ్రెజిల్ తదితర దేశాల తరపున దాదాపు 60కిపైగా అంతరిక్ష శాస్త్రీయ పరిశోధనలపై కూలంకష అధ్యయనం చేశారు. 18 రోజులు అంతరిక్షంలో అనుభవం వారిని ఎంతో తన్మయుల్ని చేసింది. రోదసి యాత్రను పూర్తి చేసుకొని తిరిగొస్తున్న అద్భుత ఘట్టాలను వీక్షించిన భారతీయులు ఎంతగానో పులకించిపోయారు. గగన్‌యాన్ యాత్రలో మరో మైలురాయిని చేరుకోవడాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీలు అభినందించారు. అశేష భారత ప్రజానీకం ఉప్పొంగిపోయారు. కొన్ని ప్రాంతాలలో కేరింతలు కొట్టారు భారత్‌కు సంబంధించి 7 ప్రయోగాలను శుభాన్షు నిర్వహించారు. రోదసిలోని భావరహిత స్థితి నుంచి తిరిగి భూ గురుత్వాకర్షణ శక్తి ఛాయల్లోకి పయనించడం కాస్త కష్టమే అయినా అంతరిక్ష పరిశోధనలను వేగవంతం చేయడంలో వారి బాధ్యత ఏమిటో గుర్తించి ముందుకు కదిలారు. డ్రాగన్ గ్రేస్ స్పేస్ క్రాఫ్ట్ నుంచి భారత వ్యోమగామి శుభాన్షు భూమికి దిగిన సమయంలో ఆయన తల్లిదండ్రుల భావోద్వేగంతో ఆనంద బాష్పాలు రాలాయి. ఈ సన్నివేశం ప్రపంచమంతా గర్వించదగినది. అంతరిక్ష పరిశోధన, ప్రయోగాలంటే అంత తేలిక కాదు. ఒకప్పుడు కల్పనా చావ్లా తదితర వ్యోమగాములు నింగి నుంచి నేలపైకి వస్తూనే దారిలోనే భస్మీపటలమైందని తెలిసిందే. అదొక దురదృష్టకరమైన సంఘటన. అయితే ఆ తర్వాత పెరిగిన అంతరిక్ష సాంకేతికతల కారణంగా రోదసి యాత్రలో ఎన్నో అననుకూల వాతావరణాన్ని దాటుకుని సునీతా విలియమ్స్ బృందం విజయవంతంగా భువికి దిగివచ్చింది. ఈ అంతరిక్ష యాత్ర ఖర్చెంతో తెలుసా రూ.548 కోట్లు. తొలినాళ్లలో రోదసి యానానికి ఇన్ని కేటాయింపులు ఉండేవి కావు. చంద్రమం దలం మీద ఎప్పుడైతే నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ పాదం మోపాడో ఆ తర్వాత అదేస్ఫూర్తితో భారత్ అంతరిక్ష పరిశోధనలకు అంకురార్పణ చేసింది. ఆ తర్వాత చంద్రయానమూ అంగారక గ్రహం మీద పరిశోధనలు తీవ్రతరం చేసింది. ఇప్పుడు మానవసహిత గగనయానానికి వీలైనంత అవ కాశాలను తీసుకోగలుగుతున్నారు. భారత అంతరిక్ష పరిశో ధనల కోసం వ్యవసాయం నుంచి జాతీయ భద్రతా వ్యవ హారాలకు వ్యూహప్రణాళిక రూపొందించే అంశాలపై ఎన్ని వేల కోట్లయినా వెచ్చించేందుకు భారత్ సిద్ధమవుతోంది. శుభాన్షు శుక్లాతోపాటు పెగ్గీవిట్సన్, స్లావోస్ ఉజ్నైన్‌స్కీ కలిసి యుస్కీ, టిబోర్ కాపు వ్యోమగాములు కూడా అభి నందనీయులే. ఇంత వరకు ఐఎసెస్‌కు వెళ్లిన వ్యోమగాము ల్లో శుక్లాది 634వ స్థానం. వారం రోజుల పాటువీరంతా రిహాబి లిటేషన్ సెంటర్‌లో ఉంటారు. ఆపై వారి అధ్యయ నాల విశ్లేషణ ప్రారంభమౌతుంది. అంతరిక్షయానానికి వెళ్లొచ్చిన యాత్రీకులకు వాతావరణ సంబంధిత అనారోగ్యాలుంటాయి కనుక వారిని సహజస్థితికి చేర్చేందుకు వైద్యుల పరిరక్షణలో ఉంచాల్సి వస్తుందని నాసా నిపుణులు వెల్లడించారు. నిజానికి అంతరిక్షయానానికి అంగీకరిం చా రంటే వారు ఎంతో ఎలాంటి సమస్యలైనా ఎదుర్కోవడానికి సిద్ధమైన ధైర్యవంతులు, అకుంఠిత దీక్షాపరులు, అంకితభావం ఉన్న వారేఅవుతారు. ఇలాంటి రోదసి పరిశోధనలు, ప్రయోగాల పట్ల ఆసక్తి ఉన్న యువతీ యువకులనుముందు రోజులలో శాస్త్రీయ అవగాహన కల్పించి శిక్షణనిచ్చే యంత్రాంగం, ప్రభుత్వం సమకూర్చడం అవసరం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగమించే ఏ దేశమైనా అద్భుతాలు సాధించగలదు. అంతరిక్ష పరిశో ధనల్లో ఎప్పుడు ఇలాంటి విజయాలు సాధించగలిగినా సువర్ణాక్షరాలతో వాటిని లిఖించుకోవాల్సిందే. శుభాన్షు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లఖనవూకు చెందిన వ్యక్తి. ఈ పరిశోధనలు సాఫల్యమైతే 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రం ద్వారానే వ్యోమగాములను పంపడం సాధ్యమౌతుంది. ఈలోగా ఇలాంటి ఎన్నో ప్రయోగాలకు నాసా, ఇస్రో సంయుక్తంగా చేపడితే మరెన్నో శుభయానాలు చరిత్రకెక్కుతాయి.

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

ప్రతిసారి కింద పడినప్పుడు సర్దుకుని మళ్లీ లేచినప్పుడే, అది మన అతిఉత్తమమైన గొప్పతనాన్ని చాటుతుంది.



గోల్డ్‌స్మిత్

# ప్రజావాక్కు



## మౌలిక వసతుల లోపం

హైదరాబాద్ వంటి ఆధునికనగరంలోనూ మానసిక ఆరోగ్యాన్ని పట్టనట్లు చూసే ధోరణి కొనసాగుతోంది. ఇటీవల ప్రచురించిన వార్త కథనం ప్రకారం, నగరంలో సుమారు 32శాతం మంది మానసిక ఆందోళనలకు లోనవుతున్నారు. అయితే వారికితగిన వైద్యసదుపాయాలు అందుబాటులో లేవు. ప్రభుత్వ ఆసుపత్రులు తీవ్రమైన భారం మోస్తున్నాయి. ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య సంస్థ, ఉస్మానియా ఆసుపత్రిలో నిపుణుల కొరత, మౌలిక వసతుల లోపం తలెత్తుతోంది. ప్రైవేటు సేవలుఎంతో ఖరీదైనవిగా మారాయి. ఒక్కో సలహా సమావేశానికి రూ.500 నుంచి రూ.2000 వరకు ఖర్చవుతుండటంతో, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండడం లేదు. పాతబస్తీ, ఎమ్జెట్, బాలాపూర్ లాంటిప్రాంతాల్లో మానసిక ఆరోగ్యంపై మౌలిక అవగాహన కూడా లేదు. మానసిక సమస్యలను చాలామంది తప్పుడు విశ్వాసాలతో చూడటం వల్ల బాధితులు సమయానికి చికిత్స తీసుకోవడం లేదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## బీమా సౌకర్యం కల్పించాలి

ఉపాధి హామీ కూలీలకు ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన వర్తింపజేయాలి అన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఆహ్వానించదగిందే. తెలంగాణలో మొత్తం 1 కోటి 10 లక్షల పని కార్డ్స్ ఉండగా వారిలో 55 లక్షల మంది ప్రతి రోజూ పనికి వెళ్తున్నారు అంటే ఈ 55 లక్షల మంది జీవితాలకు బీమా లభించబోతోంది అన్నది వాస్తవం. ఇక దీనికి చెల్లించాల్సిన మొత్తం ఏడాదికి 20 రూపాయలు మాత్రమే అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలు సులువుగా బీమా పొందుతారు. పని చేసేటప్పుడు ప్రమాద వశాత్తు ఏమైనా జరిగిన భీమా లభించే అవకాశం ఉంటుంది.

- భారత అవినాష్, జనగామ

## లక్క పురుగుల నివారణ జరిగేనా?

తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ జిల్లాలో నెక్కొండ మండల కేంద్రంలోని రైల్వే ట్రాక్ ప్రక్కన ఉన్న గోదాం నుండి నిత్యం వచ్చె లక్కాపురుగుల వలన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు లక్క పురుగుల వలన శరీరంపై దద్దుర్లు దురదలు శరీరం మంటలతో ఇబ్బందులు పడుతున్నారు.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## చెత్తను ఉచితంగా తరలించాలి

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఖాళీ స్థలంలో నగర నాగరీకులు చెత్తనుపార వేస్తుంటారు. కాలనీలోని ట్రాన్స్ఫార్మర్ పార్కుల వద్ద ఇతర ఎక్కడ ఖాళీ స్థలం దొరికినా చెత్తను పారవేయడం ఒక ప్రక్రియగా కొనసాగుతున్నది. చెత్తను తరలించే వాహనదారులకు పైసలు చెల్లించలేక ఈ పని చేస్తుంటారు కొందరు. నిజంగా పైసలు లేక మరికొందరు ఎందుకు పైసలు చెల్లించాలనిఉద్దేశంతో మరికొందరు ప్రభుత్వమే భరించాలని ఉద్దేశంతో ఉంటున్నారు, అదేవిధంగా ఇళ్ల నిర్మాణం కోసం కూల్చివేసిన వ్యర్థాలు కూడా ఖాళీస్థలంలో రోడ్డు ప్రక్కన దర్శనమిస్తుంటాయి. రాష్ట్రప్రభుత్వం ఉచితంగా మంచినీటి సరఫరా, మహాలక్ష్మి పథకం క్రింద స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణము, ఇంకా ఇతర ఉచితంగా పథకాలు సేవలు అందిస్తున్నారు. కార్పొరేషన్ వారు చెత్తను ఆయా స్థలంలో పారవేయకుండా నిరోధించుటకు కొన్ని స్థలాలలో సిబ్బందిని నియమిస్తున్నారు. చెత్తను ఉచితంగా తరలించుటకు ఏర్పాటు చేసిన ఎడల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

-దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

## డైట్ బి.ఎడ్ కాలేజీలకు పూర్వ వైభవం

ప్రభుత్వ డైట్ బి.ఎడ్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల కొరకు కసరత్తు జరుగుతున్నది. గత కొంత కాలంగా డైట్ బి.ఎడ్కాలేజీల్లో అధ్యాపకులు అందుబాటులో లేకపోవడం వల్ల ఉపాధ్యాయ శిక్షణా కోర్సులు చేసే విద్యార్థులకు తరగతులు చెప్పేవారు లేకుండాపోయారు. గెస్ట్ లెక్చరర్‌పోస్టులు కొన్నిచోట్లఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయారు. గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ప్రక్రియ ద్వారా డైట్ బి.ఎడ్ లెక్చరర్‌గా పదోన్నతులు కల్పించారు. ఇప్పుడురెగ్యులర్ అధ్యాపకుల కోసం నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయుటకు కసరత్తు జరగడం మంచి పరిణామం.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## నిజాయితీకి పట్టం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా సేవలు అందించిన పూసపాటి అశోక గజపతి రాజు గోవా గవర్నర్గా నియమింపబడడం అభినందనీయం. ఏడుసార్లు ఎంల్ఏ గా ఎంపిగా రాష్ట్ర కేంద్ర మంత్రిగా సేవలు అందించి నిజాయితీకి ప్రతి రూపంగా ఎన్నోసేవలు చేసి గవర్నర్‌గా నియామకం కావడం తెలుగు ప్రజలకు గర్వకారణం.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సురక్షిత విమానయానం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం

**భారత్‌కు సంబంధించినంత వరకూ ఈ సంఘటన తదుపరి బోయింగ్ విమానాల్లో ప్రయాణాలు 'సేఫ్' అన్న కచ్చితమైన రుజువులు ప్రభుత్వాలు ఇచ్చేంతవరకు ప్రయాణీకులు బెరుకు బెరుగ్గానే విమానయానం చేపట్టారు. అది అవసరమా అన్నదే ముఖ్యమైన ప్రశ్న. అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద విమానసంస్థల మీదా ఉంది. ఈ ఘటన తర్వాత విమానాలు సాంకేతిక కారణాలతో ఎమెర్జెన్సీ లాండింగ్స్ చేస్తుండటంతో ప్రయాణీ కులు మరింత బేజారవుతున్నారు. ఇంతకు మునుపు రోడ్డు ప్రయాణంకంటె విమాన ప్రయాణం 'సేఫ్' అన్నభావన సర్వత్రా ఉండేది. అది ఇప్పుడు మచ్చుకైనా ఎవరూ అనుకోవడం లేదు. అందుకే త్వరగా సంబంధిత అధికార యంత్రాంగం ప్రభుత్వం సముచిత రీతిలో భయాలను పోగొట్టటమే కాకుండా నిర్మాణాత్మకంగా సాంకేతిక నైపుణ్యత్వంతో విమాన ప్రయాణం సురక్షితం అన్నభావన కలిగించిననాడే ఆకాశంలో ప్రయాణీకులు విమానాల్లోహాయిగా ట్రావెల్ చేస్తారు.**



రావులపాటి సీతారాం రావు

భయంకరమైన దుర్ఘటనలు కూడా అనుకోని రీతిలో హాస్యానికి దారి తీస్తాయేమో! అహ్మదాబాద్‌తో పాటు మరికొన్ని విమానాల ప్రమాదాలు ప్రపంచం నలుమూలలా పెద్దవో, చిన్నవో జరుగుతుండటంతో అమ్మకాలను వృద్ధి చేసుకొనే ప్రయత్నంలో టీ తాగే మగ్గలను అమ్మే యూరప్ బిజినెస్‌దారులు 'ఇఫ్ యిట్ ఇజ్ బోయింగ్ ఐయామ్ నాట్ గోయింగ్' అని మగ్గలపై రాసి అమ్ముతుంటే అమెరికాలోని వ్యాపారస్తులు 'ఇఫ్ ఇట్స్ ఆన్ ఎయిర్‌బస్, ఐయామ్ టేకింగ్ ది బస్' అన్న మాటలతో మగ్గలు అమ్ముకుంటూ బదులుకు బదులు ఇస్తున్నారట! ఇలాంటివి ఎంతవరకు నిజమోకాని వైరల్‌గా మారుతున్న ఈ మాటల వెనుక విమానాల తయారీ, మార్కెటింగ్ ధోరణులు కూడా బట్టబయలు అవుతున్న విషయాన్ని గుర్తించక తప్పదు. ఏ వస్తువు తయారీలోనైనా కొన్ని లోపాలు ఉండవచ్చు. బయటకు వచ్చేంతవరకూ తెలియవు. బోయింగ్ విమానాల తయారీలోనే లోపాలు ఉన్నాయన్న ఆరోపణలు అహ్మదాబాద్ బోయింగ్ విమాన ప్రమాదంతో మరింత హైలైట్ అవుతున్నాయి. యూరప్, అమెరికాలు విమానాల ఉత్పత్తి, అమ్మకాల్లో ముందరి వరుసలో ఉంటాయి. ఆధునిక విజ్ఞానం ఆర్థిక ప్రగతిని కూడా తెచ్చిపెడ్తుంది. బోయింగ్ 787-8 ప్రమాదంతో అమెరికాలో ఉత్పత్తి చేస్తున్న బోయింగ్ కమర్షియల్ ఎయిర్ ప్లేన్స్ కంపెనీ ప్రస్తుతం పెక్కు విమర్శలను ఎదుర్కొంటున్నది. 2025 సంవత్సరం జూన్ 12, నాడు జరిగిన అహ్మదాబాద్ విమాన ప్రమాదపు ప్రాథమిక నివేదిక బయటకు వచ్చింది. అందులోని సెంట్రల్‌పాయింట్ అందరినీ ఆలోచింప చేస్తున్నది. ఎయిర్‌క్రాఫ్ ఎక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో విడుదల చేసిన 15 పేజీల నివేదికకు కేంద్రంగా ఈ ముఖ్యవిషయమే అందరి నోళ్లల్లో నానుతున్నది. ఇంజన్ 1, ఇంజన్ 11 విషయమే కంట్రోల్ స్విచ్చులు వేసే పోజిషన్ నుంచి ఆఫ్ చేసే పొజిషన్‌కు ఒకదాని తర్వాత మరొకటి, ఒక సెకండు తేడాతో మారటం ప్రస్తుతం ముఖ్యాంశంగా మారింది. ఈ బోయింగ్ విమానం 3,505 మీటర్ల పొడవువైన రన్ వే నుంచి పైకి ఎగురుతున్నప్పుడు, ఇంజన్లు రెండూ ఫ్యూయల్ ఇంజన్లకు అందకపోవడంతో టేకాఫ్ స్థితి నుంచి విమానం కూలిపోయే ప్రమాద స్థితికి చేరుకుంది. నిజానికి ఇలాంటి పరిస్థితికి అవకాశం లేని విధంగా సిస్టమ్స్‌ను అమర్చటం జరిగింది. రెండు విడి స్విచ్చులు, బ్రాకెట్లుతోసహా ఉండటమే కాకుండా మెటల్ స్టాపింగ్ మెకానిజంతో విడివిడిగా ఉన్నవి ఏవిధంగా ఆగిపోయే స్థితికి అంటే టెక్నికల్ భాషలో 'కటాఫ్' స్టేజీకి వచ్చాయి అన్నదే చిక్కు ప్రశ్నగా ఉంది. ఈ నివేదిక క్లారిటీ ఇవ్వకపోవటం 'కన్‌ఫ్యూజన్' పరిస్థితి నిపుణులకు కూడా ఏర్పడింది. 'కటాఫ్ నీవు చేసావా' అని ఒక పైలట్ అడగటం నాకు తెలియదు అని మరో పైలట్ అనటం వరకే రికార్డు అయి ఉండటం విశేషం. కాక్‌పిట్ వాయిస్ ట్రాన్స్‌క్రిప్ట్ పూర్తిగా అందుబాటులోకి ఈ నివేదిక తెచ్చినట్లు లేదు. అయితే ఇంత అగమ్యగోచర పరిస్థితుల్లో కూడా నిబ్బరాన్ని వదలకుండా పైలట్లు ఇంజ్లను రీలైట్ చేయడానికి ప్రయత్నిస్తూ మేడే కాల్ (ఎస్.ఓ.యస్ లాంటిది) ఇవ్వటం వారు బాధ్యత విస్మరించకుండా ప్రమాదాన్ని తప్పించే ప్రయత్నం



చేయడం చరిత్రలో మిగిలిపోతుంది. అందుకనే విమానాలు పైలట్ల అసోసియేషన్ ఈ రిపోర్టును దాదాపు తిరస్కరించింది. ప్రతిసారి మాదిరే ఈ ప్రమాదానికి అసలు కారణాలు ముఖ్యంగా విమానంలో యంత్రాల పనితీరు లోపాలనుఎత్తి చూపకుండా, పైలట్ల మీదికే త్రోసివేసి, వారినే తప్పుపట్టే ఈ రిపోర్టు ఉందని వారు భావిస్తున్నారు. ముఖ్యమైన అంశాలు వెలికి తీయడానికి బదులు ఈ ఇన్వెస్టిగేషన్ కేవలం పైలట్ తప్పిదాలను ఎత్తిచూపటమే చేసింది. మరింత నిగూఢమైన దర్యాప్తు అందుకే అవసరమని పైలట్ల అసోసియేషన్ అప్పీలు చేస్తున్నది. ఎయిర్‌క్రాఫ్ట్ ఎక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక రిపోర్టులో ఎలాంటి చర్యలూ అటు బోయింగ్ 787-8 ఎయిర్‌క్రాఫ్ట్ విషయంలో కానీ ఇటు బోయింగ్ జియి జియియస్.ఎక్స్-ఐ.బి ఇంజన్ విషయంలో కాని ప్రస్తావించినట్లు బయటకు రాలేదు. రిపోర్టు కేవలం మానవ తప్పిదాన్ని మాత్రమే అదీ కొంతవరకే బయటపెట్టింది. ఈ స్విచ్చెస్ ఆన్ నుంచి ఆఫ్‌కు పొరపాటున సంభవించిందా, లేక కావాలని చేయబడ్డదా అన్న అంశాన్ని కూడా రిపోర్టు ప్రస్తావించలేదు. కేవలం కాక్‌పిట్ రికార్డు చేసిన పైలట్ల వాయిస్ విషయాలు మాత్రమే రిపోర్టులో పేర్కొన్నది. కాక్‌పిట్‌లో రికార్డు అయిన మొత్తం పైలట్ల సంభాషణ అంత వరకే పరిమితమా లేక పూర్తిగా బయటకు రాలేదా అన్న విషయం కూడా నిపుణులు తర్జన భర్జన పడుతున్నారు. (క్లారిటీ రిపోర్టులో లేకపోవడంతో). అంతర్జాతీయంగా ఒత్తిడి ఎఎఐబి మీద ఉండటం వల్ల పూర్తి సమాచారం అందుకే బయటకు రావటం లేదనే ఆరోపణలు పైలట్ల ఎసోసియేషన్స్ పరంగా బయటకు వస్తున్నాయి. కొన్ని వివరాలు ఇచ్చినా పూర్తిస్థాయి సమాచారం రిపోర్టులో లేకపోవడంతో అనేక ఊహాగానాలు ఊళ్లేలుతున్నాయి. ఈప్రమాదం జరిగిన మరుసటి రోజు నుంచీ ఎలక్ట్రానిక్ మీడియా, యూ-ట్యూబ్ కథనాలూ, బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ (అలాంటి ఎయిర్ క్రాఫ్ట్ క్రాష్ కాబడ్డది)ను భూతద్దంలో చూపిస్తున్నాయి. కేంద్ర విమానశాఖ మంత్రి కె.రామమోహన నాయుడు తొందరపడి ఈ ప్రాథమిక రిపోర్టుతో నిర్ధారణకు రావద్దని, ఫైనల్ రిపోర్టులోనే పూర్తి వాస్తవాలు వెలికివస్తాయని హెచ్చరించిన తర్వాత కూడా విమర్శల పరంపరకు 'ఫుల్‌స్టాప్' పడకపోవడం దురదృష్టకరం. ఏవియేషన్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ అమిత్‌సింగ్‌కు చాలా అనుభవం ఉంది. బోయింగ్ 777 ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడిపిన వ్యక్తి యన్.జి.వో సేఫ్టీ విషయాలు వేదిక ఫౌండర్ కూడా. ఆయన ఈ రిపోర్టు టెక్నికల్ విషయాలల్లో పారదర్శకతను అవలంబించలేదు. అవసరమైన రికమెండేషన్స్, ఇన్‌స్పెక్షన్లు చేయకుండా, సత్వరం తీసుకోవాల్సిన సర్దుబాటు చర్యలు చెప్పకుండా ఇంతపెద్ద ప్రమాదాన్ని ఈ రిపోర్టుతో సరిపెట్టడం భావ్యంకాదని అభిప్రాయపడ్డారు. వాల్‌స్ట్రీట్ జర్నల్, ఎయిర్ కరెంట్ కథనాలు మరో విషయం ఎంతవరకు నమ్మాలో గానీ, బయటపెట్టాయి. ఫ్యూయల్ స్విచ్ఛ్ విషయప్రస్తావన దర్యాప్తు సందర్భంగా యు.యస్ నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్, ఎఎబి (యు.కె) వాక్‌ఔట్ బెదిరింపులకు కూడా తలపడ్డాయని ఈ కథనాలు తెలపటం విశేషం. అందువల్లే ప్రాథమిక రిపోర్టు త్వరగా వచ్చిందని ఆ కథనాలు చెప్తున్నాయి. ఒక సంఘటన అదీ అత్యంత విషాదకరమైనది సంభవించినప్పుడు నిజాలు అంత తేలిగ్గా బయటకురావు. ఎవరికి వారు స్వలాభం కోసం కథనాలు వండి ప్రచారంలో పెట్టడం కొత్తేమీ కాదు. కానీ భారత్‌కు సంబంధించినంత వరకూ ఈ సంఘటన తదుపరి బోయింగ్ విమానాల్లో ప్రయాణాలు 'సేఫ్' అన్న కచ్చితమైన రుజువులు ప్రభుత్వాలు ఇచ్చేంతవరకు ప్రయాణీకులు బెరుకు బెరుగ్గానే విమానయానం చేపట్టారు. అది అవసరమా అన్నదే ముఖ్యమైన ప్రశ్న. అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద విమానసంస్థల మీదా ఉంది. ఈ ఘటన తర్వాత విమానాలు సాంకేతిక కారణాలతో ఎమెర్జెన్సీ లాండింగ్స్ చేస్తుండటంతో ప్రయాణీకులు మరింత బేజారవుతున్నారు. ఇంతకు మునుపు రోడ్డు ప్రయాణం కంటె విమాన ప్రయాణం 'సేఫ్' అన్న భావన సర్వత్రా ఉండేది. అది ఇప్పుడు మచ్చుకైనా ఎవరూ అనుకోవడం లేదు. అందుకే త్వరగా సంబంధిత అధికార యంత్రాంగం ప్రభుత్వం సముచిత రీతిలో భయాలను పోగొట్ట టమే కాకుండా నిర్మాణాత్మకంగా సాంకేతిక నైపుణ్యతతో విమానప్రయాణం సురక్షితం అన్నభావన కలిగించిననాడే ఆకాశంలో ప్రయాణీకులు విమానాల్లోహాయిగా ట్రావెల్ చేస్తారు. ●

# ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కీలకం!

అప్పన్న గొనప

ఉత్తరాంధ్ర రైతాంగ చరిత్రలో ఆమదాలవలస షుగర్ ఫ్యాక్టరీ ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. 1960లలో స్థాపితమైన ఈ పరిశ్రమ, చెరకు రైతులకు, కార్మికులకు ఉపాధి మాత్రమే కాకుండా గౌరవం, భద్రతను కూడా అందించింది. సమీపంలోనే చెరుకును ప్రాసెస్ చేసి తగిన ధరతో రైతులకు చెల్లింపులు అందించడం ద్వారా ఈఫ్యాక్టరీ గ్రామీణ జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది. 1960-90లలో ఉత్తరాంధ్రలో వృద్ధి చెందుతున్న చెరకు సాగుతో పాటు, ఆమదాలవలస ఫ్యాక్టరీ సంవత్సరానికి లక్షల టన్నుల చెరుకును ప్రాసెస్ చేసింది. 1200 మందికి పైగా కార్మికులకు ఉద్యోగాలు ఇచ్చింది. 1990ల చివరి వరకు ఉత్తరాంధ్రలో 50లక్షల టన్నుల చెరకు ప్రాసెసింగ్ సాధ్యమయ్యింది(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గణాంకాలు, 1995). ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సుస్థిరతను కలిగించింది. వీటి ద్వారా స్థానిక వ్యాపారాలు, రవాణా రంగం కూడా అభివృద్ధి చెందాయి. కానీ, 1990లలో నుంచి పాలనా లోపాలు, అప్పుల భారం, రాజకీయ జోక్యాలు కారణంగా ఈ పరిశ్రమ ఆర్థిక కష్టాల్లో పడింది. రైతులకు చెల్లింపులు ఆలస్యమై నమ్మకం కోల్పోయింది. 2003లో ఫ్యాక్టరీ మూతపడటంతో ఉత్తరాంధ్రలో చెరుకు సాగు 2014 నాటికి 1.25లక్షల హెక్టార్ల నుండి 40,000 హెక్టార్లకు (సుమారు 68 తగ్గుదల) తగ్గింది. 2010 దశకంలో రాష్ట్రంలో 29 షుగర్ ఫ్యాక్టరీలు ఉండగా, ఇప్పుడు 5 ఫ్యాక్టరీలు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. 2022-23లో షుగర్ కేన్ ప్రాసెసింగ్ 25 తగ్గడం, జగ్గేరి ఉత్పత్తి 38 క్షీణించడం ఈ పరిశ్రమ సంక్షోభాన్ని సూచిస్తుంది. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం పరిశ్రమ పునఃప్రారంభానికి రూ.300 కోట్ల నిధులు మంజూరు చేస్తామని, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఆధునిక




యంత్రాలు అమలు చేస్తామని ప్రకటన చేసింది. ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. కానీ గతంలో ప్రభుత్వాలు హామీలు నెరవేర్చకపోవడం వల్ల ఆ సందేహాలు కూడా ఉన్నాయి. పునఃప్రారంభానికి ముందు మార్కెట్ పరిస్థితులు పూర్తిగా విశ్లేషించాలి. దేశీయ, అంతర్జాతీయ షుగర్ డిమాండ్, ధరల మార్పులను దృష్టిలో పెట్టుకుని వ్యూహాత్మక ఉత్పత్తి చేయాలి. రైతులకు కనీసం రూ.4500 టన్ను ధర హామీగా ఇవ్వాలి. చెల్లింపులు వేగంగా జరగాలంటే పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. రైతులను ప్రాసెస్‌లో భాగస్వాములుగా చేర్చడం ద్వారా నమ్మకం పెరుగుతుంది. గతంలో పనిచేసిన 1200 కార్మికుల గ్రాట్యుటీ, పెన్షన్‌లు వెంటనే చెల్లించాలి. వారి అనుభవాన్ని వినియోగించుకొని సలహాదారులుగా నియమించుకోవడం పరిశ్రమ విజయానికి దోహదం అవుతుంది. యువతకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేసి ఆధునిక యంత్రాలనిర్వహణ, నాణ్యత నియంత్రణలో నైపుణ్యాలు కల్పించాలి. స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. ఫ్యాక్టరీ పునరుద్ధరణతో గ్రామీణ వ్యాపారాలు, రవాణా రంగం, మార్కెటింగ్ సేవలు అభివృద్ధి చెందుతాయి. స్థానిక బ్యాంకులు, కో ఆపరేటివ్ సంస్థలు క్రియాశీలక మవుతాయి. ఇది గ్రామీణ ఆర్థికవ్యవస్థలో కొత్తశక్తిని నింపుతుంది. ఈ మార్గంలో ప్రభుత్వం పారదర్శకతతో వ్యవహరించాలి. ప్రతిరోజూ పురోగతి నివేదికలు, ప్రజలతో నేరుగా కమ్యూనికేషన్ అవసరం. రైతులు, కార్మికులు, అధికారుల మధ్య సమన్వయానికి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలి. ప్రతి నిర్ణయం ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. అందువల్ల ఆమదాలవలస ఫ్యాక్టరీ పునఃప్రారంభం కేవలం ప్లాంట్ ఓపెనింగ్ కాదు -ఉత్తరాంధ్ర గ్రామీణ జీవనానికి వెలుగు. ఇది రైతుల, కార్మికుల ఆత్మగౌరవానికి ప్రతీక. ఇది ఒకసామాజిక బాధ్యత. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బాధ్యతగల దృష్టితో ముందుకు రావాలి. గత హామీలను కార్యరూపంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి. కేవలం నిధుల మంజూరు మాత్రమే కాదు, వాటి వినియోగం ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. రైతులకు తక్షణ చెల్లింపులు, కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి. ●

# భారత్ - కెనడా దౌత్య సంబంధాలు కొత్త మలుపు

యేచన్ చంద్రశేఖర్

అనూహ్యమైన నిర్ణయాలకు నిలయం అమెరికా విశ్వసనీయత లేని చైనా మధ్య చిక్కుకున్న కెనడాకు, భారత దేశంతో కలిసి ముందుకు సాగడం స్థిరమైన ప్రత్యామ్నాయంగా గోచరిస్తోంది. జి7 శిఖరాగ్ర సమావేశం అనంతరం భారత్, కెనడాలు పరస్పర ప్రజాస్వామ్య విలువలు, చట్టపాలన పట్ల గౌరవం, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత సూత్రాలకు నిబద్ధతపై చేసిన ఉమ్మడి ప్రకటన ఇటీవలి సంవత్సరాల ఉద్రిక్తతలకు ఉపశమనంగాభావించవచ్చు. ఈ ఏడాది జూన్ 15 నుంచి మూడు రోజుల పాటు ఆల్బెర్టాలోని కననాస్కిస్‌లో జరిగిన జి7 శిఖరాగ్ర సమావేశానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ఆహ్వానించడంతో భారత్, కెనడా సంబంధాలలో ఒక ముందడుగు పడింది. అప్పటి కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలు అసంబద్ధమైనవి, రాజకీయంగా ప్రేరేపితాలని ఖండించడంతో పాటు ఖలిస్తానీ ఉగ్రవాదులు తీవ్రవాదులకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తోందని, మనదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని వెంటనే ప్రత్యారోపణలతో తిప్పి కొట్టాం. తన ఆరోపణలకు మద్దతు ఇచ్చే ఏ ఆధారాలన్నీ అందించలేకపోయింది. కెనడియన్ సిక్కు కార్యకర్త హార్దీప్ సింగ్ నిజ్జర్‌ను జూన్ 2024లో బ్రిటిష్ కొలంబియాలో భారత ప్రభుత్వ ఏజెంట్లు హత మార్చారని కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో సెప్టెంబర్ 2023లో చేసిన ఆరోపణ తర్వాత ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక దౌత్య సంబంధాలు స్తంభించాయి. మళ్లీ ఇన్నాళ్లకు ఇప్పుడు పునరుద్ధరణ దిశగా సాగే అవకాశాలు కనబడుతున్నాయి. 2025 జి7 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా పలు జి7 సభ్య దేశాలు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారతదేశంతో సహకారాన్ని పెంపొందించుకున్న నేపథ్యంలో, జి7 శిఖరాగ్ర సమావేశం కెనడాకు కూడా ఒక వ్యూహాత్మక అవకాశాన్ని అందించినట్లయ్యింది. అయితే, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణ మార్గం రెండు వైపులా జాతీయ భద్రతా సమస్యలతో ముడిపడి ఉంది. కెనడా విదేశీ జోక్యం అంతర్జాతీయ అణచివేత గురించి ఆందోళన చెందుతుండగా భారతదేశం కెనడాలో వేళ్ళూనుకుంటున్న ఖలిస్తానీ ఉగ్రవాదం గురించి ఆందోళనచెందుతోంది. అనిశ్చితి, అనైకృత నేపథ్యంలో, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కెనడా పర్యటన ద్వైపాక్షిక సంబంధాలలో అనూహ్యమైన స్వాగతించదగిన మలుపుకు తెరలేపింది. మాజీ కెనడా ప్రధానిజస్టిన్ ట్రూడో పదవీకాలంలో సుదీర్ఘకాలం కొనసాగిన దౌత్యపరమైన ఒత్తిడి తర్వాత ఈ మార్పు రావడం హర్షించదగ్గ పరిణామం. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణ మారుతున్న ప్రపంచ ఆర్థిక దృశ్యానికి, ముఖ్యంగా



గ్లోబల్ సౌత్ పెరుగుతున్న ప్రాబల్యానికి సంకేతంగా నిలుస్తాయి. రెండు దేశాలు తమ విదేశాంగ విధానాల పునఃమూల్యాంకానికి సిద్ధమవుతున్న తరుణంలో భారతదేశంతో కెనడా సంబంధాలు మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. రెండు దేశాలు కూడా తమ తమ హైకమిషనర్లను పునర్నియమించడం, సీనియర్ మంత్రిత్వ కార్యనిర్వాహక స్థాయి కార్యకలాపాలను పునఃప్రారంభించడంతో పాటు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందానికి దారితీసే సహకార రంగాలను గుర్తించడం లాంటి నిర్ణయాలు ద్వైపాక్షిక సంబంధాలకు శుభసూచకం. భారత్‌లో కెనడా సంబంధాలను పునఃపరిశీలిస్తానని ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాన్ని అమలులో కెనడా ప్రధాని తీసుకున్న ఈనిర్ణయానికి కెనడాలోని కొన్ని వర్గాల నుండి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కార్నీ ఈ నిర్ణయంతో కెనడా దీర్ఘకాలిక భౌగోళికఆర్థిక వ్యూహం అభివృద్ధి చెందడంతోపాటు భారతదేశంతో సంబంధం ద్వైపాక్షికంగా, ప్రత్యేకించి ఇండో పసిఫిక్ క్షేత్రంలో ఒక కీలకమైన అంశంగా మారే అవకాశం ఉంది. ఈ ఏడాది శిఖరాగ్ర సమావేశంలో జి7 స్వభావంలో కొంత మార్పు కనిపించింది. కీలకమైన అంతర్జాతీయ సమస్యలపై జి7 సభ్యులు, అమెరికా మధ్య గణనీయమైన అంతరాలను ఈ సమావేశం వెల్లడిచేసింది. ఉక్రెయిన్‌పై ఏకీకృత విధానాన్ని కొనసాగించలేని పరిస్థితి గత ప్రకటనను ఉపసంహరించుకొంది. దౌత్యంలో మాత్రమే కాకుండా, ఆర్థిక భద్రతా నిబద్ధతలలో కూడా అమెరికా నిరంతర మద్దతు ఆవశ్యకతను తేటతెల్లం చేసింది. అంతేకాదు, అర్థవంతమైన చర్చలు వ్యూహాత్మక కార్యాచరణకు గ్లోబల్ సౌత్ దేశాలైన భారత్, బ్రెజిల్, మెక్సికో దక్షిణాఫ్రికాల ఉనికి అత్యంత కీలకం అనే సంకేతం అందించింది. మునుపటి 'జి8'నుండి రష్యాను తొలగించడం ఒక వ్యూహాత్మక తప్పిదమని ట్రంప్ చేసిన ప్రకటన ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధంపై ఉద్రిక్తతలను పెంచింది. గాజాలో కాల్పుల విరమణతో సహా శత్రుత్వాలను తగ్గించాలని' పిలుపునిచ్చే ప్రకటనను జి7 ఆమోదించినప్పటికీ, ఇలాంటి ప్రకటనలు ఏకాభిప్రాయ సాధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా, ప్రపంచ సప్లై అండ్ చైన్ వ్యవస్థలో కీలకమైన శక్తిగానే కాకుండా ఇండోపసిఫిక్ భద్రతలో కీలక పాత్ర పోషించే దేశంగా, భారతదేశం ప్రధాన జి7 చర్చలకు దూరంగా ఉండటంవల్ల అనేక ఫలితాలు అర్థరహితంగా ఉంటాయన్న ఒక వాస్తవం బయటకొచ్చింది. గ్లోబల్ సౌత్ దేశాలుగా పరిగణించబడే భారతదేశం, బ్రెజిల్, మెక్సికో దక్షిణాఫ్రికా చేరికతో అర్థవంతమైన చర్చలు సాధ్యమనే సంకేతం కూడాపంపింది. ఒకప్పుడు ఏకాభిప్రాయం గల సంపన్న ప్రజాస్వామ్య దేశాలక్లబ్‌గా ఉన్న జి7పరిస్థితి ఇప్పుడు భిన్నంగా ఉంది. ఈ సమూహం భవిష్యత్ ఔచిత్యం దాని అంతర్గత ఐక్యతను కొనసాగించే సామర్థ్యంపై మాత్రమే కాకుండా, ప్రపంచంలోనే నాల్గవ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారతదేశంతో కలిసి పనిచేయడంతోపాటు ఎజెండాను రూపొందించడానికి దానిసంసిద్ధతపై కూడా ఆధారపడి ఉంటుంది. జి7 శిఖరాగ్ర సమావేశం భారత్, కెనడా సంబంధాలలో ఒక కొత్త అధ్యాయానికి తెరలేపింది. హైకమిషనర్లను పునరుద్ధరించడానికి వాణిజ్యం ఇతర రంగాలలో సహకారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు ఇది మార్గం సుగమం చేసింది. ●

# 21 నుంచి వర్షాకాల పార్లమెంటు



## 8 కీలక బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

### పహల్గాం, ఆపరేషన్ సిందూర్, ఓటర్ల సవరణలపై విపక్షాల ఫోకస్

**న్యూఢిల్లీ, జూలై 16:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈనెల 21వ తేదీనుంచి ప్రారంభం కానున్న తరుణంలో వచ్చే ఆదివారం రోజున అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. ఈనెల 21వ తేదీనుంచి వచ్చేనెల 21వ తేదీవరకూ వర్షాకాల సమావేశాలు జరుగు తాయి. ఈ సమావేశాల్లో మొత్తం 8 బిల్లులు ప్రవేశ పెట్టి ఆమోదింప చేసుకో వాలని అధికార పక్షం చూస్తోంది. మొత్తం 21 సార్లు సమావేశాలు జరుగు తాయని అంచనా. అధికార విపక్షాల మధ్య ఈసారి సమావేశంలో కూడా వాదోపవాదాలు వాడివేడిగానే జరిగే అవకాశాలున్నాయి. ఎన్నికల సంఘం బీహార్ ఎన్నికల తరుణంలో ప్రత్యేక సవరణలకు ఆదేశించడాన్ని కాంగ్రెస్, ఆర్జేడీలు వ్యతిరేకిసు న్నాయి. అయితే ఎన్నికల సంఘం వీటిని పారద ర్శకంగా ఎన్నికల ప్రక్రియ కోసమే చేస్తున్నట్లు ప్రకటించింది.ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలోఉంది. అలాగే ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్‌వర్మ పదవీచ్యుతిపైనా చర్చలుజరిపే అవకాశం ఉంది. ఆయన ఇంట్లో నోట్లకట్టలు లభించిన కేసుకు సంబంధించి సుప్రీం చీఫ్‌జస్టిస్ గతంలోనే నివేదిక ఇచ్చారు. ఇక పహల్గాంవ్ ఉగ్రదాడిపైనా, ఆపరేషన్ సిందూర్‌పైనా ప్రత్యేక చర్చలు జరపాలని ప్రతి పక్షాలు పట్టుబడుతు న్నాయి. ఇక అధికారపక్షం పరంగా కొత్త ఆదాయపు పన్నుసవరణబిల్లును ఈసమావే శంలో ప్రవేశ పెట్టాలనిచూస్తోంది. గత సమావే శాల్లో ఈ బిల్లును జెపిసి పరిశీలనకు పంపిం చారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ సమావేశాల్లోనే పాతచట్టం స్థానంలో సవరణ లతో కొత్తచట్టం ఉంటుందని, సరళీకృత విధా నంలో ఐటిఆర్ దాఖలుకు వీలుకల్పిస్తు న్నట్లు చెప్పారు. ఈ సమావేశాల్లో బిల్లు పాస్ అయితే 2026 ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి అమలుకు వస్తుంది. అలాగే ఆర్థిక సంవత్సరం స్థానంలో పన్ను సంవత్సరంగా వినియోగించా లన్న ప్రతి పాద నలు. వంటివి ఈ బిల్లులో ఉన్నాయి. ట్యాక్స్ ఇయర్ అంటే ఆ యేడాది ఆర్జించిన ఆదాయంపై పన్నుఅని అర్థం వస్తుంది. అలాగే జాతీయ క్రీడా విధానం, సుపరిపాలన బిల్లు, నేషనల్ యాంటీ డోపింగ్ సవరణ బిల్లు మైన్స్ అండ్‌మినరల్స్ సవరణ బిల్లులు వంటివి ఈ సమావేశాల్లో ప్రవేశపెడుతున్నారు. మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ సవ రణ బిల్లు, జన్‌విశ్వాస్ సవరణ కేటాయింపుల బిల్లు, ఐఐఎం సవరణ బిల్లు, పన్నులవ్యవస్థ సవరణ బిల్లులు మొత్తం ఈ సమావేశాల్లోనే ఆమోదింప చేసుకోవాలని ఎన్డీయే పక్షాలు యోచి స్తున్నాయి. మొత్తంగాచూస్తే ఎన్డీయే పక్షం ఈ సమావేశాల్లో 8 కీలక బిల్లులను ఆమోదింప చేసుకోవాలనిచూస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా జెపిసికి నివేదించిన కొత్త ఆదాయపు పన్నుచట్టం పైనే ఎన్డీయే ఫోకస్ పెంచింది.



## వారానికి 100 గంటలు పనిచేసే ప్రధాని మోడీ

### ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి

**న్యూఢిల్లీ, జూలై 16:** పనిగంటలపై కొంతకాలంగా దేశంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో వారంలో 100 గంటలు పనిచేసే వ్యక్తి ప్రధాని మోడీ మాత్రమేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణమూర్తి అభిప్రాయపడ్డారు. ఎంపి తేజస్వి సూర్య ఈ విషయాన్ని వెల్లడించారు. నారాయణమూర్తితో కలిసి విమానంలో ప్రయాణించగా తమ మధ్య పని గంటలపై చర్చ జరిగినట్లు వెల్లడించారు. ముంబయి నుంచి బెంగళూరుకు తిరిగి వెళుతుండగా నారాయణ మూర్తితో కలిసి విమానంలో ప్రయాణించినట్లు తేజస్వి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తమ మధ్య ఎంతో స్ఫూర్తిదాయకమైన సంభాషణ జరిగిందన్నారు. భారత ఐటి సేవల రంగానికి నారాయణ మూర్తి మార్గదర్శకత్వం వహించి దానిని ప్రపంచశక్తి కేంద్రంగా మార్చారన్నారు. ఇన్ఫోసిస్ లక్షలాది మంది మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కారణమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఎఐ, నైతిక విలువలు తదితర అంశాల గురించి కూడా తమ మధ్య చర్చకు వచ్చాయని తెలిపారు. కాగా మీరు చెప్పిన వారానికి 70 గంటలు పని చేయడానికి ప్రయత్నిస్తున్నా అని నారాయణమూర్తితో సరదాగా చెప్పానని తేజస్వి పేర్కొన్నారు. అందుకు నాకు తెలిసి వారానికి 100 గంటలు పనిచేసే వ్యక్తి ఒక్క ప్రధాని నరేంద్రమోడీ మాత్రమే అని ఆయన బదులిచ్చారని తెలిపారు. ప్రపంచదేశాలతో పోటీపడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటలపాటు పనిచేయాలని నారాణమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కొందరు దీన్ని సమర్థిం చగా మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పని చేయాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్.ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి.



## ఇస్లామిక్ విద్యా బోధనలో తప్పేముంది? సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూలై 16:** ఎంఐఎం పార్టీ గుర్తింపును రద్దు చేయాలన్న ఓ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. తిరుపతి నరసింహా మురారి అనే వ్యక్తి తరఫున దాఖలైన ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున విష్ణుశంకర్‌జైన్ అనే న్యాయవాది వాద నలు వినిపిస్తూ.. ఎంఐఎం పార్టీ ముస్లింలలో ఇస్లామిక్ విద్యను పెంపొందిస్తామని, షరియా చట్టం పట్ల అవగాహన పెంచుతామని చెబుతోం దని అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనికి ధర్మా సనం స్పందిస్తూ 'దీంట్లో తప్పేముంది? ఇస్లామిక్ విద్యను బోధించటం తప్పేమీకాదు. మరిన్ని రాజకీయపార్టీలు ఇలా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తే మేంస్వాగతిస్తాం' అని వ్యాఖ్యానిం చింది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలను నేర్పించ టానికి హిందూ పేరుతో తాను ఒక రాజకీయ పార్టీ పెడతానంటే ఎన్నికల సంఘం అంగీకరిం చదని, ఇది వివక్షేనని అన్నారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. 'వేదాలు, ఉపనిషత్తులు బోధించటానికి ఇసి అభ్యంతరం చెబితే సంబధిత వేదికలపై ఫిర్యాదు చేయండి. చట్టం తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుంది' అని స్పష్టం చేసింది. ఒక మతపరమైన చట్టానికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తున్నప్పుడు ఆ మతపరమైన చట్టాన్ని తాము బోధిస్తామని ఏదైనా రాజకీయపార్టీ చెబితే అందులో అభ్యంతరాలు ఉండక్కర్లేదని తెలిపింది. ఇక, దేశంలోని మైనారిటీల హక్కులకు రాజ్యాంగం కొన్ని రక్షణలు కల్పించిందని, ఆ రక్షణల అమ లుకోసం పనిచేస్తామని ఎంఐఎం రాజ్యాంగం స్పష్టం చేస్తోందని పేర్కొంది. సమాజం శ్రేయస్సు కోసం కృషిచేస్తామని హామీ ఇచ్చిన ప్పటికీ సమాజంలో మతపరమైన చిచ్చు రేపే పనులు చేసేపార్టీలు, అభ్యర్థులు ఉండే అవకాశం ఉందని ధర్మాసనం పేర్కొంది. కొన్ని పార్టీలు కులంపై ఆధారపడి రాజకీయాలు చేస్తున్నాయని, ఇది సమాజానికి ప్రమాదకర మని తెలిపింది.

## భారత్ నౌకాదళ అమ్ములపొదిలో కొత్త అస్త్రాలు!



**న్యూఢిల్లీ, జూలై 15:** భారత నౌకాదళం అమ్ముల పొదిలో అణు, జీవ, రసాయన ప్రమాదాలను సైతం గుర్తించి, అరికట్టే వ్యవస్థలు వచ్చి చేరాయి. స్వదేశీ పరిజ్ఞానంతో అత్యంత ఆధునిక సాంకేతికతను వినియోగించి రూపొందించిన ఆరు రక్షణ వ్యవస్థలను నౌకాదళానికి డిఆర్‌డివో అందించింది. వీటిలో అణు, జీవ, రసాయన రక్షణ వ్యవస్థలు ఉన్నాయని, ఇవి వ్యూహాత్మక జాతీయ భద్రతలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని డిఆర్‌డివో వెల్లడించింది. అదే విధంగా నౌకాదళ సిబ్బంది గుణాత్మక అవసరాలకు ఇవి ఎంతగానో తోడ్పడనున్నాయని తెలిపింది. ఈ వ్యవస్థలను నౌకాదళ ప్రధాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అడ్మిరల్ శ్రీరాం అముర్‌కు డిఆర్‌డివో ఛైర్మన్, డిడిఆర్‌డి సెక్రటరీలు అందించారు. గామా రేడియేషన్ ఏరియల్ సర్వైవలెన్స్ సిస్టమ్‌లో తేలికపాటి గామా రేడియేషన్ మాడ్యూల్‌ను వినియోగించి రూపొందించిన ఈ వ్యవస్థ అణు స్థావరాలు, రేడియేషన్ ఉన్న ప్రాంతాల్లో సైతం వైమానిక రేడియలాజికల్ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ఎన్విరాన్‌మెంటల్ సర్వైవలెన్స్ వెహికల్ ప్రమాదకర వాతావరణాల్లో కూడా అణు, జీవ, రసాయన ఆయుధాలను, దాడు లను గుర్తిస్తుంది. వెహికల్ రేడియలాజికల్ కంటామినేషన్ మానిటరింగ్ సిస్టమ్ (వీఆర్‌సీ ఎంఎస్) అయితే అణుకలుషిత, రేడియలాజి కల్‌గా ప్రమాదకరమైన వాతావరణ పరిస్థితుల్లో పనిచేసే వాహనాలు, సిబ్బందిపై రేడియేషన్ ప్రభావాన్ని గుర్తిస్తుంది. అదేవిధంగా సర్వే చేసేందుకు ఉపయోగపడుతుంది. అండర్ వాటర్ గామా రేడియేషన్ మానిటరింగ్ సిస్టమ్‌తో నీటి అడుగున గామా రేడియేషన్ స్థాయిలను అంచనా వేసి, డేటా బేస్ స్టేషన్‌కు చేరవేస్తుంది. పోర్టులు, తీరప్రాంతాలు, నేవీ కార్యకలాపాల్లో భద్రతకు దోహదపడుతుంది. ఇక డర్ట్ ఎక్స్‌ట్రాక్టర్ అండ్ క్రాస్ కంటామినేషన్ మానిటర్ సాయంతో ప్రమాదకర పదార్థాలను బదిలీ చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. జీవ, రసాయన, రేడియాలజీ ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతుంది. పాదరక్షల నుంచి కూడా కలుషితాలను సంగ్రహిస్తుంది. చివరిగా ఆర్గాన్ రేడియాక్టివిటీ డిటెక్షన్ సిస్టమ్‌ను ఏర్పాటుచేయడంవల్ల మానవ అవయవాలలో రేడియోధార్మికత స్థాయిలను గుర్తిస్తుందని డిఆర్‌డిఒ విశ్లేషించింది.

## క్షమాబిక్ష ప్రశ్నేలేదు.. శిక్షపడాల్సిందే!



### మృతుడి సోదరుడు అబ్దుల్ ఫత్తా మెహదీ

### కేరళ నర్సు నిమిషప్రియ కేసు రోజుకో మలుపు

**న్యూఢిల్లీ, జూలై 16 :**యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. బుధవారం అమలు కావాల్సిన ఉరిశిక్ష తాత్కాలికంగా వాయిదా పడటంతో అంతా ఊపిరిపీల్చు కున్నారు. బాధిత కుటుంబాన్ని బ్లడ్ మనీకి ఒప్పించేందుకు సమయం చిక్కిందని అంతా భావించారు. కానీ, అంతలోనే మృతుడి సోద రుడు అబ్దుల్ ఫత్తా మెహదీ బాంబు పేల్చాడు. నేరానికి క్షమాపణ అంటూ ఉండదని, చేసిన తప్పుకు నిమిషకు శిక్ష పడాల్సిందేనని ఫేస్ బుక్ వేదికగా పోస్ట్ చేశారు. బుధవారం శిక్ష అమలు తాత్కాలికంగా నిలిపేసిన అనంతరం మృతుడి సోదరుడు ఫేస్ బుక్‌లో ఇలా పోస్ట్ చేశాడు. ఈ వాయిదాను మేం ఊహించలేదు.

మా కుటుంబం రాజీ కుదిర్చేందుకు చేసిన ప్రతిపాదనలు అన్నింటినీ తిరస్కరించింది. ఈ ప్రయత్నాలు మాకు కొత్తేమీ కావు. ఎన్ని విధాలా ఒత్తిడిచేసినా మేం అభిప్రాయాన్ని మార్చుకోం. బ్లడ్ మనీకి అంగీకరించే ప్రసక్తేలేదు. నా సోదరు డిని హత్య చేసిన ఆమెకు ఉరిశిక్ష పడితీరా ల్సిందే. క్షమాపణ అనే మాటే లేదు. మాకు కావాల్సింది డబ్బు కాదు. న్యాయం అని స్పష్టం చేశారు. భారతీయ మీడియా దోషిగా నిరూపిత మైన నిమిషను బాధితురాలిగా చిత్రీకరిస్తోందని మండిపడ్డారు.

యెమెన్ ప్రభుత్వం నిమిష ప్రియ మరణశిక్షను తాత్కాలికంగా వాయిదా వేయడంపై మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. డబ్బుతో పోయిన ప్రాణానికి వెలకట్టలేరని మాకు న్యాయం కావా లని పట్టుబడుతోంది. యెమెన్ చట్టం ప్రకారం, మరణించిన వ్యక్తి కుటుంబం నిందితులను క్షమించి పరిహారానికి అంగీకరిస్తే శిక్షను రద్దు చేయవచ్చు. అందుకే ఈ విషయమై చాలా కాలం నుంచి భారత ప్రభుత్వం యెమెన్ స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్‌తో నిరంతర చర్చలు జరుపుతోంది. మరో పక్క మత గురువు కాంతాపురం ఎపి అబూబకర్ ముస్లియార్ మృతుడి కుటుంబంతో క్షమాధనానికి ఒప్పుకునేం దుకు తీవ్ర చర్చలు జరిపారు. నిమిష కుటుంబం బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కోట్ల) క్షమాధనం ఇచ్చేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే.

## ఐదేళ్లు దాటిన పసిపిల్లల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి





**న్యూఢిల్లీ,జూలై 16:** భారతీయులకు యూఐడిఎఐ కీలక సూచన చేసింది. పిల్లలకు ఏడేళ్ల వయ సొచ్చినా ఆధార్ బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేయని తల్లిదండ్రులు వీలైనంత త్వరగా ఈ అప్‌డేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఎలక్ట్రా నిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ తాజా ప్రకటన ప్రకారం, తల్లిదండ్రులు, సంరక్షకులు తమ పిల్లల బయోమెట్రిక్ వివరాలను ఎప్పట కప్పుడు అప్‌డేట్ చేయాలి. పిల్లల తాజా ఫొటోతో పాటు పేరు, వయసు, పుట్టిన తేదీ, అడ్రస్ వివరాలను తగిన ధ్రువీకరణ పత్రాలతో సమర్పించాలి. అయితే, ఐదు ఏళ్ల లోపు వయ సున్న పిల్లల చేతి వేలిముద్రలు, ఐరిస్ వివరా లను యూఐడిఎఐ సేకరించదు. చిన్నారుల్లో ఇవి పూర్తి స్థాయిలో రూపుదిద్దుకోకపోవడమే ఇందుకు కారణం. కేవలం పేరు, పుట్టిన తేదీ, అడ్రస్ తదితరాలతోనే ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు జారీ చేస్తారు.

ఇక ఐదేళ్ల దాటిన తరువాత తొలిసారిగా పిల్లల ఫింగర్ ప్రింట్స్, ఐరిస్ వివరాలను తీసుకుంటారు. దీన్ని ఫస్ట్ మ్యాండే టరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎమ్‌బీయూ) అని అంటారు. ఇక ఐదు నుంచి ఏడేళ్ల లోపు ఉన్న చిన్నారుల ఎమ్‌బియూ పూర్తిగా ఉచితం. ఏడేళ్ల దాటితే మాత్రం బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం రూ.100 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఆధార్ నిబంధనల ప్రకారం, పిల్లలకు ఏడేళ్ల వయసొచ్చినా ఎమ్‌బియూ పూర్తికాకపోతే వారి కార్డు డీయాక్టివేట్ అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ఎమ్‌బియూ పూర్తికానీ పిల్లల తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ యూఐడిఎఐ మెసేజీలు పంపించడం కూడా ప్రారంభించింది. స్కూల్ అడ్మిషన్ల మొదలు ఎంట్రన్స్ పరీక్షల రిజిస్ట్రేషన్ వరకూ పిల్లలు ఎన్నో సేవలు పొందేందుకు ప్రస్తుతం ఆధార్ అవసరం. ఈ ప్రక్రియల్లో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు ఆధార్ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తోంది.

## నిన్నటితరం ఆయుధాలతో ఆధునిక యుద్ధాలు చేయలేం..

### సిడిఎస్ అనిల్‌చౌహాన్

**న్యూఢిల్లీ:** భారతదేశం తన రక్షణ సామర్థ్యాలను తక్షణం ఆధునీకరించాల్సిన అవసరం ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. రేపటి టెక్నాలజీని ఉప యోగించి ఈరోజు యుద్ధం చేయాల్సి ఉంటుందని, నిన్నటి ఆయుధాలతో నేడు యుద్ధం చేసి గెలవలేమని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో బుధవారంనాడు జరిగిన యూఏవీ, కౌంటర్‌అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ (సి యూఏఎస్) స్వదేశీకరణ వర్క్‌షాప్‌లో అనిల్ చౌహాన్ మాట్లాడుతూ, ఇవాల్టి అధునాతన యుద్ధంలో అత్యాధునిక సాంకేతికతకు ప్రాధాన్యత పెరుగుతోందని చెప్పారు. నిన్నటి ఆయుధాలతో ఇవాళ యుద్ధంలో గెలవలే మన్నారు.

మన వ్యూహాత్మక మిషన్లకు కీలకమైన సాంకే తికత కోసం విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. దిగుమతి చేసుకున్న టెక్నాలజీపై ఆధారపడితే మన సంసిద్ధత దెబ్బతింటుదన్నారు. ఇందువల్ల స్వదేశీ సాంకేతికతను త్వరితగతిన అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంటుదని చెప్పారు. మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తా విస్తూ, సరిహద్దుల వెంబడి నిరాయుధ డ్రోన్లు, మందుగుండు సామగ్రిని పాకిస్థాన్ మోహరిం చిందని, దాదాపు అన్నింటినీ సమర్ధవంతంగా నిర్వీర్యం చేశామని అనిల్ చౌహాన్ చెప్పారు. యూఎఇల వల్ల భారత సైన్యానికి కానీ, పౌరుల మౌలికి సదుపాయలకు కానీ ఎలాంటి నష్టం జరగలేదని వివరించారు.

## జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరించండి



### ప్రధాని మోడీకి ఖర్గే, రాహుల్ లేఖలు

**న్యూఢిల్లీ,జూలై 16:** జమ్మూకాశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ప్రధాని మంత్రి నరేంద్ర మోడీకి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. ఖర్గే రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా కూడా ఉన్నారు. రానున్న పార్ల మెంటు వర్షాకాల సమావేశాల్లో జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను మంజూరు చేస్తూ చట్టాన్ని కేంద్రాన్ని మేము కోరుతున్నాం. లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నాం అని ఆ లేఖలో రాహుల్, ఖర్గే పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలని గత ఐదేళ్లుగా అక్కడి ప్రజలు కోరుతున్నారని ఆ లేఖలో కాంగ్రెస్ అగ్రనేతలు ఇరువురు కోరారు. దీనితో పాటు లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఈ రెండు డిమాండ్లు చట్టబద్ధమైనవని, అవి రాజ్యాంగపరంగా, ప్రజా సామ్యపరంగా ప్రజలకున్న హక్కులని సూచిం చారు. కేంద్ర పాలిత ప్రాంతాలకు రాష్ట్ర పతిపత్తి కల్పించిన ఉదాహరణలు గతంలో ఉన్నాయని, అయితే జమ్మూకశ్మీర్ విషయంలో ఇందుకు భిన్నంగా జరిగిందని, పూర్తి స్థాయి రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతానికి తగ్గించి విభజించడం మొదటిసారిగా జరిగిందని ఆ లేఖలో ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్ర హోదాను పునరు ద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యక్తిగతంగా మీరు పలుమార్పు చెప్పారు. 2024 మే 19న భువనేశ్వర్ ఇంటర్వ్యూలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తా మని ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టు కుంటామని మీరు చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా నుపునరుద్ధరిస్తామని పార్లమెంటులో చెప్పినట్టు కూడా శ్రీనగర్‌లో 2024 సెప్టెంబర్ 19న జరిగిన ర్యాలీలో మీరు పునరుద్ఘాటించారు అని కాంగ్రెస్ అగ్రనేతలిరువురు ప్రధానికి గుర్తుచే శారు. 370వ అధికరణ సమయంలోనూ సాధ్య మైనంత త్వరగా జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో రాబోయే పార్లమెంటు వర్షాకాల సమావేశంలో కేంద్రపాలిత జమ్మూకాశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్రహోదా కల్పించేచట్టాన్ని తీసుకు రావాలని ప్రధానికి వారు విజ్ఞప్తి చేశారు.

## బస్సులోనే ప్రసవం.. బిడ్డను బయటికి విసిరేసిన తల్లి

**ముంబయి,జూలై 16:** మహారాష్ట్రలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. బస్సు ప్రయా ణంలో ఓ బిడ్డకు జన్మనిచ్చిన యువతి.. ఆ పసికందును కిటికీలో నుంచి బయటకు విసిరేసింది. దీంతో గాయాలపాలైన ఆ పసికందు అక్కడికక్కడే చనిపోయింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేశారు. పందొమ్మిదేళ్ల యువతిని, ఆమెతో పాటు ఉన్న యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పర్భణికి చెందిన రితిక ధీరే, అల్తాఫ్ షేక్‌లు కొంతకాలంగా పూణేలో జీవిస్తున్నారు. ఈ క్రమంలో రితిక గర్భం దాల్చింది. తాజాగా సోమవారం రాత్రి నిండు గర్భిణి రితికతో అల్తాఫ్ పర్భణి బయలుదేరాడు. స్లీపర్‌కోచ్‌లో రాత్రంతా ప్రయాణించారు. తెల్లవారుజామున రితికకు పురుటి నొప్పులు ప్రారంభమయ్యాయి. పత్రి సేలురోడ్డులో ప్రయాణిస్తుండగా బస్సులోనే బిడ్డకు జన్మని చ్చింది. పుట్టిన బిడ్డను అల్తాఫ్ ఓ గుడ్డలో చుట్టి కిటికీలో నుంచి బయటకు విసిరేశాడు. బస్సులో నుంచి ఏదో వస్తువు పడడం చూసిన స్థానికుడు దగ్గరికి వెళ్లి పరిశీలించాడు. అందులో పసిబిడ్డను చూసి వెంటనే పోలీసులకు ఫోన్ చేశాడు. విషయం తెలిసిన వెంటనే స్పందించిన పోలీసులు ఆ బస్సును ఆపి రితిక, అల్తాఫ్ లను అదుపులోకి తీసుకున్నారు. తాము భార్యాభర్తలమని, బిడ్డను పెంచే స్తోమత లేకపోవడం వల్లే ఈ పని చేశామని అల్తాఫ్ చెప్పుకొచ్చాడు. అయితే, వారిద్దరూ భార్యాభర్తలు అనేందుకు ఎలాంటి ఆధారం చూపలేకపోయాడని పోలీసులు తెలిపారు.

# సంక్షిప్తంగా

## సిరియా సైనిక కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడి



**డమాస్కస్,జూలై 16:** సిరియా రాజధాని డమాస్కస్‌లోని సైనిక ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు నిర్వహించింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటిం చింది. తమ రక్షణ శాఖ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడి చేసిందని సిరియన్ సైనిక వర్గాలుకూడా ధృవీకరించాయి. సిరియాలోని స్వైయిదా ప్రాంతంలో స్థానిక మిలీషియాల మధ్య జరిగిన సాయుధ ఘర్షణలో 100 మంది ప్రాణాలు కోల్పోయారు. మైనార్టీ షియా తెగకు చెందిన డ్రూజ్ మిలీషియాకు, సున్ని బెడ్విన్ తెగలకు మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. డ్రూజ్ జాతికి చెందిన ఒక కూరగాయల వ్యాపారిని కొందరు సాయుధులు దోచుకోవడంతో సమస్య ప్రారంభమైందని అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10లక్షల మంది డ్రూజ్ జాతీయులు ఉన్నారు. అందులో సగంమంది సిరియాలో ఉన్నారు. మిగిలినవారు ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల్లో నివసిస్తున్నారు.

## ఎస్‌సిఒ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని చైనా పర్యటన

**న్యూఢిల్లీ,జూలై 16:** ప్రధాన మంత్రి నరేంద్రమోడీ త్వరలో చైనాలో పర్యటించనున్నట్టు తెలుస్తోంది. వచ్చే నెలలో జరుగనున్న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సదస్సుకు మోడీ హాజరవుతారని విశ్వసనీయ వర్గాల కథనం. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో సైనికుల మధ్య ఘర్షణతో చైనాభారత్ మధ్య దౌత్య సంబంధాలు స్తంభించిన అనంతరం చైనాలో మోడీ పర్యటించనుండటం ఇదే ప్రథమం. అయితే మోడీపర్యటనను అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. తియాంజిన్ వేదికగా షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు ఆగస్టు 31సెప్టెంబర్ 1 తేదీల్లో జరుగనుంది. రష్యా అధ్యక్షుడు వ్లాడిమిర్ పుతిన్, ఎస్‌సిఎ సభ్య దేశాల నేతలు కూడా ఈ సదస్సుకు హాజరుకానున్నారు. కాగా, చైనా పర్యటనలో భాగంగా దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోడీ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది.

## గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 93 మంది మృతి

**గాజా, జూలై 16:** గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కుటుంబాలకు కుటుంబాలే హతమయ్యాయి. పాలస్తీనా లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడితో పాటు మరో కుటుంబంలోని 19 మంది మరణించారు. ఈ దాడుల్లో మొత్తం 93 మంది మృతి చెందారు. 278 మందికి గాయాలయ్యాయి. వీరిలో పిల్లలు, మహిళలే అధికంగా ఉన్నారు. ఉత్తర షాటీ శరణార్థ శిబిరంపై జరిగిన దాడిలో 68 ఏళ్ల హమాస్ సభ్యుడు, పాలస్తీనా లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు అయిన మహ్మద్ ఫరాజ్ అల్ గౌల్ మృతి చెందారు. ఆయనతోపాటు అక్కడే ఉన్న భార్యాభర్తలతో పాటు వారి ఆరుగురు పిల్లలు మరణించారు. గాజా సిటీ టెల్అల్ హవాలోని ఒక ఇంటిపై జరిగిన భీకర దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 19 మంది మృతి చెందారు. ఇందులో 8 మంది మహిళలు, ఆరుగురు చిన్నారులున్నారు. ఇదే ప్రాంతంలోని మరో టెంట్ ఆవాసంపై జరిగిన దాడిలో భార్యాభర్తలు, వారి ఇద్దరు పిల్లలు మరణించారు.

## పార్లమెంటు కేంటీన్‌లో ఎంపిలకు పసందైన రుచులు

**న్యూఢిల్లీ,జూలై 16:** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎంపీలకు కొత్త ఆహార మెనూ అందుబాటులోకి రానుంది. ఎంపీలకు రాగి మిల్లెట్ ఇడ్లీ, జవార్ ఉప్మా, పెసర పప్పు దోశ, చేపల వేపుడు, ఇతరత్రా ప్రత్యేక వంటకాలను అందించనున్నారు. తక్కువ కార్బోహైడ్రేట్లు, సోడియం, కేలరీలు, ఎక్కువ ఫైబర్, ప్రొటీన్లతో రుచికరంగా, పోషకాలతో కూడిన ఫుడ్‌ను ఎంపీలకు వడ్డించేందుకు పార్లమెంటు క్యాంటీన్ రెడీ అవుతోంది. ఆగస్టు 12 వరకు దాదాపు 21 రోజుల పాటు ఉభయసభలు సమావేశం కానున్నాయి. ఆగస్టు 12 నుంచి 18 వరకు రక్షాబంధన్, స్వాతంత్ర్య దినోత్సవ విరామం ఉంటుంది. ఎంపీల మెనూలో మార్పులుచేసారు. ఈ సారి సెషన్ వేళ ఎంపీలకు రుచికరమైన, పోషకాహారమైన వంటకాలను అందించాలని పార్లమెంటు క్యాంటీన్‌కు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సూచనలు చేశారు. ఎంపీల సౌకర్యార్థం పలు రకాల వంటకాల తయారీని పునరుద్ధరించాలని ఆయన నిర్దేశించారు. అందుకే ఉభయ సభల ఎంపీల కోసం పార్లమెంటు క్యాంటీన్ కొత్త మెనూను తయారు చేసింది. నోరూరించే కూరలు, వీలైనన్ని ఎక్కువ వెరైటీలతో కూడిన థాలీలు, మిల్లెట్‌లతో కూడిన వంటకాలు, ఫైబర్ పుష్కలంగా ఉండే సలాడ్‌లు, ప్రొటీన్లతో కూడిన సూప్‌లను ఎంపీలకు అందించనున్నారు.



బుధవారం సిద్దిపేటలో జరిగిన మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

# దేశంలో 60%సంపద 10% మంది వద్దే

## కమ్యూనిస్టు పార్టీని అంతం చేయడం అమిత్‌షా వల్లకాదు

## కమ్యూనిజం లేకుంటే మనిషికి మనుగడ లేదు..

### సిపిఐ పార్టీ జిల్లా మహాసభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, జూలై 16, ప్రభాతవార్త:** దేశంలో పెట్టుబడిదారులకు మద్దతుగా పాలక ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు అన్నారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిద్దిపేట జిల్లా నాలుగవ మహా సభలు పట్టణంలోని కెజెఆర్ గార్డెన్‌లో నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి మల్లెచెట్టు చౌరస్తా మీదుగా కెజెఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశంలో 60శాతం సంపద కేవలం పదిశాతం మంది వద్దనే ఉందని వేలకోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించే వాళ్ల బిజెపి దృష్టిలో దేశభక్తులు, సామాన్యుల హక్కుల సాధన కోసం తుపాకులు పట్టుకుని అడవుల్లోకి వెళ్ళిన వాళ్ల దేశద్రోహుల్లా కనబడుతున్నారా అని ప్రశ్నించారు. ఇక రాష్ట్రంలో పొత్తుల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల నుండి ఇక పొత్తుల విషయంలో ఒక్కసీటుతో పొత్తులు ఉండవని స్పష్టం చేశారు. ఇది కావాలంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిపి, జడ్పిటిసిలుగా తమ పార్టీకి చెందిన కార్యకర్తలే గెలిచి తమ బలమేంటో పాలకులకు చూపించాలన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తుందని సామాన్యుల హక్కుల సాధన కోసం తుపాకులు పట్టుకుని అడవుల్లోకి ఉన్న మావోయిస్టులను ఆపరేషన్ ఖగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం హత్యలు చేస్తున్నారని మండిపడ్డారు. 2026 వరకు మావోస్టులను అంతం చేస్తామని చెబుతున్న అమిత్‌షా, బిజెపి ప్రభుత్వాలు మావోయిస్టులను , కమ్యూనిస్టులను అంతం చేయాలంటే వాళ్ల బాబులు దిగి వచ్చినా సాధ్యం కాదన్నారు. కమ్యూనిజం లేకుంటే మనిషి మనుగడ లేదని స్పష్టం చేశారు. దేశంలో పాలక ప్రభుత్వాలు పెట్టుబడి, పెత్తందారులకు అనుగుణంగా చట్టాలు తయారు చేస్తూ వారిని పెంచి పోశిస్తున్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడే వాళ్లు తిండి లేకుండా అడవుల్లో చస్తుంటే దేశ సంపదను రాజకీయ నాయకుల ముసుగులో దోచుకొని జనవాసాల్లో దర్జాగా తిరుగుతున్నారన్నారు. కేంద్రంలో పాలన సాగిస్తున్న నాయకులు పాలకులా లేక రాక్షసులా అర్థం కావడం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. మావోయిస్టులు దేశ ద్రోహులా, వారివల్ల దేశానికి ఏమైనా నష్టం జరిగిందా అని ప్రశ్నించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ప్రశ్నించే గొంతుకలు తప్పకుండా ఉంటాయని, ప్రశ్నించే వాళ్లకు సమాదానం చెప్పాల్సిన బాధ్యత పాలకులదే అన్నారు.



మేడిపల్లిలోని ఫ్లైఓవర్ పనులు పర్యవేక్షిస్తున్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య బండారి లక్ష్మారెడ్డి , కొత్త కిషోర్ గౌడ్ ,పిల్లి నాగరాజు తదితరులు

# ఉప్పల్ ఫ్లైఓవర్ పై ప్రత్యేక శ్రద్ధ

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**మేడిపల్లి, జూలై 16 ప్రభాతవార్త:** ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పేనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆలేరు ఎమ్మెల్యే బీర్లఐలయ్య , ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాదగిరిగుట్ట భువనగిరి వరంగల్ హైవేపై దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఫ్లైఓవర్ పనులు ఆర్థిక వనరులు, ఇతర కారణాలవల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఫ్లైఓవర్ పై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చలు జరిపి పనుల్లో వేగం పెంచామన్నారు. వచ్చే దసరా నాటికి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బి ఎస్ సి ధర్మారెడ్డి , ఈ ఈ రామకృష్ణారెడ్డి , మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మేకల మధుసూదన్ రెడ్డి, పిల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌అండ్‌బి మంత్రికి టిడిఎఫ్ ఆహ్వానం

**హైదరాబాద్, జూలై 16,ప్రభాతవార్త:** అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఆగస్టు 8,9,10 తేదీల్లో నిర్వహించే తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం సిల్వర్ జూబ్లీ వేడుకలకు రావాలని తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని టిడిఎఫ్ ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం మంత్రిని టిడిఎఫ్ ప్రతినిధులు కలిసి ఆహ్వానపత్రం అందించడంతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న టిడిఎఫ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. తెలంగాణ డెవలప్మెంట్ ఫోరంతో తనకు ఉన్నతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో అనేక సభలకు హాజరుకావాలని ఆహ్వానించడానికి ఆ ప్రతినిధులు వచ్చిన సందర్భంగా వారిచ్చిన ఆహ్వానాన్ని, ఆతిద్యం గుర్తుచేసుకున్నారు. సామాజిక బాధ్యతతో ఈ సంస్థ ప్రతినిధులు పనిచేస్తున్నారని కోమటిరెడ్డి అన్నారు. ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్ రెడ్డి, పిడిఎఫ్ ఇండియా చైర్మన్ యంవి గోన రెడ్డి , ఇం డియా జనరల్ సెక్రెటరీ వినీల్ రెడ్డిలు తదితరులు ఉన్నారు.

# దోపిడిదారుల ఆస్తులు జప్తు చేసి పేదలకు పంచాలి

### ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:** సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతికిపాల్పడి ప్రజాధనం కొల్లగొట్టిన దోపిడీదారుల ఆస్తులు జప్తుచేసి పేద ప్రజలకు పంచాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో బుధవారం "అందుబాటులో ప్రజాప్రతి నిధులు కార్యక్రమంలో" మదన్‌మోహన్‌రావు ప్రజాసమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంకు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మధన్ మోహన్ రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టునిర్మాణంలో భాగస్వామ్యం అయిన వారిఎవరు ఆస్తులు లెక్క కట్టినా అంచనాకు మించిఉన్నాయని ఎసిబి సోదాలలో వెల్లడవుతున్నాయన్నారు. ఇఎన్‌సి మురళీధర్ రావు దగ్గరే ఐదువందలకోట్ల రూపాయల పైన ఉన్నాయి అంటే కెసిఆర్ ,కేటీఆర్, హరీష్ దగ్గర ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. శ్రీధర్ ,హరిరామ్ నాయక్‌ల దగ్గర ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయి. కాళేశ్వరం నిర్మాణంలో భాగస్వామ్యం అయిన ప్రతీ ఒక్కరిపై విచారణ జరపాలి. కెసిఆర్ అసమర్థతతో ప్రాజెక్టులు పూర్తి కాలేదని ఆరోపించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదేళ్లు ఇరిగేషన్‌శాఖను కేసీఆర్ ,హరీష్ రావే చూసారని ఆయన గుర్తుచేశారు.

# దళితబంధుపై కెటిఆర్ మొసలి కన్నీరు

### చొప్పదండి ఎమ్మెల్యే ఎం.సత్యం

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:** పదేళ్ళు అధికారంలో ఉండి ఎందుకు దానిని పూర్తిగా అమలు చేయలేదని దళితబంధు పై కెటిఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నాడని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్, కెటిఆర్ కి దళితులు గుర్తుకురాలేదన్నారు. దళిత బంధుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయాలని దళితులను రెచ్చగొడుతున్నాడని ఆరోపించారు. హుజురాబాద్ ఉపఎన్నిక కోసం మీ పీఠం కదులుతుందని దళితబంధు స్కీం తీసుకువచ్చారని కేవలం మూడు నాలుగు మండలాల్లో దళిత బంధు స్కీం మొదలు పెట్టారన్నారు. ఆ కొద్ది మండలాలలో దళితబంధు కింద మీరు వాళ్లకు ఇచ్చిన చెక్‌లు కూడా చెల్లకుండా ద్రోహం చేశారని దుయ్యబట్టారు. రాజకీయ లబ్ధికోసం స్కీంలు పెట్టడం తప్ప మీకు దళితులపైన ఏమాత్రం ప్రేమ లేదన్నారు. కాళేశ్వరం గొప్ప ప్రాజెక్టు, ప్రపంచంలో ఎవరూ కట్టలేదని చెప్పుకున్నారు నెల రోజుల్లో ముగ్గురు ఇంజనీర్లు కళ్ల బైర్లు కమ్మే ఆస్తులతో ఎసిబికి దొరికారని ఎద్దేవా చేశారు.

# నీళ్లొచ్చాయో, లేదో రైతుల్నే అడుగుదాం

## దమ్ముంటే రా.. చిన్న సీతారాం తండాకు వెళ్దాం

### కాళేశ్వరంపై సిఎం రేవంత్‌కు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సవాల్

### పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించిన మాజీ మంత్రి



**సూర్యాపేట, జూలై 16 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని మాజీ సీఎం కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అసలు వాస్తవాలపై, రైతులకు అర్థమయ్యే విధంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులకు నీళ్ళొచ్చాయో లేదో రైతుల వద్దకే వెళ్లి తెలుసుకుందం అని దమ్ముంటే రా..చిన్న సీతారాం తండాకు వెళ్దాం..అక్కడి రైతు చేతికే చెప్పు ఇద్దాం,వాళ్ల భూములకు నీళ్ల అందలేదంటే నన్ను కొడతారు. నీళ్ల అందినాయంటే నిన్ను కొడతారని ఎద్దువా చేశారు. ఇంటి దొంగలను దొరకబట్టి. ఇక్కడనే పాతి పెట్టాలె, కండ్ల ముందు నీళ్ల పోతుంటే,రైతులు కన్నీళ్ల పెట్టుకుంటున్నారు, కాళేశ్వరంపై కాంగ్రెస్ వర్గం మీడియా దుష్ప్రచారం చేసిందని ఆరోపించారు. కూలిందన్న ప్రాజెక్టుపై నేనే స్వయంగా కారులో తిరిగి వచ్చిన సాక్షాలన్నీ ప్రజల కళ్ళముందుంచిన.,ఇసుక దందాకోసమే కాళేశ్వరం నీళ్ల ఇస్తలేరు,ఆ దారిలో 9 కిలోమీటర్లకు పైగా ఇసుక లారీలు ఆగి ఉన్నాయి,ప్రపంచంలోనే అద్భుతమైన ప్రాజెక్టు నిర్మించిన ఘనత కేసీఆర్ ది మాత్రమే.సూర్యాపేట జిల్లాకు లక్షలాది ఎకరాల్లో కాళేశ్వరం నీళ్లందించినం.కాళేశ్వరం కూలేశ్వరం అయిందని కాంగ్రెస్ బిజెపిలో విష ప్రచారం చేశాయి, కన్నెపల్లి నుంచి 380 కిలోమీటర్ల మేర ప్రవహించి సూర్యాపేటకు నీళ్ల వస్తున్నాయి, ఇసుక దందా కోసమే కాళేశ్వరం నీళ్ల ఎత్తిపోయడం లేదు.దీంతో రేవంత్ కు స్వామి కార్యం, స్వకార్యం రెండూ నెరవేరుతున్నాయి.పోయిన యాసంగిలో పొలాలు ఎందుకు ఎండినయో సమాధానం చెప్పాలి. నీళ్ల పారె కాలువల్లో నేడు తుమ్మలు, సర్కారు చెట్లు మోలుస్తున్నాయ్, చంద్రబాబు లాంటి నీటిదొంగలతో చర్చలెందుకు, చంద్రబాబు పంపిన వాళ్ళను సలహాదారులుగా పెట్టి మరింత దిగజారినవ్, మేడిగడ్డలో ఒకటి, రెండు పిల్లర్లు మాత్రమే కుంగిపోయినయ్, మోటార్లు పాడైతే రిపేర్ చేయించుకోమా, కుంగిన పిల్లర్‌ను రిపేర్ చేయకుండా.. కుంటిసాకుతో రైతులను కన్నీళ్ల పెట్టిస్తున్నారు,చరిత్రలో ఎప్పుడు లేనివిధంగా గోదావరిలో 38 లక్షల క్యూసెక్కుల వరద నీరు,కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు,15 రిజర్వాయర్లు 19 సబ్ స్టేషన్లు, 21 పంపు హౌజ్ లు అన్ని.203 కిలోమీటర్ల మీద సొరంగాలు.. 1531 కిలోమీటర్ల మేర గ్రావిటీ కెనాల్స్,98 కిలోమీటర్ల మేర ప్రెజర్ మెయిన్స్,141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ,530 మీటర్ల ఎత్తుకు లిఫ్టు, 240 టీఎంసీల నీటి వినియోగం ఉన్నది.ఇది కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపం,ఇప్పుడు నీళ్ల ఇస్తే కాళేశ్వరం పైన చేసిన ఆరోపణలు తప్పని తేలుతుందని భయం,కెసిఆర్‌కు మంచి పేరు వస్తుందని మరో భయం పట్టుకుంది. ఇప్పుడు నువ్వు ఏదో కుంటి సాకులు చెబితే రైతులు నమ్మరు,ఇకనైనా చంద్రబాబుకు గులాంగిరి మాని.. తెలంగాణ రైతాంగంపై దృష్టి పెడితే మంచిది. నీళ్ల ఇస్తే రైతులు పంట సాగు చేసుకుని బాగుపడతారని రైతులతో రాజకీయం చేస్తే మంచిది కాదని అన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి చెప్పిన విషయాన్ని పూర్తిగా తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఎంపీలు బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాంటేషన్ పోడులో ఘర్షణ

### ఫారెస్టు వర్సెస్ పోడుదారులు

### బలవంతంగా గుడిసె తొలగింపునకు అధికారుల యత్నం

### అడ్డుకున్న పోడుదారులు



**కారేపల్లి, జూలై 16 ప్రభాతవార్త:** సింగరేణి మండలం మాణిక్యారం ఎర్రబోడు ఊటవాగు సమీపంలోని ప్లాంటేషన్ పోడు లో పోడుదారులు, ఫారెస్టు అధికారుల మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. పోడులో పోడుదారులు వేసుకున్న గుడిసెలను తొలగించే క్రమం ఇరువర్గాల మధ్య తోపులాట, నెట్టుకోవటం చోటుచేసుకుంది. మహిళలను చూడకుండా ఫారెస్టు అధికారులు మహిళ పోడుదారులపై దాడికి దిగారు. అదే స్థాయిలో పోడుదారులు ప్రతిఘటించారు. ఐదేండ్లుగా ప్లాంటేషన్ పోడు సమస్య ఫారెస్టు అధికారుల నాన్చుదోరణితో జఠిలం అయింది. ప్రత్యామ్నాయ పోడు చూపుతామని 2020లో ప్లాంటేషన్ కోసం 50 హెక్టార్ల పోడును 60 మంది పోడుదారుల నుండి సేకరించారు. పోడు నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపకుండా దాటవేత ధోరణి అవలంభిస్తుండటంతో మూడేండ్లుగా ప్లాంటేషన్ పోడులో ఉద్రిక్తత పరిస్థితిలు నెలకొంటున్నాయి. ఈ ఏడాది సైతం పోడుదారులు పోడులో విత్తనాలు వేసి అక్కడే గుడెసెలు వేసుకోని ఉంటున్నారు. దీనిపై ఎఫ్‌డీవో సైతం ఆప్రాంతాన్ని సందర్శించి ఐదు రోజులలో దానిపై నిర్ణయం తీసుకుంటాని తెల్పారు. అయినా ఎటువంటి చర్యలు లేక పోవటంతో పోడుదారులు ప్లాంటేషన్ పోడు సాగుకు ఉపక్రమించారు. చర్చలకు పిలిచి గుడిసె పీకేయత్నం పోడుదారులను, ప్రజాసంఘాల నాయకులను ఎఫ్‌డీవో వస్తున్నారు. చర్చలకు రావాలని రేంజ్ కార్యాలయం నుండి పిలిచారు. చర్చలకు ప్రజాసంఘాల నాయక్కులైన కే.నరేంద్ర, వజ్జా రామారావు, అజ్మీర శోభన్‌నాయక్ లు పోడు వద్దకు వచ్చారు. పోడుదారులతో చర్చలు చేయకుండానే ఎఫ్ఆర్వో , ఎఫ్ఎస్వో లు చక్రవర్తి, వీరభద్రం ఆధ్వర్యంలో ఫారెస్టు అధికారులు ప్లాంటేషన్‌కు చేరుకోని అక్కడి ఉన్న గుడిసెను తీసివేయాలని డిమాండ్ చేయటంతో పాటు దానిని పీకటంతోపాటు అరక వస్తువులను ధ్వంసంకు ప్రయత్నించటంతో మహిళా పోడుదారులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య మాటామాట పెరిగింది. కరపటి అరుణ, మల్లమ్మ అనే మహిళలను ఫారెస్టు అధికారులు నెట్టివేయటంతో ఘర్షణ జరిగింది. మహిళలని చూడకుండా మగ ఫారెస్టు అధికారులు దౌర్జన్యం చేశారు. అదే స్థాయిలో పోడుదారులు ఎదురించి నిలిచారు. ప్రజాసంఘాల నాయకులు కే.నరేంద్ర, వజ్జా రామారావు, అజ్మీర శోభన్ లు ఘర్షణను నివారించే ప్రయత్నం చేసినా ఫారెస్టు అధికారులు మొండిగా వ్యవహరించి మహిళలపై దౌర్జంకు దిగారు. పోడులో ఘర్షణ విషయం తెలుసుకున్న కారేపల్లి ఎస్సై బీ.గోపి సంఘట స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలను సముదాయించారు. విషయాన్ని ఫారెస్టు డివిజన్ అధికారి దృష్టికి తీసుకెళ్ళారు. సమస్య పరిష్కారంకు రెండు రోజుల గడువు కోరారు. అప్పటి వరకు ఇరు వర్గాలు ఆ ప్రాంతంలో ఎలాంటి పనులు చేపట్టవద్దని ఎస్సై గోపి సూచించారు. దీంతో ఇరువర్గాలు అక్కడి నుండి వెళ్ళిపోయారు. దీనిపై ఇరువర్గాలు కారేపల్లి పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు.

# రాష్ట్ర ఏర్పాటులో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు




బుధవారం రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో న్యాయవాదులు ఎంతో కీలక పాత్ర పోషించారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ కార్యక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాజ్యసభ, లోక్‌సభలలో సుమారు 250 మంది న్యాయవాదులు పార్లమెంటు సభ్యులుగా ఉన్నారన్నారు. న్యాయం కోసం ఎలా పనిచేస్తామో, ప్రజల సేవలో కూడా అలాంటి అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి రావాలని, గెలిచినా, ఓడిపోయినా, నేను నమ్మిన సిద్ధాంతాల కోసం మాత్రమే పని చేస్తున్నానన్నారు. డబ్బు కోసం ఎప్పుడూ రాజకీయాలు చేయలేదని, తెలంగాణలోని రాజకీయ సంస్కృతిని మనం మార్చాలన్నారు. న్యాయవాదులు కదలితే దేశమే కదులుతుందన్నారు. నేను కూడా అడ్వకేట్ కమ్యూనిటీకి చెందినవాడినే కాబట్టి, ఇలాంటి వేదికపై మాట్లాడే అవకాశం నాకు లభించిందని అన్నారు. మనం వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందినప్పటికీ, కోర్టులో వాదనలు నడిపిన తర్వాత బయట మాత్రం కలిసిమెలిసి ఉంటామని, అరుణ్ జైట్లీ, కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ వంటి ప్రముఖ న్యాయవాదులు వేర్వేరు పార్టీలకు చెందినవారైనా, కోర్టులో కలిసి పని చేశారు. యువ న్యాయవాదులు ఈ ప్రొఫెషన్‌ను సిన్సియర్‌గా తీసుకొని పని చేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులను మనం రోజూ చూస్తున్నాం. అసెంబ్లీ సమావేశాలు చూడాలంటే చాలా మంది భయపడుతున్నారు. కొత్త కొత్త బూతులు నేర్చుకోవాల్సి వస్తుందని ప్రజలు చెప్తున్నారని అన్నారు.

# బిసి రిజర్వేషన్లపై బిజెపి-బిఆర్‌ఎస్‌లది తప్పుడు ప్రచారం

### ఆగస్టు 7న గోవాలో 'ఓబిసిల జాతీయ మహాసభ': జాజుల శ్రీనివాస్‌గౌడ్



మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల, గణేష్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్,శ్యాంకురుమ, విక్రంగౌడ్ తదితరులు

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్ల పెంపు పై బిజెపి టిఆర్‌ఎస్ నేతలు అదేపనిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిన, ఆర్డినెన్స్ తెచ్చిన కోర్టులలో నిలువదని అని గ్లోబల్ ప్రచారానికి తెగబడుతున్నారని ఇలాంటి ప్రచారాలు మానుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ బిజెపి టిఆర్‌ఎస్ నేతలకు విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 7న గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఈరోజు బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మహాసభ పోస్టులను కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి లతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రి బండి సంజయ్‌లు నిన్న బీసీ రిజర్వేషన్లపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, 42 బీసీ రిజర్వేషన్లలోనే 10 శాతం ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని ఆరోపించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపి మూడు నెలలు పూర్తి అయినప్పటికీ నేటి వరకు ఆ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలప కుండా బీసీలకు అన్యాయం చేస్తూ పైగా మత ప్రతిపదికన రిజర్వేషన్లు ఉంటే మేము ఆమోదం తెలుపము అని చెప్పి తప్పించుకోవడం వారి దివాలకోరుతనానికి నిదర్శనమన్నారు. నిజంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలంటే కేంద్ర ప్రభుత్వం పై టిఆర్‌ఎస్ ఢిల్లీలో ధర్నా చేపట్టాలని చేశారు .అలాగే బిసి రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్‌కి పం పించిన ఆర్డినెన్స్‌పై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సంక్షేమ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు పెంపు

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీలు, వికలాంగుల విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు గాను దరఖాస్తు చేసుకునే గడువును పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఈపాస్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 1 న ప్రారంభమైంది.

ఫ్రెష్, రెన్యూవల్ స్కాల కోసం అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30 లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

### మాజీ సర్పంచ్‌ల జెఎసి అధ్యక్షుడు యాదయ్య గౌడ్

**హైదరాబాద్,జులై 16,ప్రభాతవార్త :** పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వియాదయ్యగౌడ్ సిఎం, పంచాయితీరాజ్ శాఖ మంత్రికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ ఈ నెల 18న( శుక్రవారం) ఉదయం 11 గంటలకు ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల చాలా మంది సర్పంచ్‌లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై నమ్మకం పెట్టుకుని, తమ స్వంత ఖర్చులతో అప్పులు చేసి, వడ్డీకి డబ్బులు తెచ్చి ప్రభుత్వ ఆదేశాలకు చేసిన సర్పంచ్‌లు ఇప్పుడు ఆ బిల్లులు రావడం ఆలస్యం కావడంతో భయంకరమైన ఒత్తిడిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు చేసిన డబ్బులకు వడ్డీలు పెరిగిపోతున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం ఎంతోమందిని ఆత్మహత్యలు చేసుకునే స్థితికి నెట్టేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి పనిచేసిన వారికి ఇది లభించాల్సిన న్యాయమైన జీతం అనుచితంగా పెండింగ్‌లో వేయడం చట్ట విరుద్ధమన్నారు. పెండింగ్ బిల్లులపై వెంటనే ప్రభుత్వం స్పందించక పోతే బాధితుల జాబితా పెరుగుతూనే ఉంటుందన్నారు. పెండింగ్ బిల్లుల అంశంపై ప్రభుత్వం స్పందిచక పోతేబాధిత మాజీ సర్పంచ్‌లు ఉద్యమానికి దిగక తప్పదని ఆయన హెచ్చరించారు.

# బిసి రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం: మంత్రి సీతక్క

**హైదరాబాద్,జులై16,ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లకు బిజెపి ఎప్పుడూ వ్యతిరేకమని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ చేపటిన కులగణనను విమర్శించిన బిజెపి ఇప్పుడు దేశమంతటా కులగణన చేపటేందుకు సిద్ధమైందన్నారు. కర్ణాటకలో బిజెపి చేసినట్లుగానే తాము రిజర్వేషన్లు చేస్తే దానికి బిజెపి మతం రంగు పలుముతోందన్నారు. బిజెపి నేతలకు అణువణువుకుల దురహంకారం ఉండటంతోనే ఆ పార్టీ బీసీ కులగణనను మొదటి నుంచి వ్యతిరేకిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను సాధ్యమే కాదని బిజెపి మొదట్లో వాదించిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం కులగణనను విజయవంతంగా నిర్వహించి బిసిలకు 42 శాతం రిజర్వేషను అమలు దిశగా వెళ్తుంటే ఇప్పుడు కొర్రిలు పెట్టే ప్రయత్నం చేస్తోందని ఆమె ఆరోపించారు.

# బోనాలకు రండి.. ఆర్‌అండ్‌బి మంత్రికి ఆహ్వానం

**హైదరాబాద్,జూలై 16,ప్రభాతవార్త:** శ్రీభాగ్యలక్ష్మి అమ్మవారి బోనాలకు హాజరుకావాలని ఆర్‌అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆలయ ట్రస్టుబోర్డు కోరుతూ ఆహ్వానపత్రిక అందజేసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశిస్సులతో రాష్ట్రం త్వరగా అభివృద్ధిచెందాలని ఆలయంకు తప్పక వస్తానని హామి ఇచ్చారు. బోనాల పండుగ ఉత్సవాలు పురస్కరించుకొని ఈనెల 20న ఆదివారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రిని ఆలయ ట్రస్టీలు శశికళ సూర్యప్రకాష్ బుధవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా కప్పి, ఆహ్వానపత్రిక అందజేశారు.

# మరో రూ.2,500 కోట్ల రుణం తీసుకున్న సర్కార్

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మరో 2,500 కోట్ల రూపాయల మేర రుణాన్ని తీసుకున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈవేలం ద్వారా ఆ రుణాన్ని సేకరించింది. ఇందుకు గాను ప్రభుత్వ బాండ్లను రిజర్వ్ బ్యాంక్‌కు సమర్పించింది. ఈ విధంగా సేకరించిన రుణంలో 32 ఏళ్ల కాల పరిమితి, 7.10 శాతం వార్షిక వడ్డీతో 1000 కోట్ల రూపాయలు, 35 ఏళ్ల కాల పరిమితి, 7.09 శాతం వార్షిక వడ్డీతో 1000 కోట్ల రూపాయలు, 38 ఏళ్ల కాల పరిమితి, 7.09 శాతం వార్షిక వడ్డీతో 500 కోట్ల రూపాయల చొప్పున ఈ రుణాన్ని తీసుకున్నది. ఈ విధంగా తెలంగాణతో కలిపి దేశంలోని 12 రాష్ట్రాలు మొత్తంగా 26,900 కోట్ల రూపాయల మేర అప్పులు తీసుకున్నాయి. కాగా ఈ 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకూ తొలి క్వార్టర్‌కు గాను 14 వేల కోట్ల రూపాయలు, జూలై నుండి సెప్టెంబరు వరకూ రెండో త్రైమాసికంలో 12 వేల కోట్ల రూపాయల చొప్పున రుణం తీసుకుంటామని ఆర్థిక శాఖ ప్రతిపాదనలు పంపించింది. ఈ విధంగా ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద మొత్తం 64,539 కోట్ల రూపాయలు సమీకరిస్తామని వార్షిక అంచనా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

# రేవంత్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతనలేదు: హరీశ్‌రావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్ల అంశం చర్చకు రాలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొనగా, ఆయన మాటలకు, చేతలకు పొంతన లేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఈ రోజు జరిగిన సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టే మొదటి అంశమని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ, బనకచర్ల ప్రాజెక్టుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికే కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీల రిమోట్ పాలన కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. ఇద్దరు సిఎంల సమావేశం అనంతరం కమిటీ నిర్ణయానికి రేవంత్ రెడ్డి అంగీకరించడం సముచితం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. బనకచర్లపై కేంద్రం సమావేశం ఏర్పాటు చేయడమే తప్పని, ముఖ్యమంత్రి పాల్గొనడం మరో తప్పని హరీశ్ రావు అన్నారు. నాలుగు కేంద్ర సంస్థలు తిరస్కరించిన ప్రతిపాదనపై సమావేశం ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తూ ముఖ్యమంత్రి మరణ శాసనం రాస్తున్నారని పేర్కొన్నారు. దీనికి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు చేతిలో కేంద్ర ప్రభుత్వం ఉన్నది. రాష్ట్రానికి నష్టం జరిగితే రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటే పోరాటం చేస్తామని చెప్పారు. సుప్రీం కోర్టుకు వెళ్తా అనాలి. కాని ఒప్పుకుంటా అని ఎలా అంటావు రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం గోదావరి బనకచర్ల మీటింగ్ పెట్టడమే తప్పు అని చెప్పారు. సెంట్రల్ వాటర్ కమిషన్, జీఆర్ఎంబీ,పోలవరం ప్రాజెక్టు అథారిటీలు బనకచర్ల ప్రీ ఫీజబులిటి రిపోర్టును తిరస్కరించాయన్నారు. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడ్డ సంస్థలు నిర్ద్వంద్వంగా అనుమతులు తిరస్కరించాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలు తిరస్కరించాక కేంద్రం ఎలా మీటింగ్ పెట్టిందని ప్రశ్నించారు.. రేవంత్ రెడ్డి వెళ్లి కమిటీ వేయండి, కమిటీ ఎట్ల చెబితే గట్ల అని ఎట్ల అంటడు. రాష్ట్ర విభజన చట్టం, జీఆర్ఎంబీ, అపెక్స్ అనుమతి ఇవ్వకుండా బనకచర్లను రిటర్న్ కొడితే, దానికి రేవంత్ రెడ్డి నేడు కమిటీపై సంతకం పెట్టడం ఏమిటి. రేవంత్ తెలంగాణకు చేస్తున్న ద్రోహం ఇది. తెలంగాణ పాలిట రేవంత్ మరణ శాసనం రాసిండన్నారు.. కేసీఆర్ ఉన్నంత కాలం, బిఆర్ఎస్ ఉన్నంత కాలం తెలంగాణకు అన్యాయం జరిగితే సహించేది లేదు బిజెపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణకు ద్రోహం చేస్తున్నాయని ఆరోపించారు. ఢిల్లీలో అపెక్స్ మీటింగ్ డిమాండ్ చేయకుండా ఇంటర్నల్ మీటింగ్ పెడితే రేవంత్‌రెడ్డి ఎందుకు వెళ్లిండు. బిజెపీ ఒత్తిడినా, బాబు ఒత్తిడినా ఏ ఒత్తిడి పని చేసిందని ప్రశ్నించారు. బాబు, బిజెపీతో ఉన్న బాయి బాయి రాజకీయాలపై, ఒప్పందాలపై రేవంత్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణకు తీరని ద్రోహం చేసిన వ్యక్తి, పాలమూరును వ్యతిరేకించిన వ్యక్తిని రాష్ట్ర సలహాదారుగా ఎలా పెట్టుకుంటారని ప్రశ్నించారు.

పాలన రేవంత్, డైరెక్షన్ చంద్రబాబు బాబు చెబితే రేవంత్ పదవులు ఇస్తున్నాడు కాంగ్రెస్ నామినెటెడ్ పోస్టుల్లోనూ బాబు మాటలు రేవంత్ శిరసా వహిస్తున్నడు చంద్రబాబును విమర్శించాల్సింది పోయి, కేసీఆర్‌ను విమర్శిస్తవా మొన్నటి పీపీటీలో చంద్రబాబును ఒక్క మాట అనలేదన్నారు.. పోరాటం ఎవరి మీద తెలంగాణ సాధించిన కేసీఆర్ మీదనా, తెలంగాణకు మోసం చేస్తున్న చంద్రబాబు మీదనా ఏపీలో కూటమి పాలన, తెలంగాణలో విష కూటమి పాలన నడుస్తున్నన్నారు. టెలిమెట్రీ కొత్తగా పెట్టిందేం ఉంది. పోతిరెడ్డి పాడు ప్రాజెక్టు వరకు బిఆర్ఎస్ హయాంలోనే పెట్టారు అన్ని ప్రాజెక్టుల వద్ద పెట్టాలని బిఆర్ఎస్ అడిగింది. కేఆర్ఎంబీ ఆఫీసు హైదరాబాద్ నుంచి విజయవాడకు తీసుకుపోతే విజయం సాధించిన అంటడు అని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నుంచి ఎంఎల్‌సి కవితకు ఉద్వాసన

## టిజిబిజికెఎస్ ఇంచార్జ్‌గా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

### తెలంగాణ భవన్‌లో కెటిఆర్‌తో సమావేశమైన సంఘం నేతలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** బిఆర్ఎస్ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టిజిబిజికెఎస్) నుంచి ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను తొలగిస్తూ పార్టీ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు టిజిబిజికెఎస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు టిజిబిజికెఎస్‌ను కల్వకుంట్ల కవిత గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం కెటిఆర్‌తో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బిఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా అనేక కార్యక్రమాలను చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ దిశగా సింగరేణి ప్రాంతంలో ఉన్న పార్టీ ఎంఎల్ఎలు, ఇంఛార్జీలు, మాజీ మంత్రులతో సమన్వయం చేసుకోవాలని కెటిఆర్ దిశానిర్ధేశం చేశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కోసం పార్టీ తరఫున ఇంచార్జ్‌గా ఇకపై బొగ్గు గని కార్మిక సంఘం వ్యవస్థాపక సభ్యులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యవహరిస్తారని ప్రకటించారు. కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలను పార్టీ తరఫున ముందుకు తీసుకుపోవాలని, సింగరేణి సమస్యలపై మరింత పెద్దఎత్తున పోరాటం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాకా ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంతో పాటు అనేక ఇతర రూపాల్లో ఒత్తిడి తీసుకురావాలని దిశానిర్ధేశం చేవారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికుల కోసం, సింగరేణి సంస్థ కోసం చేసిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా కార్మికుల్లోకి తీసుకుపోవాలని కెటిఆర్ సూచించారు.

# జైల్లో నాకేదయినా అయితే ఆసీం మునీర్‌దే బాధ్యత



## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్

**కరాచి, జూలై 16:** జైలులో తనకేదైనా జరిగితే ఆర్మీచీఫ్ ఆసిం మునీర్‌దే బాధ్యత అని పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ స్పష్టంచేసారు. తన పార్టీ సభ్యులకు కూడా ఇదే అంవం చెప్పినట్లు తెలిపారు. అనేక కేసులు ఎదుర్కొంటున్న ఇమ్రాన్‌ఖాన్ 2023 ఆగస్టు నుంచి జైలుకే పరిమితం అయిన విషయం తెలిసిందే. తమనేతను విడుదలచేయాలంటూ ప్రభుత్వం సైన్యంపై ఒత్తిడితెచ్చేందుకు ఇమ్రాన్‌పార్టీపాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలకు సిద్ధం అవుఉతన్న తరుణంలో ఇమ్రాన్ ఈ వ్యాఖ్యలుచేసారు. జైల్లో ఇటీవలికాలంలో తనకు వేధింపులు మరింతపెరిగాయని, నా సతీమణి బుష్రా బీబీకి కూడా ఇదేపరిస్థితి అని అనానరు. ఆమెజైలు గదిలోని టివికూడా నిలిపేసారని, మా ఇద్దరి ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని, హంతకులు, ఉగ్రవాదులను మాకన్నా మెరుగైన పరిస్థితుల్లో ఉంచుతున్నారని ఇమ్రాన్ వాపోయారు. ఆర్మీచీఫ్ ఆసిం మునీర్ కన్నుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్నట్లు తనకు తెలుసని జైలులో తనకు ఏదయినా జరిగితే ఆయనే జవాబుదారి అవుతారని పార్టీ నేతలకు చెప్పారు. గతంలో సంఘటనలను మనసులో పెట్టుకుని నా సతీమణి విషయంలో ఆసిమ్ మునీర్ వ్యక్తిగత ద్వేషం ప్రదర్శిస్తున్నారని ఆమెను లక్ష్యంగాచేసుకుని నాపై ఒత్తిడి తీసుకురావడమే ఆయన లక్ష్యమన్నారు. జీవితాంతం జైలులో గడిపేందుకు సిద్ధమే కానీ నిరంకుశత్వం అణచివేత ముందు తలవంచ బోనని ఆయన అన్నారు. చర్చలసమయం లేదని ఇక దేశవ్యాప్తంగా నిరసనల సమయం వచ్చిందని ఇమ్రాన్ స్పష్టంచేసారు.

# యూరియా కోటా పెంపు లేనట్టే

## రాష్ట్రంలో ఇప్పటికే పలు జిల్లాల్లో కొరత

## రాష్ట్ర సర్కార్ విజ్ఞప్తులను పట్టించుకోని కేంద్రం

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత ఖరీఫ్ సీజను అవసరాలకు అనుగుణంగా రాష్ట్రానికి కేటాయించిన దానికన్నా అదనంగా యూరియా కోటాను పెంచాలని ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ రాష్ట్రానికి కోటా పెంపుపై ఇంత వరకూ ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో యూరియా వాడకం పెరిగింది. యూరియా నిల్వలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతులు చెప్పులరిగేలా తిరుగుతున్నా దొరకడం లేదు. గత సంవత్సరం జూలైలో 60 వేల టన్నులు సరఫరా జరిగితే ఈ ఏడాది సాగు విస్తీర్ణానికి అనుగుణంగా పెంచాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా గతం కంటే 30వేల టన్నులకు కుదిరించారు. జూలై మొదటి వారంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా సరఫరా జరిగేది. గత ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు 1.14 లక్షల టన్నులు రవాణా చేశారు. ఈ ఏడాది ప్లాంట్ షట్‌డౌన్ కావడంతో రెండు నెలలు యూరియా సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఆర్ఎఫ్‌సీఎల్ ఈనెల కోటా 30వేల టన్నులు నిర్దేశించగా పది రోజుల్లో 10 వేల టన్నులు రవాణా చేశారు. అదనంగా 7వేల టన్నులు కృష్ణపట్నం నుంచి నేషనల్ ఫెర్టిలైజర్స్ కోటాలో రాష్ట్రానికి ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 2.2 లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నట్టు అధికారవర్గాల సమాచారం. ఇందులో కమిషనర్ రిజర్వు పూల్ 50వేల టన్నులు ఉండగా దాన్ని కూడా అత్యవసర పరిస్థితుల దృష్ట్యా వినియోగిస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో సీఆర్‌పీ కోటా నుంచి యూరియా విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో యేటా జూలై నెలాఖరు తరువాత ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా సరఫరా జరిగేది. మూడు రోజుల క్రితం వరంగల్‌లో యూరియా కొరత తీవ్రం కావడం, రైతాంగం గొడవకు దిగడంతో ఆర్ఎఫ్‌సీ ఎల్ నుంచి అత్యవసరంగా ఒక రేక్‌ను వరంగల్‌కు పంపించారు. అలాగే పెద్దపల్లి జిల్లాలో సైతం యూరియా నిల్వలు ఆశించిన స్థాయిలో లేవు. సాధారణంగా ఈ సీజన్‌లో 20వేల టన్నులు నిల్వ ఉండాల్సి ఉండగా 6వేల టన్ను లు మాత్రమే నిల్వ ఉన్నట్టు తెలుస్తున్నది. దీంతో 15 రోజుల్లో కోటా పెంచి రాష్ట్రానికి సరఫరా చేయకపోతే మరిన్ని ఇబ్బందికరమైన పరిస్థితులే ఎదురుకానున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 60నుంచి 80వేల టన్నులు రాష్ట్రానికి ఈ నెలాఖరు వరకు సరఫరా జరిగితేనే డిమాండ్ ఖరీఫ్ సాగు గట్టెక్కనుందని వ్యవసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

# భారత్ సరిహద్దుల్లో మోహరించనున్న అపాచి హెలికాప్టర్లు!



**న్యూఢిల్లీ, జూలై 16:** భారత వైమానికదళం యుద్ధ, నిఘా సామర్థం మరింత పటిష్టం అవుతోంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అపాచీ హెలికాప్టర్లు ఈనెల 21న అమెరికా నుంచి అందనున్నాయి. వాటిని పాకిస్థాన్ సరిహద్దుల్లో మోహరించనున్నట్లు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఈ హెలికాప్టర్లను ట్యాంక్‌ఇన్‌ఎయిర్‌గా పిలుస్తారు. ఎహెచ్64ఇని అధునాతన హెలికాప్టర్ల స్క్వాడ్రన్‌ను హిండన్ వైమానిక స్థావరంలో మోహరించనున్నట్లు పేర్కొన్నారు. అయితే 15 నెలల క్రితం సైన్యానికి తొలి అపాచీ హెలికాప్టర్లు అందగా వాటిని జోధ్‌పూర్ సైనిక స్థావరంలో మోహరించారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ పరిస్థితులు అస్థిరంగా ఉన్న నేపథ్యంలో అపాచీ హెలికాప్టర్ల బట్వాడా ఆలస్యమైంది. ఇప్పటికే వైమానిక దళానికి రెండు స్క్వాడ్రన్ల అపాచీ హెలికాప్టర్లు అందాయి. వాటిని పఠాన్‌కోట్, జోర్హాట్‌లో మోహరించారు. గతంలో భారత వైమానిక దళం 22 అపాచీ హెలికాప్టర్లు కొనుగోలు కోసం అమెరికా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. వాటిని 2020 జులైలో బట్వాడా చేసింది. 2021లో అమెరికా అధ్యక్షు నిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనకు వచ్చిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆరు వందల మిలియన్ డాలర్లకు ఆరు అపాచీ హెలికాప్టర్లు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంది. తొలిదశ హెలికాప్టర్లను గతేడాది మే, జూన్ మధ్య కాలంలో బట్వాడా చేయాల్సి ఉన్నప్పటికీ ఆలస్యమైంది. 2023లో హైదరాబాద్ టాటా బోయింగ్ ఎయిర్‌స్పేస్ లిమిటెడ్ నుంచి సైన్యం మొదటి బ్యాచ్ ఎహెచ్ 64 అపాచీ హెలికాప్టర్లు అందుకుంది. టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్, బోయింగ్ సంయుక్త భాగస్వామ్యంతో వాటిని తయారు చేశాయి. కాగా, అపాచీ హెలికాప్టర్లు ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించ గలవు. అత్యాధునిక వ్యవస్థలతో రూపొందించిన వాటిలో నైట్ విజన్ నావిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి. అవి సైన్యం సామర్థ్యాలను మరింత ప్రభావవంతంగా చేస్తాయి. అదనంగా వాటిలో కమ్యూనికేషన్, నావిగేషన్, సెన్సార్, ఆయుధ వ్యవస్థలు కూడా ఉన్నాయి. అపాచీ హెలికాప్టర్లను దాడి చేయడానికి మాత్రమే కాకుండా భద్రత, నిఘా, శాంతి కార్యకలాపాల్లోనూ ఉపయోగించవచ్చు.

# కూలిపోయిన మేడిగడ్డ మీదనే చర్చ పెడదాం.. రా

## సిఎం రేవంత్‌రెడ్డికి కెటిఆర్ సవాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మరోసారి సవాల్ విసిరారు. తెలివిలేక కాళేశ్వరాన్ని కూలేశ్వరం అంటున్న సిఎం.. కూలిందంటున్న మేడిగడ్డ బరాజ్ మీదనే చర్చ పెడదాం..అంటూ సవాల్ విసిరారు. దమ్మంటే రేవంత్ రెడ్డి తాము విసిరిన సవాల్ స్వీకరించాలని డిమాండ్ చేశారు. గతంలో చర్చకు రా అని సవాలు విసిరి.. మూడు రోజులు సమయం ఇచ్చి మరీ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు వెళితే రేవంత్ రెడ్డి పారిపోయారని ఎద్దేవా చేశారు. చర్చకు వస్తవా.. అని పిలిచి పారిపోయిన రేవంత్ రెడ్డి అని ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు మరొకసారి చర్చకు వస్తావా అని రేవంత్ రెడ్డి అడుగుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం దళిత బంధు సాదన సమితి సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ నాగార్జున సాగర్ కట్టపైన చర్చకు వస్తావా అని సిఎం సవాల్ విసిరారని, నాగార్జునసాగర్ కట్టమీద కాదు కానీ మేడిగడ్డ బ్యారేజ్ మీద చర్చకు రావాలని సవాలు విసురుతు న్నామని చెప్పారు. ఇప్పటికే తమ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మేడిగడ్డ బరాజ్ వద్దకు వెళ్లి వచ్చి మరి ఈ మేరకు సవాల్ విసిరారని, దమ్ముంటే ముఖ్యమంత్రి మేడిగడ్డ బరాజ్ మీద చర్చకు తాము విసిరిన సవాల్ స్వీకరించాలని డిమాండ్ చేశారు. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గం చివరి మడి వరకు నీళ్లిచ్చిన నాయకుడు కెసిఆర్ అని రేవంత్‌కు తెలిసి కూడా ఆయన అబద్దాలు మాట్లాతున్నాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తన స్థాయిని మరిచి పదేపదే దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సిఎం తనను దొంగ లెక్క చూస్తున్నారని పదేపదే మాట్లాడుతున్నారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ఏం చేస్తారో చేసుకోండి నన్ను కోసుకు తింటారా అంటూ రేవంత్‌రెడ్డి రంకెలు వేస్తున్నారన్నారని మండిపడ్డారు.

# ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మృతి: కెసిఆర్ సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** తెలంగాణ ఉద్యమకారుడు, బహుజన మేధావి, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మరణం పట్ల.. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టు మేధావిగా, యాక్టివిస్ట్‌గా ప్రభంజన్ యాదవ్ చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. ఢిల్లీలో తాను చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న ప్రభంజన్ యాదవ్ ఉద్యమ నిబద్ధత గొప్పదని కేసీఆర్ అన్నారు. మహాత్మా ఫూలే, అంబేద్కర్ సామాజిక తాత్వికఆలోచనా దృక్పథంతో, బీసీ కులాల హక్కులు, పురోగతి కోసం నిత్యం తపించే ప్రభంజన్ యాదవ్ మరణంతో తెలంగాణ ఒక గొప్ప తాత్వికున్ని, సామాజిక ఉద్యమకారున్ని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ప్రతినియోజకవర్గంలో వేలాదిగా ఓట్ల తొలగింపు

## అదే ఇండియా కూటమికి నష్టం అంటున్న ఆర్జేడీ



**న్యూఢిల్లీ, జూలై 16:** అసెంబ్లీ ఎన్నికల వేళ బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణ రాష్ట్ర రాజకీయాలను తీవ్రంగా కుదిపేస్తోంది. ఆర్‌జేడీ తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ (ఇండియా కూటమి) డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో పాటు ఎన్నికల సంఘంపై నేరుగా విమర్శలు గుప్పిస్తోంది. ఎస్ఆర్‌లో భాగంగా దాదాపు 36లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తారన్న వార్తలు వస్తున్నాయి. ఈ అంశంపై తేజస్వీ యాదవ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 36 లక్షల మంది ఓట్లర్లు కాదు, రాష్ట్రంలో ఒక శాతం మందిని జాబితా నుంచి తొలగించినా రాజకీయ పార్టీల తలరాతలు మారిపోతాయని తేజస్వి చెప్పుకొచ్చారు. ఒకశాతం ఓట్ల తొలగింపు అనేది ఎన్నికల ఫలితాలపై, ముఖ్యంగా స్వల్ప మెజారిటీతో గెలుపోటములు నమోదైన సుమారు 35 కీలక నియోజకవర్గాలపై గణనీయమైన ప్రభావం చూపుతాయని భయాందోళనకు గురవుతున్నారు. బీహార్‌లో మొత్తం 7.90 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సవరణలో భాగంగా బూత్‌ల నుంచి ఒక శాతం మంది పేర్లు తొలగిస్తే సుమారు 7 లక్షల 90 వేల మంది ఓటర్లు తమ పేర్లను కోల్పోతారని తేజస్వి అంచనా వేస్తున్నారు. దీనిని నియోజకవర్గాల వారీగా విశ్లేషిస్తే, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సగటున 3,251 మంది ఓటర్లు తమ హక్కును కోల్పోతారు. ఎస్ఐఆర్ వల్ల ప్రతి నియోజకవర్గంలో కనీసం 3200 మంది పేర్లను జాబితా నుంచి తొలగించడం అనేది మామూలు విషయం కాదు. ఈ సంఖ్య ఎందుకు ఇంత కీలకమో అర్థం చేసుకోవాలంటే ఓసారి 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలించాల్సిందే. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 సీట్లు ఉన్నాయి. 2020లో 35 నియోజకవర్గాల్లో విజయం, ఓటమి మధ్య తేడా 3200 ఓట్ల కంటే తక్కువగా ఉండటం గమనార్హం. 10 సీట్లలో గెలుపోటముల మధ్య తేడా 12 ఓట్ల నుంచి 951 ఓట్లే. అలాగే, 52 సీట్లలో గెలుపోటముల తేడా 5000 ఓట్ల లోపే ఉన్నాయి. ఈ స్వల్ప తేడాలను దృష్టిలో పెట్టుకుంటే, ఒక్క శాతం ఓటర్ల తొలగింపు కూడా అనేక సీట్లలో గెలుపోటములను ప్రభావితం చేస్తుందని తేజస్వి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హిల్సాలో అయితే ఆర్‌జేడీ అభ్యర్థి శక్తి సింగ్ యాదవ్ కేవలం 12ఓట్ల తేడాతో జేడీయూ అభ్యర్థి కృష్ణమురారి శరణ్ చేతిలో ఓడిపోయారు. బర్బీఘాలోకూడా జేడీయూ అభ్యర్థి సుదర్శన్ కుమార్ కాంగ్రెస్ అభ్యర్థి గజానన్ షాహిని కేవలం 113ఓట్ల తేడాతో ఓడించారు. ఇక రామ్‌గఢ్‌లో ఆర్‌జేడీ అభ్యర్థి సుధాకర్ సింగ్ బీఎస్పీ అభ్యర్థి అంబికా యాదవ్‌ను కేవలం 189 ఓట్ల తేడాతో ఓడించారు. ఇపుడు ఓటర్ల జాబితా సవరణ ఆంక్షలతో తమకు 35 నియోజకవర్గాల్లో కొంతమేర నష్టంజరుగుతుందన్న వాదనను తేజస్వి తెరపైకి తెస్తున్నారు. ఇందుకు ఇండియా కూటమి కూడా సమర్థిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనచేస్తోంది.

# కాళేశ్వరం అక్రమాలపై ఇడి ఫోకస్..

## అవినీతి అధికారులపై విచారణకు నిర్ణయం

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ సర్కారు హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక హోదాలో పనిచేసి ఆ తరువాత అవినీతి ఆరోపణలపై ఎసిబి కేసుల్లో ఇరుక్కుని అరెస్టయిన అధికారులపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) దృష్టి సా రించింది. కాళేశ్వరంలో ఇఎన్‌సిగా పనిచేసి ఎసిబికి పట్టుబడ్డ వారు ఇద్దరయితే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వుండి దొరికిపోయిన వారు మరొకరు. వీరి వ ద్ద వందల కోట్ల రూపాయల ఆస్తులు వుండడం, కోట్లాది రూపాయల నగదు, బంగారు నగలు పట్టుబడడం ఎసిబి అధికారులను సైతం ఆశ్చర్య ప రిచింది. నీటి పారుదల శాఖ చరిత్రలో ఇంత భారీ స్థాయిలో ఇఎన్‌సిలతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి, ఇతర స్థాయి అధికారులు పట్టుబడ డం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఎసిబికి పట్టుబడ్డ వారిలో భూక్యా హరిరాం నాయక్, మురళీధర్ రావులు ఇఎన్‌సి హోదా కలిగిన వారు కా గా నూనె శ్రీధర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హోదా కలిగిన అధికారి. ఇందులో మురళీధర్ రావు పదవీ విరమణ చేసినా 13 ఏళ్లుగా అక్కడే కొనసాగు తున్నారు. మిగతా ఇద్దరు సర్వీసులో వుండి ఎసిబికి దొరికిపోయారు. భూక్యా హరిరాం నాయక్ భార్య సైతం నీటి పారుదల శాఖలోనే ఇఎన్‌సిగా వుండడం, ఆమెపైనా అవినీతి ఆరోపణలు వుండడంతో ఎసిబి దీనిపైనా వివరాలు సేకరించింది. వీరితో పాటు మరికొందరు నీటి పారుదల శాఖ అ ధికారులు కూడా ఎసిబికి దొరికిపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తుండడం, ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ప నిచేసిన పలువురు ఉన్నతాధికారులు ఎసిబి కేసుల్లో పట్టుబడి, వందల కోట్ల రూపాయల ఆస్తులు కలిగివుండడంతో ఈ మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు ఈడీ రంగం సిద్దం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసి ఎసిబికి పట్టుబడ్డ అవినీతి అధికారుల వివరాలను తమకు అందజేయాలని ఈడీ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు. దీని తరువాత ఈ వ్యవహారంపై ఈడీ అధికారులు మరో కేసు నమోదు చే సి విచారణ చేసే వీలుంది. ఈడీకి అందిన సమాచారం మేరకు తాజాగా అరెస్టయిన ఇఎన్‌సి మురళీధర్ రావు కుమారుడు అభిషేక్ రావు ఓ కంపెనీ నెలకొల్పగా అందులో నీటి పారుదల శాఖలో అక్రమార్కులు భారీగా పెట్టుబడులు పెట్టారు. దీనిపై పక్కా సమాచారం సేకరించిన ఈడీ అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసి అవినీతి కేసులో అరెస్టయిన వారి వివరాలను తీసుకుని, వారిపై చర్యలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# యాత్రీకులపై దాడి తర్వాత ఉగ్రవాదుల సంబరాలు

## ఎన్ఐఎ దర్యాప్తులో ప్రత్యక్ష సాక్షి వెల్లడి



**న్యూఢిల్లీ,జూలై 16:** మినీస్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులపై ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. సమీపంలోని అడవిలో నుంచి వచ్చిన ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు ఈ పాశవిక దాడికి పాల్పడిన ముష్కరుల కోసం దర్యాప్తు బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. ఇక ఈ ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఈ దర్యాప్తులో తాజాగా కీలక విషయాలు వెల్లడయ్యాయి. కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు స్థానికులను, ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పహల్గాం మారణహోమాన్ని కళ్లారా చూసిన ఓ ప్రత్యక్ష సాక్షి దర్యాప్తులో సంచలన విషయాలను వెల్లడించినట్లు ఎన్ఐఏ వర్గాలు తాజాగా తెలిపాయి. బైసరాన్ వ్యాలీలో 26 మందిని పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదులు.. దాడి అనంతరం గాల్లోకి కాల్పులు జరిపి సంబరాలు చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక వర్గాన్ని మాత్రమే టార్గెట్ చేసి దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షి పేర్కొన్నారు. అంతేకాకుండా పలు కీలక విషయాలు కూడా దర్యాప్తు అధికారులకు చెప్పినట్లు ఎన్ఐఏ వర్గాల ద్వారా తెలిసింది.

# డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరా: మంత్రి భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** భవిష్యత్ లో ఏర్పడే విద్యుత్ డిమాండ్ ను అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీడీసీఎల్ లో విద్యుత్ శాఖల ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మార్చి 24న 308.45 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను సరఫరా చేయగా.. ఈ ఏడాది 18 మార్చిన 335 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను సరఫరా చేశామన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధికం అని అన్నారు. గత ఏడాది 8 మార్చి 8న 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడగా.. ఈ ఏడాది మార్చి 20న 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడిందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. సుమారు 2000 మెగావాట్ల అదనపు డిమాండ్ ఏర్పడినప్పటికీ రెప్పపాటు కాలం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయగలిగామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ పీక్ డిమాండ్ 2024 నుంచి 9.8శాతం చొప్పున పెరుగుతోందని 2034 నాటికి ఇది 33,773మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర సంస్థలు విశ్లేషించినట్టు తెలిపారు. గత ఐదేళ్లగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని చెప్పారు.

# 18లోపు టిజిఇఎపీసెట్ సీట్ల కేటాయింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** టీజీఈఏపీసెట్ 2025 మొదటి విడత కౌన్సెలింగ్ కు సంబంధించి ఈ నెల 18 లోపు సీట్ల కేటాయింపు ఉంటుందని టీజీఈఏపీసెట్ అడ్మిషన్ల కన్వీనర్ దేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. 95,926 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు హాజరు కాగా, 94,354 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో 44.553 మంది ఆప్షన్లను మార్చుకోగా, మొత్తం 59,31,279 ఆప్షన్లు ఇచ్చుకున్నట్లు తెలిపారు.

# పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూల రాష్ట్రం

## ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** టెక్నాలజీ తదితర పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమైన ప్రాంతమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తో ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ మార్క్ లేమి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయింది. రాష్ట్రంలోవనరులు ఇతర అంశాలను అధ్యయనం చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం ఫ్రాన్స్ బృందానికి సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీసందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కోసిఎండి కృష్ణ భాస్కర్‌తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో డిప్యూటేషన్లు రద్దు,తక్షణమే అమల్లోకి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో అమలులో ఉన్న డిప్యుటేషన్లను తక్షణమే రద్దు చేస్తున్నట్లు గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. గురుకులాల్లో విద్యాబోధన, పరిపాలనలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే, కొన్ని ప్రత్యేక కేసులకు ఈ రద్దు నుండి మినహాయింపునిచ్చినట్లు పేర్కొన్నారు.

# అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 210 నుంచి 500 సీట్ల పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు విదేశీ విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద 210 నుంచి 500 సీట్ల పెంపునకు ఆమోదం తెలుపుతూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# జనగణన గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై16:** జనాభా గణనపై తెలంగాణ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. బుధవారం ఈ నోటిఫికేషన్ ను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ప్రచురించారు. భారతదేశంలో తదుపరి జనాభా గణన (సెన్సస్) 2027 సంవత్సరంలో జరగనుంది. ఈ మేరకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం అధికారిక నోటిఫికేషనన్ను విడుదల చేసింది. కేంద్ర హోం శాఖ విడుదల చేసిన గెజిట్‌కు కొనసాగింపు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది.

# తెర

## డూప్ లేకుండా

# మేజర్ సాహసం



ఇప్పుడు ఇండియన్ సినిమా దగ్గర ఇంకా ఎలాంటి అధికారిక అనౌన్స్‌మెంట్ కూడా లేకుండా ఊహించని లెవెల్ అది కూడా గ్లోబల్ లెవెల్ హైప్ ఉన్న సినిమా ఏదన్నా ఉంది అంటే అది సూపర్ స్టార్ మహేష్ బాబు, ఎస్ ఎస్ రాజమోళి కాంబినేషన్ సినిమానే అని చెప్పవచ్చు. అయితే మహేష్ బాబు నుంచి ఒక స్పెషల్ క్వాలిటీ తన కెరీర్ ఆరంభం నుంచే ఉంది. ఇప్పుడు అదే మళ్ళీ ఈ భారీ ప్రాజెక్ట్ కోసం బయట పెట్టనున్నట్టుగా తెలుస్తుంది. మహేష్ బాబు తన కెరీర్ స్టార్టింగ్ లోనే టక్కరి దొంగ, ఒక్కడు, 1 నేనొక్కడినే ఇంకా పలు సినిమాల్లో చాలా రిస్క్ తో కూడుకున్న స్టంట్స్ చేసేసారు. ఇప్పుడు అంటే ఆ తరహా సినిమాలు తనకి పడట్లేదు కానీ రిస్క్ పరంగా మహేష్ కథ డిమాండ్ చేస్తే ఎంత దూరమైనా వెళ్లడం మహేష్ నైజం. ఇప్పుడు ఇదే డేరింగ్ అండ్ డాషింగ్ దూకుడుతో జక్కన్న కోసం ప్రాణం పెట్టి మరీ వర్క్ చేస్తున్నారట. ఈ సినిమాలో మేజర్‌గా అసలు డూప్‌కి నో చెప్పేస్తున్నారట. ఎలాంటి రిస్క్ అయినా కూడా మహేష్ బాబే చేయాలని ఫిక్స్ అయ్యినట్టుగా తెలుస్తుంది. ఈ సినిమా కోసం మహేష్ బాబు తన బెస్ట్ ఇవ్వాలనే చూస్తున్నారట. సో ఈ బిగ్ ప్రాజెక్ట్‌లో మాత్రం మహేష్ బాబు నుంచి ఊహించని స్టంట్స్ మనం ఆశించవచ్చు.

# మనీషాకు అరుదైన గౌరవం



బాలీవుడ్ సీనియర్ నటి మనీషా కొయిరాలాకు అరుదైన గౌరవం దక్కింది. లండన్ లోని యూనివర్సిటీ ఆఫ్ బ్రాడ్‌ఫోర్డ్ ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ విషయాన్ని మనీషా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. అలాగే డాక్టరేట్ ప్రధానం చేసిన వీడియోను కూడా పంచుకున్నారు. తనకు విద్య చదువుకోవడం ద్వారా కాకుండా నిజ జీవిత అనుభవాల ద్వారా వచ్చిందని తెలిపారు. ఈ మేరకు మనీషా తన పోస్టులో ఇలా రాసుకొచ్చింది.. నేను సాంప్రదాయ విద్యా మార్గం ద్వారా వచ్చిన వ్యక్తిగా ఇక్కడ నిలబడలేదు. జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, వైఫల్యాల నుంచి నేర్చుకున్న వ్యక్తిగా నిలబడ్డాను. ఈ గౌరవం నేను మాటల్లో చెప్పలేనంత విలువైనది. మీరు ఎక్కడి నుంచి జీవితం ప్రారంభించినా.. చివరికి మీ ప్రయాణం ముఖ్యమని ఇది రుజువు చేస్తుంది. నా కథకు విలువనిచ్చి, గుర్తించిన యూనివర్సిటీ ఆఫ్ బ్రాడ్‌ఫోర్డ్‌కు కృతజ్ఞతలు అని పోస్ట్ పెట్టారు.

# ఇండియన్ 3 రావడం పక్కా



యూనివర్సల్ హీరో కమల్ హాసన్ హీరోగా నటించిన ఎన్నో ఐకానిక్ హిట్ చిత్రాల్లో ఇండియన్ కూడా ఒకటి. మావెరిక్ దర్శకుడు శంకర్‌తో చేసిన ఈ సినిమాకి ఎంతో మంచి పేరుంది. అయితే దీనికి సీక్వెల్ అనౌన్స్ చేసినప్పుడు కలిగిన హైప్ అది రిలీజ్ అయ్యాక మాత్రం వాటిని అందుకోలేదు. అయితే దీనికి ముందే మేకర్స్ పార్ట్ 3ని కూడా లాక్ చేసేసుకున్నారు. కానీ పార్ట్ 2 విఫలం అయ్యేసరికి ఈ పాటికే వచ్చేయాల్సిన ఇండియన్ 3 మాత్రం ఇంకా రాలేదు. మధ్యలో చాలా తతంగమే నడిచింది. సినిమా ఆగిపోయింది అని అలానే డైరెక్ట్ ఓటిటిలోకి వస్తుంది అంటూ పలు కామెంట్స్ వినిపించాయి. కానీ దర్శకుడు శంకర్ మాత్రం ఇండియన్ 3 ఉందని కన్ఫర్మ్ చేశారు.

అయితే లేటెస్ట్ ట్విస్ట్ గా తమిళ సినీ వర్గాలు నుంచి ఇండియన్ 3 డెఫినెట్ గా వస్తుందనే అంటున్నారు. అలాగే ఒక సాంగ్ ఇంకా కొన్ని పోర్షన్స్ షూట్ మిగిలి ఉందని వాటిని తెరకెక్కిస్తారని కొత్త రూమర్లు మొదలయ్యాయి. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది వేచి చూడాలి.



# ఐదు భాషల్లో ఆశ


మలయాళ సినిమా రంగానికి చెందిన ప్రముఖ నటీనటులు ఊర్వశి , జోజు జార్జ్ కలిసి క్రేజీ మల్టీ లింగ్వల్ మూవీలో నటిస్తున్నారు. తాజాగా పూజా కార్యక్రమాలతో మొదలైన ఆ సినిమా ఆశ అనే పేరు పెట్టారు. అజిత్ వినాయక ఫిల్మ్స్ సమర్పణలో, వినాయక అజిత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా సఫర్ సనల్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. జోజు జార్జ్, రమేష్ గిరిజ, సఫర్ సనల్ సంయుక్తంగా దీనికి స్క్రీన్ ప్లే, డైలాగ్స్ రాశారు. త్రిక్కక్కర వామన మూర్తి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంతో ఆశ చిత్రం ప్రారంభమైంది. జోజు జార్జ్, సినిమాటోగ్రాఫర్ మధు నీలకందన్, దర్శకుడు సఫర్ సనల్ జ్యోతి ప్రజ్వలన చేశారు. జోజు జార్జ్ క్లాప్ కొట్టగా, మధు నీలకందన్ కెమరా స్విచ్ ఆన్ చేశారు. ఈ వేడుకలో ఆశ టైటిల్ లుక్ పోస్టర్ లాంచ్ చేశారు. ఇది ఆడియన్స్‌లో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సైతం అదే రోజు మొదలైంది. విజయ రాఘవన్, ఐశ్వర్య లక్ష్మి ్మ, పాణి ఫేమ్ రమేష్ గిరిజ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆశ ఐదు భారతీయ భాషల్లో పాన్ ఇండియన్ మూవీగా విడుదల కానుంది. ఈ సినిమాకు మిధున్ ముకుందన్ సంగీతం అందిస్తున్నారు.



## నదివే నువ్వు నదివే..

# నీ మార్వే రానుంది వినవే

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షి త్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. బుధవారన 'ది గర్ల్ ఫ్రెండ్ సినిమా నుంచి నదివే...రికల్ సాంగ్ ను హిందీతో పాటు తమిళ, తెలుగు, కన్నడ, మలయాళం..ఐదు భాషల్లో రిలీజ్ చేశారు. నదివే... పాటను బ్యూటిఫుల్ మెలోడీగా కంపోజ్ చేసి పాడారు మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహబ్. రాకేందు మౌళి లిరిక్స్ అందించారు. నదివే నువ్వు నదివే, నీ మార్వే రానుంది వినవే. నదివే నువ్వు నదివే..నీకే నువ్వియాలి విలువే..సిలువ బరువేమోయక, సులువు భవితే లేదుగా, వెన్నెల వలదను కలువే నువ్వుగా..నదివే నువ్వు నదివే.. అంటూ ప్రేయసి ప్రత్యేకతను పొగుడుతూ పొయెటిక్ గా సాగుతుందీ పాట. చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ త్వరలోనే అనౌన్స్ చేయబోతున్నారు. నటీనటులు రశ్మిక మందన్న, దీక్షి త్ శెట్టి, తదితరులు. టెక్నికల్ టీమ్‌లో సినిమాటోగ్రఫీ కృష్ణన్ వసంత్, సంగీతం హేషమ్ అబ్దుల్ వాహబ్, కాస్ట్యూమ్స్ శ్రావ్య వర్మ, ప్రొడక్షన్ డిజైన్ ఎస్ రామకృష్ణ, మోనిక నిగోత్రి, పీఆర్ఓ జి.ఎస్.కే మీడియా,వంశీ కాక, మార్కెటింగ్ ఫస్ట్ షో సమర్పణ అల్లు అరవింద్ బ్యానర్స్ గీతా ఆర్ట్స్,ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి



## సినిమా చేయాలంటే .. అన్నీ వదిలేయక్కరలేదు

ఒక సినిమా చేయాలంటే అన్ని వదిలేసుకుని రావాలి అనే ఒక ఆలోచనకు భిన్నంగా డైరెక్టర్ కొత్తపల్లిలో ఒకప్పుడు సినిమాని తీశారు. ఇందులో అన్ని మనకి తెలిసిన పాత్రలే మన చుట్టూ ఉన్న పాత్రలే అనిపించాయి అని హీరో రానా దగ్గుబాటి అన్నారు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ప్రెస్ మీట్‌లో మూవీ ప్రజెంటర్ రానా దగ్గుబాటి మాట్లాడారు. డైరెక్టర్ ప్రవీణ కార్డియాలజిస్ట్. తను ప్రాక్టీస్ చేస్తూనే ఈ సినిమా తీశారు. అలాగే మనోజ్ కూడా జాబ్ చేస్తున్నాడు. ఇతర వృత్తుల్లో, వ్యాపకాల్లో ఉంటూ కూడా సినిమా తీయవచ్చని వారు నిరూపించారు. ఇలాంటి మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. మనోజ్ మస్త్ హీరో లాగా ఉన్నాడు.

తనని స్క్రీన్ మీద చూస్తున్నప్పుడు చాలా నచ్చాడు.

మంచి యాక్టర్ అని పేర్కొన్నారు. రానా గారు వల్లే కేరాఫ్ కంచరపాలెం సినిమా జనాల్లోకి వెళ్ళింది. రానాగారి లాంటి బిగ్ ప్రొడక్షన్ హౌస్ నాలాంటి ఫిలిం మేకర్స్ చేస్తున్న సినిమాల్ని సపోర్ట్ చేయాలంటే ఆడియన్స్ వచ్చి తప్పకుండా థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేయాలి.

హీరో మనోజ్ చంద్ర మాట్లాడుతూ.. కష్టపడి నిజాయితీగా ఒక సినిమా తీస్తే ఆడియన్స్ ఎప్పుడూ కూడా ఆదరిస్తారని మరోసారి నిరూపించారు అని పేర్కొన్నారు. యాక్టర్ రవీంద్ర విజయ్, యాక్టర్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# వేశ్య పాత్రకు గ్రీన్‌సిగ్నల్



శ్రీకాంత్ ఓదెల నాని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ డ్రామా పారడైస్‌లో కాయదు నటిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇందులో నానికి జోడీగా వేశ్య పాత్రలో కనిపించబోతుందని టాక్. సాధారణంగా హీరోయిన్లు వేశ్య పాత్రలు చేయడానికి వెనకడుగు వేస్తారు. కానీ, పాత్ర బలంగా ఉండడంతో కాయదు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒకవేళ నిజంగానే సినిమాలో ఈ పాత్ర ప్రభావం బలంగా ఉంటే కాయదు కెరీర్ కి కీలకంగా మారుతుందని నెటిజన్లు అనుకుంటున్నారు. ఇది మాత్రమే కాదు నాని కాయదు మధ్య బోల్డ్ సీన్స్ కాస్త ఎక్కువగానే ఉన్నట్లు టాక్. ఇదిలా ఉంటే ఇటీవలే నాని పారడైజ్ సెకండ్ షెడ్యూల్ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో నానికి సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దసరా తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబోలో రాబోతున్న ఈమూవీపై ఫ్యాన్స్‌లో అంచనాలు భారీగా ఉన్నాయి. అంతేకాదు ఇప్పటికే విడుదలైన గ్లిమ్స్ వీడియోలో మాస్ అండ్ రగ్గడ్ అవతార్ లో నాని లుక్ విపరీతమైన హైప్ క్రియేట్ చేసింది.

# అందుకే నేను ఒప్పుకోలేదు



సన్సేషనల్ క్రైమ్ థ్రిల్లర్ ఆ గ్యాంగ్ రేపు3 త్వరలోనే ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. కాగా ఈ చిత్రం కంటెంట్ ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అతిథిగా విచ్చేసిన నటుడు, కొరియోగ్రాఫర్ ఆటా సందీప్ మాట్లాడుతూ గ్యాంగ్ రేపు.. షార్ట్ ఫిల్మ్‌గా వైరల్ అయ్యింది. దీని రెండో భాగంలో నేను చేశాను. అది కూడా బాగా హిట్ అయ్యింది. ఆ గ్యాంగ్ రేపు 3కి అడిగారు. కానీ నేను ఒప్పుకోలేదు. నేను కొరియోగ్రాఫర్‌గానే ఉండాలనుకుంటున్నాను. ఇంత బోల్డ్‌గా ఉన్న పాత్రను చేయాలనుకులోదు. అందుకే ఈ సినిమా చేయలేదు. చాలా కారణాలతో ఈ సినిమా చేయలేదు. ఈటీమ్‌తో నాకు చాలా మంచి స్నేహం ఉంది. ఫీచర్ ఫిలిం చేసి, కథ నచ్చి ఓటీటీ కోసం మంచి పాషన్‌తో ఈ సినిమా చేశాడు. ఈ ట్రైలర్, బోల్డ్‌గా ఉంది. నేడు సమాజంలో జరుగుతున్న పరిణామాలను కూడా ఈ సినిమాలో దర్శకుడు చర్చిస్తున్నాడు. తప్పకుండా ఈ సినిమా ఓటీటీలో అందరి ఆదరణ పొందాలని కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ నిర్మాత నన్ను నమ్మి బాగా ఖర్చు పెట్టారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తోచేసిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది. నిర్మాత మాట్లాడుతూ దర్శకుడిని నమ్మి ఈ సినిమా చేశాను. కొత్త టీమ్‌తో చేశాం. ఈ సినిమా ప్రాసెస్‌లో నాకు ఈ చిత్రంపై ఇష్టం పెరిగింది అన్నారు. ఈ సమావేశంలో ఈ చిత్రంలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా పాల్గొన్నారు. నరేన్ అన్నసాగరం, ప్రీతి సుందర్, సందీప్ సాండిలియా, దయానంద్ రెడ్డి, మహిపాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి బ్యానర్: సహచర ప్రొడక్షన్స్, నిర్మాత: నోక్షి యస్ నాగ్స్, దర్శకుడు: యోగేష్ కుమార్, డీఓపీ: నాని ఐనవల్లి, సంగీతం: కబీర్ రఫీ, ఎడిటర్: అనిల్ కుమార్ జల్లు .

# అన్నీ అడ్డంకులే



యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న అనుష్క శెట్టి ఘాటి సినిమా సెప్టెంబర్‌లో విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇందులో గిరిజన మహిళగా అనుష్క పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. అనుష్క శెట్టి, క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్లో తెరకెక్కిన ఘాటి థియేటర్లలోకి వచ్చేందుకు పురిటి కష్టాలు పడుతోంది. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయినా అనేక కారణాలతో రిలీజ్ వాయిదా పడుతూ వస్తోంది. ఏప్రిల్‌లో రిలీజ్ అనుకుంటే వాయిదా పడింది. ఇక జులై 11న రిలీజ్ చేస్తామని నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ అధికారికంగా ప్రకటించినా మేకర్స్ నుంచి ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో ఫ్యాన్స్ నిరాశకు గురయ్యారు. చాలామంది యూవీ క్రియేషన్స్ మీద ట్రోల్స్ గట్టిగా వేశారు. మీకు సినిమాలు తీయడం తప్ప.. టైమ్‌కి రిలీజ్ చేయడం చేతకాదని, సినిమాలు మానేసి వేరే ఏదైనా పని చేసుకోవచ్చు కదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తానికి ఈ ట్రోల్స్ భరించలేక సినిమా రిలీజ్ వాయిదా వేస్తున్నట్లు అఫిషియల్‌గా ప్రకటించారు.

# వారంలో వార్ షురూ



బ్లాక్‌బస్టర్ ఐఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్ నుంచి రానున్న వార్ 2 గురించి ప్రస్తుతం దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ యాక్షన్ ఓరియెంటెడ్ స్పై డ్రామాని యష్ రాజ్ ఫిల్మ్స్ గ్రాండ్‌గా నిర్మించింది. ఈ వార్ 2 చిత్రం మరో ముప్పై రోజుల్లో బాక్సాఫీస్ వద్ద విధ్వంసం సృష్టించేందుకు రానుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ నటించిన సంగతి తెలిసిందే. ఈ హైఆక్టేన్ స్పై థ్రిల్లర్ ఆగస్టు 14న తెరపైకి గ్రాండ్‌గా రానుంది. వార్ 2 ముప్పై రోజుల్లో రానుందని తెలిసేలా మేకర్లు తాజాగా ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో ప్రధాన పాత్రల్ని చూపించిన తీరు ఆకట్టుకుంటోంది. ఈ త్రయానికి చిత్రంలో ఉన్న ఇంపార్టెన్స్ చూపించేలా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. ఈ కొత్త పోస్టర్ అభిమానులలో ఉత్సాహాన్ని పెంచేసింది. హిందీ, తెలుగు, తమిళ భాషలలో విడుదల కానున్న వార్ 2 ఈ సంవత్సరంలోనే బిగ్గెస్ట్ రిలీజ్‌గా రికార్డులు క్రియేట్ చేయబోతోంది.

# పాట చిత్రీకరణలో చిరు, నయన్

మెగాస్టార్ చిరంజీవి, స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ మూడో షెడ్యూల్‌ను ప్రారంభించుకుంది. జూలై 16 నుండి కేరళలోని అలెప్పి పరిసర ప్రాంతంలో ఇది మొదలైంది. ఈ షెడ్యూల్ ఓ ప్రధానంగా చిరంజీవి, నయనతార పై ఓ పాటను చిత్రీకరిస్తారు. సంక్రాంతికి వస్తున్నాం మూవీకి కొరియోగ్రఫీ అందించిన భాను మాస్టర్ ఈ పాటకు వినూత్నరీతిలో నృత్యరీతులు సమకూర్చబోతున్నారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటకు భీమ్స్ స్వరాలు సమకూర్చారు. మెగాభిమానులు కన్నులకింపుగా ఈపాట రూపుదిద్దుకోబోతోంది. వచ్చే సంక్రాంతిని టార్గెట్ చేస్తూ అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల దీన్ని నిర్మిస్తున్నారు. కేరళలో జరుగుతున్న మూడో షెడ్యూల్ జూలై 23 వరకూ కొనసాగుతుంది

## అవకాశాలు రాక

# ఇలా..



నటనపై ఆసక్తితో కథల్ ఏ జాక్‌ఫ్రూట్ మిస్టరీ సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. కానీ ఈ సినిమా ఆశించిన స్థాయి లో ఆకట్టుకోలేకపోయింది. అందం, గ్లామర్ పుష్కలంగా ఉన్నప్పటికీ అవకాశాలు రాకపోవడంతో.. సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫొటో షూట్లతో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. వెరైటీ వైరైటీ దుస్తుల్లో బాడీ పార్ట్స్ కనిపించేలా ఫోటోలకు ఫోజిలిస్తూ సోషల్ మీడియాను హీటెక్కిస్తోంది. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన ప్రతీ ఫోటో నిమిషాల్లో వైరల్ అవుతూ ఉంటుంది. ఈ బ్యూటీ అందాలను కొందరు పొగుడుతుండగా .. మరికొందరు ఏంటిది? అంటూ తిట్టిపో స్తున్నారు. గ్లామరస్ ఫోటోషూట్‌లతో పాటు, ఆమె తన వ్యక్తిగత జీవితం, ప్రయాణ అనుభవాలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటుంది మేఘా. సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ గా కనిపించే ఈ బోల్డ్ బ్యూటీ మిలియన్ పైగా ఫాలోవర్లు ఉన్నారు. తాజాగా పర్పుల్ బాడీ కాన్ గౌన్‌లో ఇన్నర్ వేర్స్ లేకుండా ఈ బ్యూటీ థై షో నెట్టింట వైరల్ అవుతోంది.

# కోటదాటి ప్రజాసేవ కోసం..

ఒకప్పుడు మహారాణులు, యువరాణులు కోట దాటి బయటికొచ్చేవారు కాదు. తమ రాజ్యంలోని ప్రజల కోసం తామేం చేయాలన్నా, తామే ఏ నైపుణ్యాలు నేర్చుకోవాలన్నా అన్నీ రాజభవనంలోనే సాగేవి. కానీ ఈ కాలపు యువరాణులు అలా కాదు. ప్రజా సేవ కోసం ప్రపంచాన్నే చుట్టేస్తున్నారు. విభిన్న రంగాల్లో అరితేరుతూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకుంటున్నారు. మేవాడ్ రాకుమారి పద్మజా కుమారి సర్మార్ కూడా ఇదే కోవకు చెందుతుంది. తన తాతగారి స్ఫూర్తితో ఓ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పిన ఆమె.. ఈ వేదికగా ఎన్నో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మరోవైపు కుటుంబ వ్యాపార బాధ్యతన్నీ చూస్తోంది. కోట దాటితేనే ప్రజల కష్టాలు తెలుస్తా యంటోన్న ఈ మోడ్రన్ ప్రిన్సెస్ గురించి కొన్ని ఆసక్తికర విశేషాలు తెలుసుకుందాం..



మన దేశంలో ఇప్పటికీ కొన్ని చోట్ల పలు రాజవంశాల ఉనికి కొనసాగుతోంది. ఆయా రాజవంశాలకు చెందిన కొంతమంది వారసులు కుటుంబ నేపథ్యంతో తమదైన ప్రత్యేకతతో సమాజంలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. రాజస్థాన్‌లోని మేవాడ్ రాజవంశంలో పుట్టిన పదజా కుమారి పర్మార్ కూడా వీరిలో ఒకరు. ప్రపంచంలోనే పురాతన రాజవంశాల్లో ఒకటైన ఈ రాజవంశానికి చెందిన 76వ సంరక్షకుడైన శ్రీజీ అరవింద్ సింగ్ మేవాడ్ కుమార్తె ఆమె. మహిళలకు చేయూత. ఈ యువరాణికి ప్రజాసేన అంటే చిన్నప్పట్నుంచే ప్రాణం. 1969లో తన తాతగారు 'మహారాణా ఆఫ్ మేవాడ్ చారిటబుల్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి.. ఈ వేదికగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి చూస్తూ పెరిగిన ఆమె.. తానూ పెద్దయ్యాక ప్రజాసేవ చేయాలని సంకల్పించుకుంది. ఈ ఆశయంతోనే 2013లో తన తాతగారి జ్ఞాపకార్థం ఫ్రెండ్స్ ఆఫ్ మేవాడ్ పేరుతో ఓ ఎన్జీవోను స్థాపించారు. ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, సాంస్కృతిక వారసత్వం.. ఈ నాలుగు విషయాలపై అవగాహన కల్పించాలన్న ముఖ్యోద్దేశంతోనే ఈ స్వచ్ఛంద సంస్థ రూపొందించినట్లు చెబుతోంది పద్మజ. 'డాక్టర్ కుష్ పర్మార్ను వివాహం చేసుకున్నాక బోస్టన్‌లో స్థిరపడ్డా. ప్రస్తుతం అక్కడ్నుంచే సేవా కార్యక్రమాలు జరుగుతాయి. అలాగని పుట్టిన దేశాన్ని మర్చిపోలేదు. వీలు చిక్కినప్పుడల్లా ఉదయ్‌పూర్‌లోని మా ప్యాలస్‌కు వచ్చి వెళ్తుంటా, మా పూర్వీకుల్ని కలుస్తుంటా. నేను సేవా రంగంలో సేవాకి రావడానికి మా తాతగారే కారణం. ఇక్కడి మహిళలన్ని సాధికారత దిశగా నడిపించేందుకు వివిధ చేతివృత్తులలో శిక్షణ ఇప్పిస్తున్నా. ఈ క్రమంలోనే వాళ్ల రూపొందించిన ఉత్పత్తుల్ని ఇక్కడ జరిగే ఫెస్టివల్స్, ఎగ్జిబిషన్లలో ప్రదర్శించేలా ప్రోత్సహిస్తున్నా. ఇలా ఇకనకడి మహిళల చేతిలో తయారైన స్టోల్స్/స్కార్ఫ్లు దేశవిదేశీయుల్ని ఆకట్టుకుంటున్నాయి. దీనివల్ల వీరికి ఓ ఉపాధి మార్గమూ దొరికినట్లయింది. ఒక ప్రతి ఆడపిల్లలకూ చదువు ముఖ్యమని నేను నమ్ముతా. అందుకే ఇక్కడి బాలికల్ని విద్యావంతుల్ని చేయడానికి మా పూర్వీకులు స్థాపించిన ప్రభుత్వ బాలికల సీనియర్ సెకండరీ స్కూల్ నిర్వహణ బాధ్యతల్నీ చూసుకుం టున్న వారికి నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేసునతన్నా అంటోంది పద్మజ.



**మధుమేహాంపై యుద్ధం!** తన ఎన్జీవో వేదికగా బాలికలు, మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రిన్సెస్ పద్మజ.. ఆరోగ్య స్పృహ పెంచేందుకు కృషి చేస్తోంది. ముఖ్యంగా టైప్1 మధుమేహాంపై అవగాహన పెంచేందుకు ఎన్నో కార్యక్రమాలు, నిపుణులతో ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తోందీ రాకుమారి. మధుమేహాన్నే ఎందుకు ఎంచుకోవాలంటే. ఈ ఆరోగ్య సమస్యతో కలిసి జీవించడం కష్టమో నాకు తెలుసు. ఎందుకంటే నాకు ఐదేళ్ల వయసులోనే టైప్-1 మధుమేహం ఉందనా నిర్ధరణ అయింది. పెరిగే అనేక సమస్యలు ఎదుర్కొన్నా. అయితే నాలా మరే ఈ అనారోగ్యం బారిన పడకుండా ఉండాలనే సంకల్పంతో నా ఎన్జీవో వేదికగా మధుమేహంపై అవగాహన పెంచుతోంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో శిశ సంరక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయడం. గిరిజన చిన్నారులకు పోషకాహారం అందించడం, ఈ వ్యాధిపై అవగాహన పెంచేందుకుగ్రామీణ గిరిజన ప్రాంతాల ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం.. వంటి వెన్నో చేస్తున్నాం. దీనితో పాటు ఆయా కంటి ఆస్పత్రుల సహకారంతో ఇక్కడి గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలూ ఉచితంగా అందిస్తాం.. మరో వైపు మానసిక ఆరోగ్యం గురించి వివరిస్తున్నాం.. అంటోన్న ఈ మనసున్న యువరాణి.. 'బ్రేక్‌త్రూ టిఐడి గ్లోబల్' గానూ కొనసాగుతోంది. కొనసాగుతోంది

**వ్యాపారంలోనూ రాణిస్తూ!...** రాకుమారే అయినా.. క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల సమస్యల్ని తెలుసుకొని.. వాటిని దూరం చేసే ప్రయత్నం చేస్తోన పద్మజ..మరోవైపు మేవాడ్ రాజవంశానికి వారసురాలిగా తమ రాచరికపు సంప్రదాయాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే బాధ్యతనూ తన భుజాలపై వేసు కుంది. ఈ క్రమంలోనే ఉదయ్‌పూర్‌లోని తమ రాజప్రాసాదా నికి మరమ్మతులు చేయించడం, మోడ్రన్ హంగులద్దడం, రాజవంశానికి చెందిన పాత మ్యాప్స్‌ని డిజిటలైజ్ చేయించడం.. వంటివెన్నో నిర్వర్తిస్తోంది బ్యూటిఫుల్ ప్రిన్సెస్. అంతేకాదు. తమ కుటుంబ వ్యాపారమైన 'హిస్టారిక్ రిసార్ట్ హోటల్స్' గ్రూప్ నిర్వహణ బాధ్యతల్నీ తన భుజాలకెత్తుకుంది పద్మజ.

# అగ్నిమాపక దళంలో మహిళాశక్తి




**మహిళలకు సంప్రదాయ** ఉద్యోగాలైతే మేలు అన్న పరిస్థితులు ఇప్పుడు మారిపోయాయి. అంతరిక్షం నుంచి అగ్నిమాపక దళం వరకూ అన్నింటా అమ్మాయిలు తమ ప్రతిభను, శక్తి సామర్థ్యాలను చాటుతున్నారు. అందుకు ఉదాహరణే **శుభాంగి ఘులే** మహారాష్ట్రలోని పన్వేల్ మున్సిపల్ కార్పొరేషన్ (పీఎంపీ)లో ఫైర్ ఫైటర్‌గా పని చేస్తున్నారు. తాజాగా అమెరికాలోని అలబామాలో జరిగిన 21వ 'వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్'లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ప్రపంచ యవనికపై భారతదేశ ప్రతిష్టను, దేశ మహిళాశక్తిని చాటి చెప్పారు. 50కి పైగా దేశాల నుంచి వచ్చిన అగ్రస్థాయి పోలీస్, ఫైర్‌ఫైటింగ్ నిపుణులతో ఈ పోటీలు జరిగాయి. ఇందులో అత్యంత కఠినమైన 'అల్టిమేట్ ఫైర్ ఫైటింగ్ చాలెంజ్'లో మెరుగైన ప్రదర్శన చేశారు. అత్యవసర పరిస్థితులలో వేగం, శక్తి. వ్యూహాత్మక నైపుణ్యాలను ఇందులో ఎక్కగడతారు. శుభాంగి ఉద్యోగంలో చేరిన ఏడాదిలోనే ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం

# వినికిడి లోపించకుండా..



పెద్ద శబ్దాలు లోపలి చెవిలోని సున్నిత భాగాలకు హాని చేస్తాయి. ఇది వినికిడి ఆ వంటి సమస్యలకు దారితీయొచ్చు. టినిటస్లో చెవితో మోత మోగుతున్నట్టు నిరంకుశంగా వినిపిస్తోంది. వినికిడి వెంటనే తగ్గొచ్చు లేదా క్రమంగా తగ్గుతూ రావొచ్చు. ఎంత అంత ఎక్కువ హాని చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో వినికిడిని కాపాడు కోవటానికి పెద్ద శబ్దాలకు గురికాకుండా చూసుకోవటం, అలాంటి వాతావరణం నుండి బయటపడటం, స్పీకర్ల వంటి వాటి వాల్యూమ్‌ను తగ్గించుకోవడం. ఇలాంటివి సాధ ఇయర్ ప్లగ్స్, ఇయర్మాఫ్స్ వంటి సాధనాలు మేలు చేస్తాయి. ఇవి తీవ్ర శబ్దాలు చెవిల అడ్డుకోవటం ద్వారా వినికిడిని కాపాడతాయి. సంగీత కచేరీలు, ఆటల స్టేడియాలు, ప్రదర్శన వంటి వాటికి వెళ్లినప్పుడు వినికిడి రక్షణ పరికరాలు వాడు కోవటం మంచిది. వచ్చే పరిశ్రమలు, బోరు బావి తవ్వకం వంటి వాతావరణంలో పనిచేసే వారికీ ఇవి మేలు చేస్తాయి.


# చంద్రవంక నగ వన్నెలెక్కువ










అందాన్ని పోల్చడానికి చందమామను మించిన ఉపమానం ఉండదు. అందుకే, ఆ నెలవంక మొగలుల కాలంల నాడే మగువల నగల డిజైన్లలో భాగమైపోయింది. నిజాం రాజ్యంలో చాంద్‌బాలీల రూపంలో చెవిన చేరి చమక్కున మెరిసింది. ఇక, ఆధునిక యుగంలోకి వచ్చేశాం. వాటినెవరు ఎంచుకుంటారనే సందేహాలను పటాపంచలు చేస్తూ.. ఈతరం ఆడపిల్లలూ మెచ్చేస్తున్నారు. చంద్రవంకతో తీర్చిదిద్దిన జ్యూయెలరీ డిజైన్లను ధరించి మురిసిపోతున్నారు. వారి అభిరుచులకు తగ్గట్లే మార్పులూ వచ్చేశాయి. ఒకప్పుడు ముత్యాలతో కనిపించాయి. ఇప్పుడు నవరత్నాలతో నగిషీలు చెక్కుతున్నారు. భారతీయత ఉట్టిపడే టెంపుల్ డిజైన్లతో తీర్చిదిద్దుతున్నారు. అందుకే, చాంద్‌బాలీలే కాదు, నెక్లెస్‌లు, హారాలు, పెండెంట్లు.. ఇలా ఒకటేమిటీ, అన్ని రూపాల్లోకీ తెచ్చేస్తున్నారు. మీరూ వాటినోసారి చూడండి. ఎంత బాగున్నాయో!







# పొట్లంలో అన్నం తిందామా!



**ఎప్పుడూ చేసుకునే** వంటకాలు ఎంత బాగున్నా సరే.. మన నాలుక ఇంకేవో కొత్త రుచులు కోరుకుంటాయి. అలాంటి క్రేవింగ్ సంతృప్తి పరచాలనుకుంటే త్రిపురవాసుల ప్రసిద్ధ వంటకం 'ఆవాన్ బంగయి' ప్రయత్నించండి.

**కావలసినవి :** కప్పు బియ్యం, ఒక చెంచా అల్లం తరుగు, కొద్దిగా కొత్తిమీర తరుగు, కిస్‌మిస్, జీడిపప్పులు చారెడు చొప్పున, రుచికి ఉప్పు, అర ఉల్లిపాయ ముక్కలు, పావు కప్పు చొప్పున క్యారెట్, బీన్స్ ముక్కలు, 3 టేబుల్ స్పూన్ల నెయ్యి, అరటాకులు అవసరం.

**తయారీ:** బియ్యాన్ని ఒక గంట నానబెట్టాలి. తర్వాత నీళ్ల వడకట్టేసి అందులో ఉప్పు, అల్లం, ఉల్లి, బీన్స్, క్యారెట్ ముక్కలు, కొత్తిమీర తరుగు, కిస్మి జీడిపప్పులు, నెయ్యి వేసి కలపాలి. ఒక్కో అరిటాకును శంఖంలా (కోన్) చుట్టి, అందులో సగం వరకూ బియ్యం మిశ్రమాన్ని వేయాలి. పైన కొంత ఖాళీభాగం ఉంచి.. పొట్లం కట్టినట్టు అంచు మడిచేసి, దారంతో విడిపోకుండా కట్టేసి, ఉడితే సరి.. రుచికరమైన 'అవాన్ బంగుయి' సిద్ధం త్రిపుర వాళ్ల ఈ వంటకాన్ని మనమూ చేసి చూద్దామా!

## చెలి చిట్కా

వామును నీళ్ళలో నానబెట్టి ఆ నీటిలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే వాంతులు తగ్గుతాయి.

# వ్యథ: అక్కకు కౌన్సెలింగ్ చేయించండి..



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న** : మా అక్క ఆసుపత్రి అంటే హడలిపోతుంది. ఆమె ఎట్టి పరిస్థితులలోను ఆసుపత్రికి వెళ్లదు. కుటుంబ సభ్యులను కూడ వెళ్లనివ్వదు. ఆమె వయస్సు 50 ఏళ్ళు. కుటుంబసభ్యులను కూడ వెళ్ళలనివ్వదు. ఏదైనా జబ్బు చేస్తే డాక్టరు వద్దకు మేము ఎవరో ఒకరు వెళ్ళి మందులు తెచ్చిబలవంతంగా మింగిస్తాము. నాలుగేళ్ళ క్రితం ఆమె రెండవ కూతురు మానసిక సమస్యలకు గురయ్యింది. ఇంటర్ చదువుతున్న ఆ అమ్మాయి లేనిపోని అనుమానాలు వ్యక్తం చేసేది కాలేజికి వెళ్ళనంటూ మారాం చేసేది. తన గదిలో కూర్చుని స్మార్ట్ ఫోన్‌తో కాలక్షేపం చేసేది. దీనితో మా బావ ఆ అమ్మాయిని సైకియాట్రిస్టు వద్దకు తీసుకెళ్ళి చికిత్స ప్రారంభించారు. అయితే మా అక్క కూతురుని మందులు వాడనివ్వలేదు. ఎలాగోలా ఆమె ఇంటర్ పాసై బి.టెక్‌లో చేరింది. ఇప్పుడు రెండవ సంవత్సరం చదవుతోంది. పూర్తిగా కాలేజి మానేసి గదికే పరిమితం అయ్యింది. కాలేజికి వెళ్ళమంటే ఏడుస్తోంది. మరీ బలవంతం చేస్తే ఆత్మహత్య చేసుకుంటానంటోంది. దీనితో మా బావ ఆమెను సైకియాట్రిస్టు వద్దకు తీసకెళ్లే ప్రయత్నం చేస్తే అక్క అడ్డుకుంటోంది. పెళ్లి కావాల్సిన ఆడపిల్లను పిచ్చిసుపత్రికి తిప్పడం ఏమిటని ప్రశ్నిస్తోంది. నేను మావారు, సన్నిహితులు చెప్పినా వినడం లేదు. ఈ పరిస్థితులు తెలుసుకున్న నా స్నేహితురాలు ముందు మీ అక్కకు చికిత్స చేయించమని సలహా ఇచ్చింది. ఆమె ఆసుపత్రి ఫోబియాతో బాధపడుతున్నదని చెప్పింది సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయించమని సలహా ఇచ్చింది. అప్పటికి తగ్గక పోతే సైకియాట్రిస్టు ద్వారా చికిత్స చేయించక తప్పదని చెప్పింది. ఆసుపత్రి అంటే భయపడే ఆమెకు చికిత్స చేయించడం ఎలాగో అర్థం కావడం లేదు మీరే ఏదైనా సలహా చెప్పండి.

- ఒక సోదరి,చిత్తూరు.



**జవాబు :** అమ్మా మీ స్నేహితురాలు చెప్పినట్టు మీ అక్క ఆసుపత్రుల పట్ల ఫోబియా పెంచుకున్నది. దీనిని శాస్త్రీయంగా నోసోకోమె ఫోబియా అంటారు. ఇతర ఫోబియాల లాగే ఇదొక నిర్ధిష్ట ఫోబియా ఈ సమస్య ఉన్న వ్యక్తులు ఆసుపత్రులను తలుచుకున్న చూసినా భయం ఆందోళన వ్యక్తం చేస్తుంటారు. వీరు వైద్యుల పట్ల కూడ వ్యతిరేకత వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఈ భయం వల్ల వారే కాకుండా ఇతరులు ఆసుపత్రికి వెళ్లకుండా అడ్డుపడుతుంటారు. ఈ ఫోబియాతో బాధపడే వారు ఆసుపత్రి పేరు ఎత్తగానే భయం, ఆందోళనకు గురవు తారు. గుండె దడ, చేతుల్లో చెమటపట్టడం, శ్వాస తీసుకోవ డంలో ఇబ్బంది పడటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి ఆసుపత్రి, వైద్యులు, వైద్య పరికరాలను చూసినపుడు వికారం, వాంతులు రావచ్చు. అయితే కౌన్సెలింగ్ లేదా చికిత్సతో ఈ సమస్యను తగ్గంచవచ్చు. పూర్తిగా నయం చేసే అవకాశం ఉంది. సైకాల జిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయించడం ప్రాథమికంగా చాలా మంచిది. కాగ్నెటివ్ బిహేవియర్ థెరపీ, రిలాక్సేషన్ పద్ధతులు, ఎక్స్పోజర్ థెరపీ ద్వారా క్రమంగా భయం తగ్గిస్తారు. ఒక్కోసారి సమస్య తీవ్రంగా ఉంటే మందులు వాడవలసి ఉంటుంది. కాబట్టి మీ అక్కకు సున్నితంగా నచ్చజెప్పి కౌన్సెలింగ్ ప్రారంభించండి. ఆమె కూతుర్ని తక్షణం సైకియాట్రిస్టు వద్దకు తీసుకుని వెళ్ళండి. ఇప్పటికే మీ అక్క కూతురికి చికిత్సచేయించడం చాల ఆలస్యం చేశారు. డాక్టరు సలహా తీసుకుని మీ అక్కకు కూడ మందులు వాడండి. మీ అక్క సమస్య త్వరగానే తగ్గిపోతుంది. అయితే ఆమె కూతురికి దీర్ఘకాలిక చికిత్స అవసరం.

# థైరాయిడ్‌ను తగ్గించే బ్రెజిల్ నట్స్

బాదం, పిస్తా, జీడిపప్పుల్లా బ్రెజిల్ నాట్స్ కూడా మంచి పోషకాహారం. రోజుకు ఒకటి లేదా రెండు గింజలు నానబెట్టి తినడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో చూడండి..



- బ్రెజిల్ నట్స్ తినటం వల్ల శరీరానికి ప్రొటీన్లు, పీచు, సెలీనియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, భాస్వరం, పొటాషియం, క్యాల్షియం, జింక్, ఐరన్, బి1, బి6, ఇ విటమిన్లు అందుతాయి.
- రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- వీటిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు విస్తారంగా ఉన్నాయి.
- థైరాయిడ్‌ను తగ్గించటంలో సాయపడతాయి.
- కొలెస్ట్రాల్ స్థాయిని అదుపులో ఉంచుతాయి.
- మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఉద్వేగాలను నియంత్రణలో తోడ్పడతాయి.
- క్రమం తప్పకుండా తింటుంటే ఎముకలు, దంతాలు దృఢంగా ఉంటాయి.
- మధుమేహం నుంచి ఉపశమనం కలుగుతుంది. అలర్జీ సమస్య ఉన్నవారికి ఇవి సరిపడవు. అలాంటివారు వీటికి దూరంగా ఉండాలి.
- అలాగే వీటిని మోతాదు మించి తింటే పేగుల్లో సమస్య, మగత, విసుగు, వెన్ను దెబ్బతినటం, గుండెజబ్బులు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.కనుక వైద్యుని సలహాతో తినటం శ్రేయస్కరం.

# ప్రకృతిని శాసించే సాయి



**సత్పురుషులలో శ్రేష్టుడయిన** సాయి పరమేశ్వరుని మరో అవతారం అంటారు హేమాడ్‌పంత్ శ్రీ సాయి సచ్చరిత్ర పదుకొండవ అధ్యాయంలో సాయికి ప్రకృతి శక్తులన్నీ ఆధీనమే. ఏ ప్రకృతి శక్తి అయినా సాయినాథుని ఆజ్ఞను,ఆదేశాన్ని, సంకల్పాన్ని మీరజాల గలదా? సాయి భక్తుడు శ్రీ జి.వి.రామ అయ్యర్. ఆయన కుమారుడే డాక్టర్ జి.ఆర్. విజయకుమార్. విజయకుమార్‌కు బాల్యం నుండి సాయిబాబా తెలుసు. సాయి సచ్చరిత్రా తెలుసు. ఎందుకంటే తండ్రి సాయి భక్తుడు కనుక. విజయకుమార్‌లో సాయి భక్తి అంకురింప లేదు. భక్తి బీజం నాటుకునే సమయం ఇంకా రాలేదు. ఆయన తండ్రి రామ అయ్యర్ మరణించారు. సాయిబాబా వెండి గొలుసు ఆయన మెడలో ఉండేది. ఆ గొలుసుతోనే ఆయనను దహనం చేశారు. మరునాడు విజయకుమార్ తండ్రి ఆస్తికలకొరకు స్మశానానికి వెళ్లి ఆస్తికలు ఏరుతున్నాడు. ఆయన ఆశ్చర్యపోయాడు. తండ్రి ధరించే ఆ వెండి హారం ఏ మాత్రం చెక్కు చెదరలేదు. తండ్రి హారాన్ని తెచ్చి తల్లికి చూపాడు ఇక ఆ హారాన్ని విజయకుమార్‌ని ధరింపమన్నది ఆ తల్లి. అంతటి ఉష్ణోగ్రతకు ఆ హారం కరిగి పోవలసిందే అది సాయి మహత్తు అని గ్రహించాడు. ఇక సాయిపై నమ్మకం ఏర్పడింది. సాయిని ఏ అగ్ని తాకగలదు? ఇది పూనా నగరం. అక్కడి శివాజీనగర్‌లో సాయి మందిరం ఉన్నది. ఆ మందిరంలో గల సాయినాథుని వర్ణ చిత్రపటం నిత్యంభక్తులచే పూజ లందుకునేది. ఆ మందిర నిర్మాణమే ఒక విశేషం. పూనాలో పాన్షేర్ డ్యాం ఉన్నది. 12.7.1961న ఆకస్మాత్తుగా అది కృంగిపోయింది. నీరు వెలుపలకు ప్రవహించి పూనా నగరాన్ని ముంచెత్తింది. ఎంత నష్టం వాటిల్లింది. ఆ ముంపు నీరు శివాజీనగర్‌ను కూడా ముంచి వేసింది. సాయిమందిరం పైన 20, 25 అడుగుల ఎత్తు వరకు వరద నీరు చేరింది. ఆ మందిరం కొన్ని రోజులపాటు బురదలోని వరద నీటిలోను మునిగి ఉంది. వరద తగ్గు ముఖం పట్టిన తరువాత భక్తులందరూ సాయి మందిరం దగ్గర పేరుకుపోయిన బురదను తొలగించారు. వారందరకూ ఒక అద్భుత దృశ్యం కనువిందు చేసింది. ఆ మందిరంలో ఉన్న సాయినాథుని చిత్రపటాన్ని వరద నీరు ఏమి చేయలేకపోయింది. ఇంకా ఔదంబర వృక్షం కూడా కళకళలాడుతూ ఉన్నది. వరదాయి సాయిని వరద నీరేం చేస్తుంది. ఎన్ని రోజులునిల్వ ఉన్నా! సాయి పటం జీవకళ లొలుకుతూ అందరినీ ఆకర్షించింది. ఇది సాయి మహిమే కదా! సాయి మనలను ప్రకృతి విపత్తుల నుండి కాపాడు గాక!

- యం.పి.సాయినాథ్



ఆధ్యాత్మికం

# దీపికకు టాప్ ప్రైజ్

## పాలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డు




**న్యూఢిల్లీ:** ప్రో లీగ్ 2024-25 లో నెదర్లాండ్స్‌పై తన సంచలనాత్మక సోలో గోల్‌కు గాను భారత మహిళా హాకీ మిడ్‌ఫీల్డర్ దీపిక ప్రతిష్టాత్మక ఎఫ్ఐహెచ్ పాలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డును గెలుచుకుంది. 21 ఏళ్ల ఆమె అద్భుతమైన పరుగుతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల ఆదరాన్ని సంపాదించింది. మహిళల విభాగానికి జరిగిన ఓటింగ్‌లో వరల్డ్‌లో అగ్రస్థానాన్ని సంపాదించింది. ఫిబ్రవరి 2025లో భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో జరిగిన ప్రో లీగ్ మ్యాచ్‌లో దీపిక అద్భుతమైన గోల్ చేసి భారత్ విజయానికి కీలకమైంది. భారతదేశం 0-2తో వెనుకబడి ఉండగా, దీపిక హాఫ్‌వే లైన్ దగ్గర బంతిని అందుకుంది, త్వరిత స్టిక్‌వర్క్‌తో డచ్ డిఫెన్స్‌ను ఛేదించి, ఒత్తిడిలో బేస్‌లైన్ వెంట పరిగెత్తింది. తెలివిగా బంతిని డిఫెండర్ స్టిక్ పైకి ఎత్తి, ప్రశాంతంగా గోల్ కీపర్ దాటి వెళ్ళింది. ఈ గోల్ భారత్‌ను తిరిగి మ్యాచ్‌లోకి తీసుకువచ్చింది, మ్యాచ్ 2-2తో ముగిసింది, తర్వాత షూటౌట్‌లో భారత్ విజయం సాధించింది. ఆమె అద్భుతమైన క్షణం అనేక ప్రపంచ నామినీలలో షార్ట్‌లిస్ట్ చేయబడింది మరియు అభిమానుల ఓట్లను గెలుచుకుంది, మహిళల విభాగంలో ఆమెను ప్రత్యేకంగా నిలిపింది. కాగా ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ సీజన్‌లో అత్యంత అత్యుత్తమ మరియు వినోదాత్మక నైపుణ్య క్షణాన్ని అందించిన పురుష మరియు మహిళా క్రీడాకారులకు పాలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డును ఏటా ప్రదానం చేస్తారు. దీపిక విజయం ఆమె వ్యక్తిగత ప్రతిభను మాత్రమే కాకుండా ప్రపంచ వేదికపై భారత మహిళల హాకీ పెరుగుతున్న స్థాయిని కూడా హైలైట్ చేస్తుంది.

# జపాన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లోకి చిరాగ్, లక్ష్య

**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ 2025లో సాత్విక్ చిరాగ్, లక్ష్యసేన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా, మహిళల విభాగంలో డబుల్ ఒలింపిక్ విజేత పివి సింధు టోర్నీ నుండి నిష్క్రమించింది. బుధవారం జరిగిన 2025 జపాన్ ఓపెన్ సూపర్ 750లో లక్ష్య సేన్ మరియు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి చిరాగ్ శెట్టి విజయం సాధించగా, పివి సింధు మరో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించడంతో బిడబ్ల్యుఎఫ్ వరల్డ్ టూర్‌లోకి తిరిగి వచ్చిన తర్వాత అగ్రశ్రేణి భారత షట్లర్లు మిశ్రమ ఫలితాలను ఎదుర్కొన్నారు. చైనాకు చెందిన జెంగ్ జింగ్ వాన్ పై సేన్ 21-11, 21-18 వరుస గేమ్‌ల విజయం సాధించడంతో భారతదేశం ఈ రోజును ఘనంగా ప్రారంభించింది. ఆ తర్వాత పురుషుల డబుల్స్ లో సాత్విక్ మరియు చిరాగ్ లు 21-18, 21-10 తేడాతో విజయం సాధించారు. అయితే, సింధు విజయ ఊపును కొనసాగించలేకపోయింది, ఈ సంవత్సరంలో ఆమె ఐదవ మొదటి రౌండ్ నిష్క్రమణను ఎదుర్కొంది, దక్షిణ కొరియాకు చెందిన సిమ్ యు జిన్ చేతిలో 1521, 14 21 వరుస గేమ్‌లలో ఓడిపోయింది. ఇద్దరు క్రీడాకారిణుల మధ్య ఇది నాల్గవ పోటీ కాగా, మొదటిసారిగా, దక్షిణ కొరియా షట్లర్ పివి సింధుపై విజయం సాధించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో, భారత ఏస్ లక్ష్యసేన్ తన ఐదు మ్యాచ్‌ల పరాజయాల వరుసను తొలి రౌండ్‌లో తక్కువ ర్యాంక్‌లో ఉన్న చైనా షట్లర్‌పై అద్భుతమైన విజయంతో ముగించాడు, 2025లో మూడోసారి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు.




## టెస్ట్ ర్యాంకింగ్స్ టాప్‌లో

# బుమ్రా, జడేజా

## వెనక్కి జైశ్వాల్, శుభమన్ గిల్

**న్యూఢిల్లీ:** ఐసీసీ లేటెస్ట్ టెస్ట్ ర్యాంకింగ్స్ ఇంగ్లాండ్ స్టార్ ఆటగాడు జో రూట్ టెస్టుల్లో నెంబర్ స్థానానికి చేరుకున్నాడు. ఐసీసీ ర్యాంకింగ్‌ను బుధవారం ప్రకటించింది. సహచరుడు బ్రూక్ ను వెనక్కి నెట్టి 888 రేటింగ్ పాయింట్లతో జో రూట్ అగ్ర స్థానానికి దూసుకెళ్లాడు. గత వారంలో నెంబర్ వన్ ర్యాంక్ లో ఉన్న బ్రూక్ (867) మూడో స్థానానికి పడిపోయాడు. టీమిండియాపై ఎడ్జ్ బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 158 పరుగులు చేసిన బ్రూక్ టాప్ కు దూసుకొచ్చాడు. అయితే ఇటీవలే ముగిసిన లార్డ్స్ టెస్టులో 144 పరుగులు చేసిన రూట్ మళ్ళీ తన అగ్ర స్థానానికి చేరుకున్నాడు. ఈ టెస్ట్ రెండు ఇన్నింగ్స్ ల్లో బ్రూక్ విఫలం కావడం అతని ర్యాంక్ దిగజారింది. విలియంసన్ రెండో స్థానంలో స్మిత్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. ఇక ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాళ్ల వెనకపడ్డారు. ఎడ్జ్ బాస్టన్ టెస్టులో రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి 430 పరుగులు చేయడంతో ఒక్కసారిగా 15 స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరిన కెప్టెన్ శుభమన్ గిల్ మూడో టెస్టులో రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి కేవలం 22 పరుగులే చేయడంతో తొమ్మిదో స్థానానికి పడిపోయాడు. ఓపెనర్ జైశ్వాల్ కూడా మూడో టెస్టులో విఫలం కావడంతో నాలుగు నుంచి ఐదో స్థానానికి పడిపోయాడు. లార్డ్స్ టెస్టులో రెండు ఇన్నింగ్స్ ల్లో హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్న జడేజా 34వ ర్యాంక్ కు చేరుకోవడం విశేషం. బౌలింగ్ లో బుమ్రా టాప్ ర్యాంకు నిలబెట్టుకున్నాడు. ఇంగ్లాండ్ తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో బుమ్రా రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి 7 వికెట్లు పడగొట్టాడు. దీంతో 901 పాయింట్లతో ఎవరికీ అందనంత ఎత్తులో టాప్ లో ఉన్నాడు. రెండో స్థానంలో సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలర్ రబడా 851 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. బుమ్రాను మినహాయిస్తే భారత్, ఇంగ్లాండ్ జట్లలో ఎవరూ కూడా టాప్10 లో స్థానం సంపాదించుకోలేకపోయారు. ఆల్ రౌండర్స్ విభాగంలో జడేజా అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు.




## లార్డ్స్ ఫలితం:

# పాయింట్ల పట్టికలో భారత్ డౌన్



### 4వ స్థానానికి దిగజారిన ర్యాంక్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ గడ్డ పై భారత ప్రయాణం పడుతూ లేస్తూ సాగుతోంది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఇంగ్లాండ్‌లో అడుగుపెట్టిన భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓటమి పాలైంది. ఆ తరువాత పుంజుకుని రెండో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించింది. కాగా, లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టు మ్యాచ్‌లో ఆఖరి వరకు పోరాడి ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 22 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఫలితంగా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ పాయింట్ల పట్టికలో లార్డ్స్ ఓటమి భారత్ పై గట్టి ప్రభావాన్నే చూపించింది. భారత్ రెండు స్థానాలు దిగజారి నాలుగో స్థానానికి పడిపోయింది. అటు భారత్ పై గెలిచిన ఇంగ్లాండ్ రెండో స్థానానికి ఎగబాకింది. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆస్ట్రేలియా 100 శాతం విజయశాతం కలిగి 36 పాయింట్లతో డబ్ల్యూటీసీ 2025-27 పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇక ఇంగ్లాండ్ జట్టు ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది. ఓ మ్యాచ్‌లో ఓడిపోయింది. దీంతో ఇంగ్లండ్ 66.670 విజయశాతం 24 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో ఉంది. ఇక మూడో స్థానంలో శ్రీలంక నిలిచింది. లంక జట్టు రెండు మ్యాచ్‌లు ఆడగా ఓ మ్యాచ్‌లో గెలవగా, మరో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఆ జట్టు ఖాతాలో 16 పాయింట్లు ఉండగా విజయశాతం 66.670గా ఉంది. ఇక టీమ్‌ఇండియా నాలుగో స్థానానికి పడిపోయింది. ఈ కొత్త సైకిల్‌లో టీమ్‌ఇండియా ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడగా, అందులో ఓ మ్యాచ్‌లో మాత్రమే గెలిచింది. మరో రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. పర్యవసానంగా ప్రస్తుతం భారత జట్టు ఖాతాలో 12 పాయింట్లు ఉండగా, విజయశాతం 33.330గా ఉంది. అలాగే ఐదో స్థానంలో బంగ్లాదేశ్ ఉండగా, అ జట్టు రెండు మ్యాచ్‌లు అడగా, వాటిల్లో ఒకటి పరాజయం, మరొకటి డ్రాతో ముగించింది. ఇందువల్ల బంగ్లాదేశ్ 4 పాయింట్లను సంపాదించి 16.670 విజయశాతంతో కొనసాగుతోంది. అలాగే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో వెస్టిండీస్ చిట్టచివరిన ఆరో స్థానంలో ఉంది. వెస్టిండీస్ ఇప్పటి వరకూ మూడు మ్యాచ్‌లు అడగా, మూడింటిలోనూ ఓటమి చెంది ఒక్క పాయింట్‌ను కూడా తన ఖాతాలో వేసుకోలేదు. కాగా టీమ్‌ఇండియా ఇంగ్లాండ్‌తో మిగిలిన ఉన్న రెండు టెస్టుల్లో విజయం సాధిస్తే అప్పుడు తన స్థానాన్ని మెరుగుపరచుకునే అవకాశం ఉంటుంది.

# ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో వెల్‌బ్రాక్ ఈత టైటిల్ కైవసం

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో జర్మనీకి చెందిన ఫ్లోరియన్ వెల్‌బ్రాక్ ఈత టైటిల్‌ను తిరిగి కైవసం చేసుకుంది. బుధవారం సింగపూర్‌లో జరిగిన 2025 ప్రపంచ ఆక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఫ్లోరియన్ వెల్‌బ్రాక్ పురుషుల 10 కి.మీ ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ ప్రపంచ టైటిల్‌ను తిరిగి గెలుచుకున్నాడు. ఈ విజయంతో, వెల్‌బ్రాక్ మూడు 10 కి.మీ ఓపెన్ వాటర్ వరల్డ్ టైటిళ్లను గెలుచుకున్న మొదటి ఈతగాడు అయ్యాడు. 2019 మరియు 2023లో తన టైటిళ్లను సాధించడంతో పాటు, ప్రస్తుత సింగపూర్ స్వర్ణాన్ని జోడించాడు. ఇది ఓపెన్ వాటర్ స్విమ్మింగ్‌లో ఫ్లోరియన్ వెల్‌బ్రాక్ యొక్క ఆరవ ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్. జర్మన్ ఆటగాడు ప్రారంభం నుండి దాదాపు మొత్తం రేసులో ముందంజలో ఉన్నాడు. మరియు మాజీ ప్రపంచ ఛాంపియన్ గ్రెగోరియో పాల్ట్రినియరీ చేసిన చివరి దాడిని జర్మనీయన్ అధిగమించాడు. చివరి ల్యాప్‌లో, వెల్‌బ్రాక్ 1:59:55:50 సమయంలో టైటిల్‌ను కాపాడుకున్నాడు. అతడు టోక్యో 2020 ఒలింపిక్స్‌లోను అలాగే, మునుపటి రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో ఈ ఈవెంట్‌ను గెలుచుకున్నాడు. ఇటలీకి చెందిన పాల్ట్రినియరీ 3.70 సెకన్లు వెనుకబడి రజతంతో సరిపెట్టుకున్నాడు, ఆస్ట్రేలియాకు చెందిన కైల్ లీ 2:00:10.3 సెకన్లలో గమ్యస్థానం చేరుకుని మూడో స్థానంలో నిలిచాడు. కాగా తీరంలోని ద్వీప ప్రాంతమైన సెంటోసాలో నీటి నాణ్యత సరిగా లేకపోవడంతో రెండు సార్లు వాయిదా పడిన తర్వాత బుధవారం ప్రపంచ అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఓపెన్ వాటర్ పోటీ జరిగింది.

# వాణిజ్యం

# యుపిఐ వ్యవస్థలోకి కొత్తగా 13 బ్యాంకులు

## విదేశీ జమలకోసం ఎన్‌పిసిఐ ఇంటర్నేషనల్ వ్యవస్థ

**న్యూఢిల్లీ, జూలై 16:** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌కు అనుబంధంగా నడుస్తున్న ఎన్‌పిసిఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ కొత్తగా 13 బ్యాంకులను చేర్చింది. విదేశాల నుంచి కూడా సులభశైలి జమలు చేసుకునేందుకు వీలుగా ఈ బ్యాంకులను కూడా యుపిఐ వ్యవస్థలోకి తెచ్చింది. ఇకనుంచి సింగపూర్‌నుంచి భారత్‌కు సులువుగా యుపిఐ చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ వ్యవస్థ ఈ నెల 17వ తేదీ నుంచే అమలులోకి వస్తుంది. రెండుదేశాలు కూడా పరస్పరం జమలు చేసుకోవచ్చు. విస్తరిస్తూ పోతున్న ఈ వ్యవస్థలోకి ఇపుడు 19 బ్యాంకులు వచ్చిచేరాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు, కరూర్ వైశ్యబ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, సౌత్ ఇండియన్ బ్యాంకు, యూకోబ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, డిబిఎస్ బ్యాంక్ ఇండియా, ఐసిఐసిఐ బ్యాంకు, ఇండియన్‌బ్యాంకు, ఐఒబి, భారతీయ స్టేట్‌బ్యాంకులు యుపిఐ అంతర్జాతీయ వ్యవస్థలోకి వచ్చినట్లు ఎన్‌పిసిఐ వెల్లడించింది. సింగపూర్ నుంచి ఇపుడు ఈ 19 బ్యాంకుల్లో ఏ బ్యాంకుకయినా పంపించుకోవచ్చు. యుపిఐ అమలులో ఉన్న యాప్‌లు భీమ్, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి సాయంతో పంపించుకోవచ్చు. అలాగే బ్యాంకు యాప్‌ల నుంచి కూడా చేసుకునే వెసులుబాటు కల్పించింది. అలాగే భారత్ నుంచి విదేశాలకు కెనరాబ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి, కరూర్ వైశ్యబ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, ఐఒసి, ఎస్‌బిఐ, డిబిఎస్, లిక్విడ్‌గ్రూప్‌లు ఈ సేవలు వినియోగించి పంపించే అవకాశం ఉటుంది. సింగపూర్ భారతీయులు వలసజీవులు, విద్యార్థులకు ఈ వ్యవస్థ ఎంతో ప్రయోజనకారిగా ఉంటుంది. ఎన్‌పిసిఐకి అనుబంధంగా ఎన్‌పిసిఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ సంస్థ 2020 ఏప్రిల్‌లోనే విలీనం అయింది. అంతర్జాతీయ విభాగం కింద ఇపుడు అంతర్జాతీయంగా కూడా సేవలు విస్తరిస్తున్నది.




## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్‌హోల్డర్లకు జొనాంజా!

**న్యూఢిల్లీ, జూలై 16:** ప్రైవేటు రంగానికి చెందిన బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు జులై 19న భేటీ కాబోతోంది. ఈ సమావేశంలో బోనస్ షేర్ల జారీ, మధ్యంతర డివిడెండ్‌పై కీలక నిర్ణయం తీసుకోబోతోంది. ఈ సమావేశంలో బోనస్ షేర్ల జారీకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి బోనస్ షేర్ల జారీ ఇదే తొలిసారి అవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి ఫలితాల ప్రకటనపై జులై 19న బోర్డు భేటీ కాబోతోందని జూన్ 23నే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. తాజాగా బీఎస్‌ఈకి సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఇదే భేటీలో బోనస్ షేర్ల జారీ, మధ్యంతర డివిడెండ్ పైనా చర్చించనున్నట్లు పేర్కొంది. బ్యాంక్ నుంచి ఈ ప్రకటన వెలువడడంతో బుధవారం బ్యాంక్ షేర్లు 1.33 శాతం పెరిగి రూ.2,021 వద్ద గరిష్ఠాన్ని తాకాయి. బోనస్ షేర్ల జారీ అనేది నియంత్రణ సంస్థలు, వాటాదార్ల ఆమోదానికి లోబడి ఉంటుందని బ్యాంక్ తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరానికి గానూ చివరి త్రైమాసికంలో ఒక్కో షేరుపై రూ.22 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. బ్యాంక్ షేర్లు కూడా ఇటీవల కాలంలో దూసుకెళ్తున్నాయి. గత ఏడాదిలో షేరు విలువ 23.01 శాతం పెరగ్గా.. గత ఆరు నెలల్లో 21.46 శాతం మేర లాభపడింది. మూడు నెలల్లో 6.99 శాతం రిటర్నులు ఇవ్వగా.. గత నెలలో 4.07 శాతం మేర పెరిగింది. బ్యాంకు మెరుగ్గా రాణిస్తుండడంతో ఇన్వెస్టర్లకు తీపికబురు అందించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు 2011, 2019లో రెండుసార్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్ స్ప్లిట్‌ను ప్రకటించింది.





## ఐటిసి హోటల్స్ నికర లాభం రూ.133.71 కోట్లు

**ముంబై, జూలై 16:** ఐటిసి హోటల్స్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభంలో సంవత్సరానికి 53.4 శాతం రూ.133.71 కోట్లుగా నమోదు చేసింది. గత సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ 87.16 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 15.5 శాతం పెరిగి 815.54 కోట్లకు చేరుకుంది. ఏడాది క్రితం ..705.84 కోట్ల నుండి వచ్చింది. వడ్డీ, తరుగుదల మరియు పన్ను ముందు లాభం సంవత్సరానికి 33 శాతం పెరిగి, 223.18 కోట్ల నుండి 296.95 కోట్లకు చేరుకుంది. ఈ వ్యాపారం ఆస్తి యజమానులలో దాని ఐకానిక్ బ్రాండ్‌లతో భాగస్వామ్యం కోసం పెరుగుతున్న ఆసక్తిని కొనసాగిస్తోంది. కంపెనీ 4,500కి పైగా కీలతో 50 హోటళ్ల బలమైన పైప్‌లైన్‌ను కలిగి ఉంది. బ్రౌన్‌ఫీల్డ్ ఆస్తుల యొక్క అధిక ప్రాముఖ్యతతో మరియు 2030 నాటికి 20వేలకిపైగా కీలతో 220 కార్యాచరణ హోటళ్ల పోర్ట్‌ఫోలియోను లక్ష్యంగా చేసుకుంది. భారతీయ ఆతిథ్య రంగం 2026ని బలమైన పునాదిపై ప్రారంభించింది. తొలి త్రైమాసికం 2026 అందుబాటులో ఉన్న గదికి ఆదాయం 2025 మేలో కొన్ని రోజులు డిమాండ్‌ను ప్రభావితం చేసినప్పటికీ రెండంకెల వృద్ధిని నమోదు చేసింది. ఐటిసి హోటల్స్ 1,750 కోట్ల నగదు నిల్వలతో రుణ రహిత బ్యాలెన్స్ షీట్‌ను కలిగి ఉంది. సమర్థవంతమైన మూలధన కేటాయింపుతో, పునరుద్ధరణ కొనసాగుతున్న ప్రాజెక్టులపై మూలధనం కోసం 8-10 శాతం పెట్టుబడి పెట్టడం ద్వారా, రాబోయే సంవత్సరాల్లో నగదు ప్రవాహ ఉత్పత్తి బలంగా ఉంటుందని భావిస్తున్నారు. ఐటిసి హోటల్స్ తన ఆదాయంలో 40శాతం ఎఫ్అండ్‌బి వ్యాపారం నుంచి పొందుతుంది. ఇది లిస్టెడ్ పీర్లలో ఎఫ్అండ్‌బి ఆదాయసహకారం 13-35 శాతం. ఐటిసి హోటల్స్ ఎఫ్అండ్‌బి వ్యాపార ఆదాయాలు ఆర్థికసంవత్సరం 23-25తో పోలిస్తే 13శాతం కార్గ్ వద్ద రూ.1,410.30కోట్లకు పెరిగాయి.



# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూలై 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం, భారత్ అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌పై ఇంకా స్పష్టత రాకపోవడంతో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం నష్టాల్లో ట్రేడయిన సూచీలు.. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడి స్వల్ప లాభాల్లో ముగిశాయి. ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 82,534.66 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా దాదాపు నష్టాల్లోనే కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత లాభాల బాట పట్టింది. ఇంట్రాడేలో 82,784.75 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 63 పాయింట్ల లాభంతో 82,634.48 వద్ద ముగిసింది. నిఫ్టీ 16.25 పాయింట్లలాభంతో 25, 212.05వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.94గా ఉంది. మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్‌ఆఫ్‌ఇండియా, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, సన్ ఫార్మా, టాటా స్టీల్, టాటా మోటార్స్, బీఈఎల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.50 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,347 డాలర్ల వద్ద ట్రేడయింది.



# జొమాటో సిఇఒ ప్రైవేట్ జెట్ కొనుగోలు!

**ముంబై, జూలై 16:** ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ వ్యవస్థాపకుడు, సీఈఓ పౌర విమానయాన రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఎల్ఏటీ ఏరోస్పేస్ పేరుతో ఏవియేషన్ వెంచర్‌ను ప్రారంభించిన ఆయన.. తాజాగా ఓ ప్రైవేటు జెట్‌ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. బాంబర్డియర్ గ్లోబల్ సిరీస్‌కు చెందిన లగ్జరీ ప్రైవేటు జెట్‌ను ఎల్ఏటీ ఏరోస్పేస్ కొనుగోలు చేసినట్లు కథనాలు వెల్లడించాయి. ఈ బాంబర్డియర్ విమానం ఈ ఏడాది జూన్ నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టు లోని వీఐపీ బే వద్ద కన్పిస్తోంది. జులై 16 నుంచే దీని కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఆ కథనాల సమాచారం. ఈ విమానం నిర్వహణ, ఇంజినీరింగ్ బాధ్యతలను ఇందమెర్ ఎంజెట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, బర్డ్ ఎగ్జిక్యూజెట్ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ కంపెనీలకు అప్పగించినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ప్రైవేట్ జెట్ మోడల్, ఇతర ఫీచర్స్ గురించి ఇంకా తెలియరాలేదు. దీపిందర్ గోయల్ ఇటీవలే ఓ లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసి వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. గురుగ్రామ్‌లోని డీఎల్ఎఫ్‌లో గల ఈ అపార్ట్‌మెంట్‌ను ఏకంగా రూ.52.3 కోట్లకు సొంతం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. ఈ ఏడాది జూన్ నాటికి దీపిందర్ గోయల్‌కు జొమాటోలో 3.83 శాతం వాటాలున్నాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం.. ఆయన వాటాల విలువ రూ.9,847కోట్లుగా ఉంది. దీంతో గోయల్ నికర సంపద 1.6 బిలియన్ డాలర్ల పైనే ఉన్నట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.



## ఏప్రిలియా నుంచి 177సిసి స్కూటర్

**న్యూఢిల్లీ, జూలై 16:** ఇటలీకి చెందిన స్కూటర్ కంపెనీ ఏప్రిలియా ప్రీమియం శ్రేణిలో ఎస్ఆర్ 175 పేరిట కొత్త స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.1.26 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా నిర్ణయించింది. గతంలో తీసుకొచ్చిన ఎస్ఆర్ 160 స్థానంలో 175 మోడల్‌ను విడుదల చేశారు. లుక్ పరంగా ఇది ఎస్ఆర్ 160 మోడల్‌ను పోలి ఉన్నప్పటికీ అధిక సామర్థ్యం కలిగిన ఇంజిన్ ఉండడంతో మెరుగైన పనితీరు కనబరుస్తుంది. ఈ ప్రీమియం స్కూటర్‌లో 174.7 సీసీ సింగిల్ సిలిండర్ ఎయిర్‌కూల్డ్ ఇంజిన్‌ను త్రీ వాల్వ్ సెటప్‌తో తీసుకొచ్చారు. ఇది 7200 ఆర్‌పీఎం వద్ద 12.92హెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఎస్ఆర్ 160లో 11.27 హెచ్‌పీ మాత్రమే ఉండేది. పీక్ టార్క్ కూడా 13.44ఎన్ఎం నుంచి 14.14 ఎన్ఎం కు పెరిగింది. కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే బ్లూటూత్ కనెక్టివిటీతో వస్తోంది. కాల్ నోటిఫికేషన్‌లు, అలర్ట్‌లు, మ్యూజిక్ కోసం స్మార్ట్‌ఫోన్‌ను దీనికి కనెక్ట్ చేయొచ్చు. ఫ్రేమ్, సస్పెన్షన్, బ్రేక్‌లు, టైర్లు వంటి భాగాలు ఎస్ఆర్160 మోడల్ మాదిరి గానే ఉంటాయి. ఈ స్కూటర్ ముందు, వెనక 14 అంగుళాల టైర్లను అమర్చారు. వెడల్పు 120 సెక్షన్ ఉంటుంది. బ్రేకింగ్ సింగిల్ ఛానల్ ఏబీఎస్‌తో ఉన్న ఫ్రంట్ డిస్క్, వెనక డ్రమ్ బ్రేక్‌తో పనిచేస్తుంది. ఇది రెడ్‌వైట్ లేదా పర్పుల్‌రెడ్ కాంబినేషన్‌లో వస్తోంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.